
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

గురువారం 4 సెప్టెంబరు 2025

ముగ్గురు టీచర్లకు రాష్ట్ర అవార్డులు



డోనమికొరెడ్డి,



ముజీర్



చెన్నయ్య

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ)గా పనిచేస్తున్న సీహెచ్.చెన్నయ్య, ఇందుకూరుపేటలోని ఎంకేఆర్ ప్రభుత్వ హైస్కూల్ ప్లస్‌లో లెక్చరర్‌గా పని చేస్తున్న కే.డోనమికొరెడ్డి, ఇందుకూరుపేట మండలం నరసాపురం ఎంవీఆర్ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ)గా పనిచేస్తున్న ఎస్‌కే.ముజీర్‌లను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అమరావతిలో జరిగే కార్యక్రమంలో వారు ఈ అవార్డులు అందుకోనున్నారు.

రేపు శాంతియుత ర్యాలీ

- మిలాద్ ఉన్ నబి సందర్భంగా నిర్వహణ

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా శుక్రవారం నెల్లూరు నగరంలో శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నట్లు ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. నగరంలోని కోటమిట్ట యూసుఫీయా మసీదులో ర్యాలీ ఏర్పాట్లపై ముస్లిం మతపెద్దలతో బుధవారం ఆయన సమీక్షించారు. ప్రభుత్వం తరఫున అందించాల్సిన సహాయ సహకారాలపై అధికారులతో మాట్లాడి సమన్వయం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నెల్లూరులో 40ఏళ్ల నుంచి మిలాద్ ఉన్ నబీ సందర్భంగా శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నామని, ఈ ర్యాలీలో కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ట్రాఫిక్‌కి అంతరాయం కలుగుతుందని, నగర ప్రజలు ఓపిక, సహనంతో ఉండాలని కోరారు. అందరికీ భోజన, ఇతర సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. మంత్రి పొంగూరు నారాయణ సహాయ సహకారాలు కూడా పూర్తిస్థాయిలో ఉంటాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు జాఫర్‌షరీఫ్, మొయినుద్దీన్, నన్నేసాహెబ్, రియాజ్, హయత్‌బాషా; ఖలీల్, జాఫర్ పాల్గొన్నారు.

మేయర్‌కు పదవీ గండం!?


నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతికి పదవీ గండం పొంచి ఉంది. వైసీపీ తరఫున ఎన్నికైన ఆమెపై అవిశ్వాసం ప్రకటించడానికి అధికార తెలుగుదేశం పార్టీ సిద్ధమైంది. ఇందుకు నవంబరు 24వ తేదీన ముహూర్తంగా నిర్ణయించింది. అదేరోజు అవిశ్వాసానికి నోటీసులు జారీ చేసి, డిసెంబరులో అవిశ్వాసం ప్రవేశపెట్టనున్నది.

\- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

నవంబరు 24న ముహూర్తం

అదేరోజు అవిశ్వాసానికి నోటీసులు

డిసెంబరులో అవిశ్వాసం



2021 నవంబరులో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నగర పరిధిలోని అన్ని కార్పొరేటర్ స్థానాలను వైసీపీ కైవసం చేసుకుంది. ఆ ఎన్నికల్లో అధికార పార్టీ హోదాలో వైసీపీ పలు అక్రమాలకు పాల్పడింది. టీడీపీ తరఫున నామినేషన్లు వేయడానికి కూడా వీలులేని పరిస్థితులు సృష్టించింది. టీడీపీలో బలమైన అభ్యర్థులు అవుతారనుకున్న వారిని బెదిరించింది. వారిపై తప్పుడు కేసులు పెట్టడానికి సిద్ధపడింది. కొంతమందిని ప్రలోభాలకు గురిచేసింది. అధికారం ముసుగులో జరిగిన ఆ ఎన్నికల్లో కార్పొరేషన్ పరిధిలోని 54 డివిజన్లకుగానూ అన్నింటిలోనూ వైసీపీ అభ్యర్థులే గెలిచారు. ఆ పార్టీ తరఫున మేయర్ అభ్యర్థిగా పొట్లూరి స్రవంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

- **అసెంబ్లీ ఎన్నికల తరువాత మారిన సీన్**

అయితే అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో నగరపాలక సంస్థలో సీన్ మారింది. టీడీపీ తలుపులు తెరవడంతో వైసీపీ నుంచి గెలిచిన మెజారిటీ కార్పొరేటర్లు టీడీపీలో చేరిపోయారు. దీంతో కార్పొరేటర్ల సంఖ్యలో వైసీపీ మైనారిటీలోకి పడిపోయింది. ప్రస్తుతం ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేల ఓట్లతో కలిపి టీడీపీకి మొత్తం 44 ఓట్లు ఉండగా, వైసీపీకి కేవలం 11 మంది కార్పొరేటర్లు, ఒక ఎమ్మెల్సీ కలిపి మొత్తం 12 మందే ఉన్నారు. 17, 38వ డివిజన్ల కార్పొరేటర్లు తటస్థంగా ఉన్నారు.

- **నవంబరు 23తో నాలుగేళ్లు పూర్తి**

నాలుగేళ్ల పదవీ కాలం పూర్తి అయితే కానీ మేయర్‌పై అవిశ్వాసం ప్రకటించే అవకాశం లేదు. 2025 నవంబరు 23నాటికి స్రవంతి మేయర్ పదవి చేపట్టి నాలుగేళ్ల కాలం పూర్తి అవుతుంది. ఆ మరుసటి రోజే అంటే నవంబరు24న కార్పొరేటర్లలో 50 శాతం కన్నా ఎక్కువ మంది మేయర్‌పై అవిశ్వాసాన్ని తెలుపుతూ (జిల్లా ఎన్నికల అధికారి) కలెక్టర్‌కు నోటీసులు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన నిర్ణయం టీడీపీలో జరిగిపోయింది. కార్పొరేషన్ పరిధిలోని ప్రజాప్రతినిధులు మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అవిశ్వాసానికి నిర్ణయించుకోగా, రాష్ట్ర పార్టీ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో నవంబరు 24న మేయర్ స్రవంతిపై అవిశ్వాసం ప్రకటిస్తూ మెజారిటీ కార్పొరేటర్లు కలెక్టర్‌కు నోటీసు ఇవ్వనున్నారు.

- **ఏడాది చివరిలో..**

నిబంధనల ప్రకారం నోటీసు అందుకున్న 30 రోజుల లోపు

\- మిగతా 7లో..



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ఆర్ఆర్ఆర్ స్కీం ద్వారా జలవనరుల అభివృద్ధి : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రిపేర్ రెన్నోవేషన్ అండ్ రెస్టోరేషన్ ఆఫ్ వాటర్ బాడీస్ (ఆర్ఆర్ఆర్) స్కీం ద్వారా జిల్లాలోని జలవనరులను అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని శంకరన్‌హాల్లో జిల్లా స్థాయి అమలు పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంటలకు నీటిని సమృద్ధిగా అందించేందుకు నీటి నిల్వ సామర్థ్యం, భూగర్భ జలాలు పెంచటమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని చెప్పారు. డ్వామా, ఇరిగేషన్, భూగర్భజల అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. 220 మైనర్ ఇరిగేషన్ చెరువులను క్షుణ్ణంగా పరిశీలించి, చేపట్టాల్సి అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు. రైతులకు మేలు జరిగేలా జిల్లాలో ఈ పథకాన్ని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ దేశనాయక్, కేంద్రప్రభుత్వ జలవిభాగం శాస్త్రవేత్త పెరిక యాదయ్య, డ్వామా పీడీ గంగాభవాని, భూగర్భజలశాఖ డీడీ శోభన్‌బాబు పాల్గొన్నారు.

మిగిలిన బార్లకు నేటి నుంచి దరఖాస్తులు

- 14 వరకు స్వీకరణ ● 15న లక్కీడిప్
- నోటిఫికేషన్ విడుదల

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మొదటి విడతలో జిల్లా పరిధిలో మిగిలిన బార్లకు ప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. గురువారం (నేటి)నుంచి ఈనెల 14 సాయంత్రం ఆరు గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈనెల 15న కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో లక్కీడిప్ నిర్వహించనున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఓపెన్ కేటగిరిలో 25 బార్లు, కావలి మున్సిపాలిటీ పరిధిలో ఓపెన్ కేటగిరిలో 3 , బుచ్చిరెడ్డిపాలెం నగర్ పంచాయతీలో ఓపెన్ కేటగిరిలో ఒకటి, ఆత్మకూరు మున్సిపాలిటీలో ఓపెన్ కేటగిరిలో ఒకటి, అల్లూరు నగర పంచాయతీ పరిధిలో గీతకులాలకు ఒక బార్.. మొత్తం కలిపి 31 బార్‌లకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

తేలిన లెక్క!





నెల్లూరు రూరల్ మండలంలో లేఅవుట్‌గా మారిన సాగుభూమి

- డెల్టాలో భారీగా తగ్గిన సాగుభూమి
- 30 ఏళ్లలో 45 వేల ఎకరాలు రూపాంతరం
- లేఅవుట్లు, పరిశ్రమలు, చేపల చెరువులుగా మార్పు
- ఆయకట్టును స్థిరీకరించిన ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు
- గజిట్ ప్రకటనకు అధికారుల సన్నాహాలు
- ఆ మేరకు మెట్టలో సాగు పెంపునకు అవకాశం

ఎట్టకేలకు పెన్నా డెల్టాలో వాస్తవ ఆయకట్టు లెక్క తేలింది. దాదాపు ఆరు నెలల పాటు శ్రమించిన ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు ఏ కాలువ కింద ఎంత ఆయకట్టు సాగు అవుతుందో నిర్ధారించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గతేడాది తీసుకున్న కీలక నిర్ణయం సత్ఫలితాలను ఇస్తోంది. ముఖ్యంగా మెట్ట లో సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ఈ లోకలైజేషన్ ప్రక్రియ(వాస్తవ ఆయకట్టు నిర్ధారణ) ఎంతగానో ఉపయోగపడుతుందని వ్యవసాయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. డెల్టాలోని 13 మండలాల పరిధిలో చూసుకుంటే భారీగా సాగు విస్తీర్ణం తగ్గిం ది. దాదాపు 45 వేల ఎకరాల ఆయకట్టు భూమి లేఅవుట్లు, పరిశ్రమలు, చేపలు, రొయ్యల చెరువులుగా మారిపోయింది.

\- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

వాస్తవ ఆయకట్టు నిర్ధారణ వివరాలు (ఎకరాల్లో)..

మండలం	అధికారిక	వాస్తవ	అనధికార	మొత్తం
సంగం	9145	11704	3751	15455
కోవూరు	15819	11149	1036	12185
బుచ్చి	19347	9761	1688	11449
దగదర్తి	13866	11000	556	11556
కొడవలూరు	25964	16840	1621	18461
విడవలూరు	29496	20054	4943	24997
అల్లూరు	27136	26848	710	27558
బోగోలు	9227	3282	69	3351
నెల్లూరు రూరల్	5656	5437	2222	7659
టీపీ గూడూరు	23835	21110	0	21110
ముత్తుకూరు	19590	9910	4812	14722
వెంకటాచలం	15802	8229	4773	13002
ఇందుకూరుపేట	22117	20815	0	20815
మొత్తం	2,47,000	1,76,139	26,181	2,02,321

సోమశిల జలాశయం పూర్తయ్యాక ఏ ప్రాంతానికి ఏ దామాషా ప్రకారం సాగునీటి కేటాయింపులు చేయాలన్నది మూడు దశాబ్దాల క్రితం నిర్ణయించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఆ నిర్ణయం మేరకే ప్రతీ ఏటా సాగు సమయంలో నీటి కేటాయింపులు చేస్తున్నారు. సోమశిల కింద మొదటి హక్కుగా డెల్టా ప్రాంతానికి నీళ్లు ఇచ్చాకే జిల్లాలోని మిగిలిన ప్రాంతాలకు నీళ్లు ఇవ్వాలి. అయితే గత దశాబ్ద కాలంలో డెల్టాలో చాలా వరకూ లేఅవుట్లు వెలిశాయని, పరిశ్రమలు ఏర్పడ్డాయని, చేపలు, రొయ్యల సాగు జరుగుతోందని మెట్ట ప్రాంత రైతులు చెబుతూ వస్తున్నారు. డెల్టాలో తగ్గిన సాగు విస్తీర్ణం మేరకు మెట్ట ప్రాంతం లో స్థిరీకరించాలని కోరుతున్నారు. ఈ విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో గత జూలైలో లోకలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్ ఓ. ఆనంద్.. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలను ఆదేశించారు. అప్పటి నుంచి ఈ రెండు శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఏ సర్వే నంబర్లో భూమి సాగు జరుగుతోంది..? ఏ సర్వే నంబర్లో భూమి సాగు లేకుండా రూపాంతరం చెందింది..? అన్న వివరాలను గుర్తించారు. అనంతరం నివేదికను సిద్ధం చేశారు.

- **భారీగా తగ్గిన విస్తీర్ణం**

డెల్టాలో 2.47 లక్షల ఎకరాల ఆయకట్టు ఇప్పటివరకూ అధికారికంగా ఉంది. అయితే ఇందులో 70 వేల ఎకరాలకు పైగా సాగు లేదు. అలానే డెల్టాలో కొత్తగా 26 వేలకు పైగా ఎకరాల్లో అనధికారికంగా సాగు జరుగుతోంది. ఈ మొత్తాన్ని చూసుకుంటే ప్రస్తుతం డెల్టాలో 2.02 లక్షల ఎకరాల్లో వాస్తవంగా సాగు జరుగుతున్నట్లు నిర్ధారించారు. ఇప్పటి వరకూ ఉన్న అధికారిక లెక్కల ప్రకారం చూసుకుంటే డెల్టాలో తాజాగా సుమారు 45 వేల ఎకరాల విస్తీర్ణం తగ్గుతోంది. అధికారుల లోకలైజేషన్ వివరాల ప్రకారం ఇందులో లేఅవుట్లుగా మారిన భూమి 7551 ఎకరాలు ఉండగా, చేపలు, రొయ్యల గుంటలుగా మారిన భూమి 14,409 ఎకరాల వరకూ ఉంది. ముఖ్యంగా నెల్లూరు రూరల్, బోగోలు మండలాల్లో చాలావరకూ సాగు భూమి తగ్గింది. ఇక్కడ సగానికి పైగా ఆయకట్టు లేఅవుట్లు, చేపల చెరువులుగా మారిపోయాయి. ఇక సంగం మండలంలో అయితే సాగు విస్తీర్ణం 50 శాతం వరకూ పెరిగింది. మొత్తంగా చూసుకుంటే డెల్టా పరిధిలో కోవూరు నియోజకవర్గంలో 87,907 ఎకరాలు(ఐదు మండలాలు కలిపి), సర్వేపల్లిలో 48,834 ఎకరాలు(మూడు మండలాలు), కావలిలో 42,465 ఎకరాలు(మూడు మండలాలు), ఆత్మకూరులో 15,455 ఎకరాలు(ఒక మండలం), నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 7,659 ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు తేలింది.

- **త్వరలో గజిట్..?**

ఆయకట్టు వివరాలు తేల్చిన అధికారులు వీటిని ప్రభుత్వ ఫార్మాట్‌లో సిద్ధం చేస్తున్నారు. ఈ నెలలోనే కాలువల వారీగా జాబితాను కలెక్టర్‌కు అందించనున్నట్లు తెలిసింది. కొత్త వివరాలతో కూడిన ఆయకట్టును నిర్ధారిస్తూ కలెక్టర్ జిల్లా గజిట్‌లో ప్రచురించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. రానున్న రబీ సాగుకు సంబంధించి కూడా ఈ లెక్కల ఆధారంగానే సాగునీటి కేటాయింపులు జరిపే అవకాశమున్నట్లు ఇరిగేషన్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో డెల్టాలో తగ్గిన విస్తీర్ణాన్ని మెట్టలో పెంచేందుకు అవకాశం ఏర్పడింది.

సోమశిలకు 21,710 క్యూసెక్కుల వరద

అనంతసాగరం సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సోమశిలకు ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం 21,710 క్యూసెక్కులు వస్తుండగా, 64.150 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,100, డెల్టాకు 1,350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

టార్గెట్.. రౌడీషీటర్!

- నేరగాళ్లను వేటాడుతున్న పోలీసు శాఖ
- వరుస అరెస్టులు.. ఆపై పీడీ యాక్ట్ నమోదు
- జిల్లాను వీడుతున్న క్రిమినల్స్

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నేర నియంత్రణతోపాటు నేరగాళ్లను అరెస్ట్ చేయడమే లక్ష్యంగా పోలీస్ శాఖలో కదలిక వచ్చింది. రౌడీషీటర్ శ్రీకాంత్, కి'లేడీ' అరుణల అంశం వెలుగులోకి వచ్చాక జిల్లాపై పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా నేరుగా జిల్లాకు వచ్చి నేరస్థులు, రౌడీషీటర్లు తోక జాడిస్తే తీవ్రంగా పరిగణలోకి తీసుకొని, తమదైన శైలిలో ముందుకు సాగాలని పోలీసు అధికారులను ఆదేశించారు. దీంతో ఎస్పీ జీ. కృష్ణకాంత్ పోలీసు అధికారులను అప్రమత్తం చేస్తూ నేర సామ్రాజ్యంపై ఉక్కుపాదం మోపుతున్నారు. రాజకీయ నాయకులు ఫోన్లు చేసి మనవారే అంటున్నా.. 'మీరూ ఇబ్బందులు పడతారు' అంటూ ఎస్పీ సమాధానాలు ఇస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఎస్పీగా ఆయన బాధ్యతలు స్వీకరించాక 300కిపైగా రౌడీషీట్లను ఓపెన్ చేశారు. నెల వ్యవధిలో 70 మంది రౌడీషీటర్లు, వరుసగా నేరాలకు పాల్పడుతున్న వారిని అరెస్టులు చేయించారు. నాలుగు పీడీయాక్ట్‌ల కేసులు నమోదు చేయగా, మరో నాలుగు పీడీ యాక్ట్ కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.



జిల్లా బహిష్కరణకు వెనుకాడం

పదేపదే నేరాలకు పాల్పడేవారిని జిల్లా బహిష్కరణకు వెనుకాడం. ప్రతి నేరస్థుడిపై పటిష్ఠ నిఘా ఉంచాం. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా తక్షణ చర్యలు ఉంటాయి. జిల్లాను ప్రశాంతంగా ఉంచడమే ధ్యేయంగా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. శాంతిభద్రలకు భంగం కలిగిస్తే పీడీ యాక్టు నమోదు చేస్తాం.

\- జీ.కృష్ణకాంత్, ఎస్పీ

'పునాస'కు మంగు!

- పూత నల్లబారి తగ్గిన కాపు ● ఆశించిన స్థాయిలో మామిడికి తగ్గని ధర
- సాగుదారుల్లో నిరాశ, నిస్పృహ

ఉలవపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : 'బంగినపల్లి'లో భారీ నష్టాలు చవిచూసిన రైతును పునాస మామిడి కూడా ముంచేసింది. ఇటీవల కురిసిన వర్షానికి చెట్లపై పూత నల్లబారి వాడిపోవడం, ముందస్తుగా వచ్చిన కాయలు మంగుమచ్చలు తేలడంతో ధర పడిపోయిందని సాగుదారులు వాపోతున్నారు. ఉలవపాడు మండలంలో సుమారు 2వేల ఎకరాల్లో పునాస సాగులో ఉంది. సాధారణ మామిడి సీజన్ ముగుస్తుందనగా పునాస పూత మీదకు వస్తుంది. మే నెల నుంచి మొదలై దాదాపు జనవరి వరకు విడతల వారీగా వెంట వెంటనే పూత, పిందెలతో మూడు కాపుల వరకు కోతలకు అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం ఒక కిలో నాణ్యమైన పునాస మామిడి ధర రూ.40 వరకు పలుకుతోంది. పాక్షికంగా మంగుమచ్చలు కలిగిన



చెట్లపై అక్కడక్కడా ఉన్న మామిడి కాయలు

పునాస రూ.20 పలుకుతుండగా, పూర్తిగా మంగుతో కూడిన కాయలు 10లకే మార్కెట్‌కు వేయాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారు. రెండు నెలల క్రితం కిలో ధర రూ.60 వరకు పలికింది. కేరళాలో ఓనం పండుగ సమయంలో పునాస మామిడి ధరకు రెక్కలు వస్తాయి. ఒక్కోసారి కిలో ధర కాయ నాణ్యతను బట్టి రూ.70 నుంచి 80 వరకు పలుకుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ధరలు పెరిగే అవకాశం లేదని రైతు నిరాశ చెందుతున్నాడు.

- **వ్యాపారుల సిండికేట్**

ఉలవపాడుతో పాటు చుట్టు పక్కల మండలాల్లోని పునాసకు పెద్ద మార్కెట్ ఉలవపాడు కావడంతో ఇక్కడ ఐదారు మార్కెట్లు వెలిశాయి. వ్యాపారులంతా ఒకే మాటపై ధర నిర్ణయించి కొనుగోళ్లు చేస్తుంటారు. వారు నిర్ణయించిందే ధర. లేదంటే కాయల కోతలు నిలిచిపోతాయి. దీంతో చెట్లకే కాయలు పరిమితమై పండిపోతుంటాయి. దీంతో రైతులు తప్పని సరిగా సిండికేట్ వ్యాపారులకు తలొగ్గక తప్పడం లేదు.



ఎగుమతి కోసం పునాస మామిడి కాయలను గ్రేడింగ్ కేస్తున్న కూలీలు

కోవూరు
సర్వేపల్లి

నేటి నుంచి పెంచలకోనలో పవిత్రోత్సవాలు

రాపూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాపూరు మండలం పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం నుండి ఆదివారం వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి బుధవారం తెలిపారు. నాలుగు రోజులపాటు స్వామివారికి విశేష పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించి ఆదివారం మహా పూర్ణాహుతి, మహాకుంభప్రోక్షణ జరుగుతాయన్నారు. సకల దోషప్రాయశ్చిత్తం కోసం నిర్వహిస్తున్నామన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10104
వెండి కిలో ధర	రూ. 126400
వెండి ఒక గ్రాము	రూ. 129.40



ప్రాథమిక విద్యకు వెలుగు
చెంచులక్ష్మమ్మ, ఎంఈవో-2, కోవూరు

మోడల్ ప్రైమరీలతో ప్రాథమిక విద్యకు వెలుగు చేకూరిందని కోవూరు మండల విద్యాశాఖాధికారి 2 పై చెంచులక్ష్మమ్మ అన్నారు. మండలంలో 14 మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా డిజైన్ చేశారన్నారు. దీంతో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మోడల్ ప్రైమరీ పాఠశాలలు ఉన్నాయన్నారు.

?. 'తల్లికి వందనం' సక్రమంగా అందిందా?
!. అర్హులైన విద్యార్థులందరికీ అందింది. ప్రత్యేక కారణాల వల్ల కొంతమందికి అందలేదు.

?. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారా?
!. మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశాం.

?. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర కిట్లు అందరికీ అందించారా?
!. బ్యాగు, బూట్లు, నోటు పుస్తకాలు, బెల్టు, యూనిఫాం అందరికీ అందించాం.

?. మధ్యాహ్న భోజనం సక్రమంగా ఉండడం లేదన్న ఫిర్యాదులపై చర్యలేమైనా తీసుకున్నారా?
!. పేరెంట్స్ కమిటీ ఫిర్యాదు చేసిన ప్రతీ చోటా చర్యలు తీసుకున్నాం. నాణ్యమైన భోజనం అందేలా చర్యలు చేపట్టాం.

?. మోడల్ ప్రైమరీ పాఠశాలలతో ప్రయోజనం ఉందా?
!. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ప్రతీ తరగతికి ఓ ఉపాధ్యాయుడు ఉంటారు. దీంతో అన్ని సబ్జెక్టుల్లో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతుంది. ప్రాథమిక పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు తప్పకుండా మెరుగుపడతాయి.

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)

గణేశుడి నిమజ్జనం

కోవూరు, సెప్టెంబరు 3, (ఆంధ్రజ్యోతి) మండలంలోని పలు గ్రామాల్లో గణేశుడి విగ్రహాల నిమజ్జనం బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. పాటూరు, పోతిరెడ్డిపాళెం, గంగవరం, వేగూరు గ్రామాల్లో గణేశుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు. గంగవరం గ్రామం దళితవాడలో స్థానిక యువత ఉత్సాహంగా ఊరేగింపు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని కొలువుతీర్చి పుష్పాలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉభయకర్తగా పాటూరు నీటి సంఘాల ఉపాధ్యక్షులు శింగారెడ్డి ల్మీనరసారెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు తలారి వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోకు సన్మానం


ఎంఈవోను సత్కరిస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

వెంకటాచలం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం నూతన ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన వీ సుధీర్ ప్రేమ్ కుమార్‌ను బుధవారం ఏపీటీఎఫ్ నేతలు ఘనంగా సన్మానించారు. విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేస్తానని ఎంఈఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల నేతలు గుర్రం వెంకటేశ్వర్లు, డి శ్రీనివాసులు రెడ్డి, చేవూరు సుబ్బారావు, ఓ సురేష్, శుభహాన్, జనార్దన్ రెడ్డి, చంద్రశేఖర్, ఎస్‌వీ రమేష్, గంజర బోయిన మాధవరావు, నర్సింహయ్య, నరసింహా రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సురక్ష పత్రాలను పరిశీలించండి

మనుబోలు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 2023లో వైసీపీ ప్రభుత్వం సురక్ష కార్యక్రమం కింద ఇచ్చిన క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్లను పరిశీలించాలని తహసీల్దార్ రమాదేవి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె వీఆర్‌వోలతో సమీక్షించారు. గతంలో ఇచ్చిన క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లన్నీ ఒక్కసారిగా పెండింగ్ లాగిన్‌లోకి వచ్చాయన్నారు. 4వేల పత్రాలపై విచారణ చేసి సరిగా ఉన్నాయా, లేదా తేల్చాలని అధికారులు ఆదేశించారన్నారు. సక్రమంగా లేనివాటిని తిరస్కరించి, కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. చాలా పత్రాలలో కులం తప్పుగా ఇచ్చినట్లు గుర్తించామన్నారు. త్వరలోనే వీటన్నింటిపై పరిశీలన, విచారణ పూర్తిచేయిస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్, ఆర్‌ఐ అరుణ్‌బాబు సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు
● వివిధ పనులకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కొడవలూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను పట్టణాలకు ధీటుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కొడవలూరు మండలం యల్లాయపాలెం గ్రామంలో రూ.1 కోటి 10లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రోడ్ల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాలలో బుధవారం ఆమె పాల్గొన్నారు. యల్లాయపాలెంలో రూ.30 లక్షలతో నిర్మించిన అంతర్గత రోడ్లకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. అనంతరం 40 సంవత్సరాలుగా నిర్మాణానికి నోచుకోని రూ.65 లక్షలతో దాసరిపాలెం వద్ద మెయిన్‌రోడ్డు, రూ. 10 లక్షల వ్యయంతో ముస్లిం కాలనీలో సీసీ కం బీటీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందిస్తోందన్నారు. 14 నెలల కాలంలోనే కొడవలూరు మండలంలో రూ.3 కోట్ల 45 లక్షలతో అభివృద్ధి పనులు చేసినట్లు ఆమె వివరించారు. పాటూరు-యల్లాయపాలెంల మధ్య అధ్వాన్నంగా ఉన్న రోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షలతో ప్రతిపాదనలు పంపుతున్నామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. 'పల్లెపండుగ' కార్యక్రమం ద్వారా గ్రామీణాభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లునాయుడు, నీటి సంఘం అధ్యక్షుడు కేతు వెంకటరమణారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జీవీఎన్ శేఖర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వంశీధర్ రెడ్డి, ఎంపీటీసీ గరికపాటి రాజేంద్రకుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు రాఘవేంద్ర, భూలోకం విజయ్‌కుమార్, టీడీపీ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్, తదితరులు పాల్గొన్నారు.

విడవలూరు : రైతు సంక్షేమానికి నిస్వార్థంగా పని చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచించారు. విడవలూరులోని సాయిబాబా మందిరంలో పార్లపల్లి, విడవలూరు, వరిణి ప్రాథమిక వ్యవసాయ కో ఆపరేటివ్ సొసైటీ చైర్‌పర్సన్లు వేగూరు చంద్రారెడ్డి, పొన్నలూరు పురందర్ రెడ్డి, కొడిమేర్ల వేంకటేశ్వర్లు, పర్సన్లు రామసుబ్బారెడ్డి, వీ కామేశ్వరి, చింతల గింజల కృష్ణ, తిరకాల నాగేశ్వరరావు, నాటారు విజయకుమార్, కుడుముల వెంకటస్వామి ప్రమాణస్వీకారోత్సవ సభకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి బుధవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత పార్లపల్లి, విడవలూరు, వరిణి సొసైటీ కార్యదర్శులు రాఘవయ్య, రవి, సుధీర్‌లు నూతనంగా నియమితులైన చైర్ పర్సన్, పర్సన్‌లచే ఎమ్మెల్యే సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ అడపాల శ్రీధర్ రెడ్డి, ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, మండలాధ్యక్షుడు హరిరెడ్డి, నాయకులు పూండ్ల అచ్యుత్ రెడ్డి, వెల్లంపల్లి దిలీప్, శ్యాంబయ్య, వంశీకృష్ణా రెడ్డి, కొమ్మిరెడ్డి మురళీ రెడ్డి, శ్రీనివాసులు, శ్రీధర్‌నాయుడు, తాతా రమేష్, ఎస్‌కె రఫీ, సత్యవోలు సత్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో ఆధ్వర్యంలో పునరావాస ఏర్పాట్లపై గ్రామసభ


మాట్లాడుతున్న ఆర్డీవో నాగ అనూష

ముత్తుకూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పునరావాసం, మౌలిక వసతుల కల్పనపై బుధవారం నేలటూరు గ్రామంలో ఆర్డీవో నాగ అనూష ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఇటీవల కలెక్టర్ ఆనంద్ నేలటూరులో పర్యటించి గ్రామస్తుల సమస్యలు తెలుసుకోవడంతో పాటు పునరావాసానికి సంబంధించి త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం కాలుష్య నియంత్రణ మండలి అధికారి అశోక్‌తో కలిసి ఆర్డీవో నేలటూరు దళితవాడ పట్టపుపాలెం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న సమస్యల ను తాత్కాలికంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నాణ్యతతో కూడిన నిర్మాణాలు చేపట్టాలని మెరుగైన పునరావాసం కల్పించాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు స్వప్న, రెవెన్యూ అధికారులు, టీడీపీ నాయకులు, మత్స్యకార కాపులు, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధవరంలో 'పొలం పిలుస్తోంది'!

రాపూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాపూరు మండలంలోని సిద్ధవరం యూనిట్‌లో మండల వ్యవసాయాధికారి సోమ సుందర్ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పీఎండీ ఎస్‌పై వ్యవసాయశాఖాధికారులు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వ్యవసాయాధికారి శ్యాం సుందర్ మాట్లా డుతూ రైతులు పీఎండీఎస్ వేసి భూసారాన్ని పెంచుకోవాలన్నారు. పీఎండీఎస్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మనుబోలు: వరిసాగులో మెళకువలపై మండలంలోని జట్లకొండూరు గ్రామంలో బుధవారం వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ దేవసేన మాట్లాడుతూ వరిసాగులో నీటియాజమాన్యం, ఎరువుల యాజమాన్యం, విత్తనశుద్ధి, విత్తనాల ఎంపిక తెలుసు కోవాలన్నారు. ఎకరానికి 500ఎంఎల్ పీఎస్‌బి, కేఆర్‌బీలను తగి నంత పసుపు ఎరువులో కలిపి వాడాలన్నారు. నానో యూరియా, నానో డీఏపీలను రైతులు వాడాలన్నారు. వ్యవసాయాధికారి వెంకట కృష్ణయ్య, టీడీపీ నాయకులు వెందోటి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

టేకు చెట్లు నరికేశారు!
● బీజేపీ, కాపు నేతల నిరసన

పొదలకూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తన పట్టా పొలంలో ఉన్న 100 టేకు చెట్లను పొదలకూరుకు చెందిన టీడీపీ నాయకులు కొందరు అక్రమంగా నరికి సొమ్ము చేసుకున్నారని నెల్లూరు చెందిన కె రాజేశ్వరమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పొదలకూరు మండలంలోని మరుపూరు గ్రామ సమీపంలో ఉన్న తన పొలం వద్ద బీజేపీ, కాపు, బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రాజేశ్వరమ్మ మాట్లాడుతూ మరుపూరు గ్రామ సమీపంలో తమకు 20.98 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, అందులో సుమారు 20 ఏళ్ల వయస్సు కలిగిన టేకు చెట్లను 9 రోజుల క్రితం టీడీపీకి చెందిన కొందరు నాయకులు నరికేశారని చెప్పారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. ఇంతవరకు పోలీసు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. బీజేపీ నాయకులు దాసరి సురేంద్రబాబు, చొప్పా వెంకటేశ్వర్లు, గురుస్వామి, కాపు, బలిజ సంఘం నాయకులు పాముూరు కృష్ణయ్య, తోట పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

మస్టర్లు వేయడంలో జాగ్రత్తలు తీసుకోవాలి
● హౌసింగ్ ఈఈ మోహన్‌రావు


మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ మోహన్‌రావు

మనుబోలు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గృహనిర్మాణ పథకం కింద ఇల్లు నిర్మించుకునే వారికి మస్టర్లు వేయడంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు జాగ్రత్తలు తీసుకోవాలని హౌసింగ్ ఈఈ మోహన్‌రావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్ష చేశారు. మండలంలో స్వతహాగా నిర్మించుకునే ఇళ్ళు వేగవంతం చేయించాలన్నారు. ఎంతమేరకు పనిపూర్తిచేస్తారో అంతవరకే బిల్లులు పెట్టాలన్నారు. ఇంటిబిల్లులు ఎక్కడా పెండింగ్ లేవన్నారు. ప్రభుత్వం ఇప్పుడు బీసీ, ఎస్సీలకు అదనంగా రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు ఇస్తోందన్నారు. దీని గురించి వారికి అవగాహన కల్పించి ఇళ్ళు వేగంగా నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమలో ఎంపీడీవో జలజాక్షి, హౌసింగ్ ఏఈ. శరత్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనువాసులు, ఏపీవో రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లను లాభాల బాట పట్టిస్తాం..
● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి


ఎమ్మెల్యే సోమిరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

పొదలకూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను లాభాల బాటలోకి తీసుకెళతామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. పొదలకూరులో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమక్షంలో బుధవారం పొదలకూరు పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడిగా తలచీరు మస్తాన్‌రావు, డైరెక్టర్‌గా కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, గంటా మల్లికార్జున్‌యాదవ్ ప్రమాణ స్వీకారం అట్టహాసంగా నిర్వహించారు. పొదలకూరు ఆర్టీసీ బస్టాండ్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి, ఏపీ కనీస వేతన బోర్డు చైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసరెడ్డి, ఏపీ ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జడ్. శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడులకు భారీ గజమాలతో నాయకులు ఘన స్వాగతం పలికారు. రైతులకు రుణాలు, ఎరువులు, విత్తనాలు అందించడంతో పాటు ధాన్యం కొనుగోలులో ముందంజలో ఉండాలని అధికారులకు సూచిం చారు. గత ప్రభుత్వంలో వ్యవసాయ శాఖను, మైక్రో ఇరిగేషన్‌ను పూర్తిగా మూసేశారన్నారు. రూ.93 లక్షలతో పొదలకూరు సీహెచ్‌సీకి డయాలసిస్ యూనిట్‌తోపాటు పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. కాకాణి ఎమ్మెల్యేగా మంత్రిగా సొంత మండలానికి చేసింది ఏమీ లేదన్నారు. సర్వేపల్లిలో రైతు బృందాలకు 11 డ్రోన్లు ఇచ్చామన్నారు. నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలను అక్రమ కేసుల్లో ఇరికించారని, ఆ పాపం నేడు అనుభవిస్తు న్నారన్నారు. రాబోయే పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 19 ఎంపీటీసీలు, 30 సర్పంచ్‌లతోపాటు జడ్పీటీసీని గెలిపించుకుని అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొద్దుకూరు మల్లికార్జున్‌నాయుడు, గుదె రామకృష్ణ, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, పులిపాటలి వెంకటరత్నం నాయుడు, జనసేన నాయకులు బొబ్బేపల్లి సురేష్ నాయుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోన ఆలయాల హుండీల లెక్కింపు


హుండీల నగదును లెక్కిస్తున్న సిబ్బంది

రాపూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన ఆలయాల హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. 84 రోజులకు గాను స్వామి, అమ్మవారు, ఆంజనేయ స్వామి ఆలయాల హుండీలు లెక్కిం చగా ద్వారా రూ.1,13,12,632 నగదు, మిక్స్‌డ్ బంగారు ఆభరణాలు 0.210 గ్రాములు, 4250 గ్రాములు వెండి, పలు దేశాల కరెన్సీ నోట్లు ఉన్నాయి. అలాగే శ్రీవారి నిత్యాన్నదాన హుండీ ద్వారా రూ.4,65,942 ఆదాయం వచ్చింది. జిల్లా దేవదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె జనార్దన్ రెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాస్, ప్రధాన అర్చకులు, అవుట్ పోస్టు పోలీసు సిబ్బంది, ఆలయ సిబ్బంది హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారని ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. హుండీల ద్వారా వచ్చిన నగదును ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పెంచలకోన బ్రాంచ్‌లో జమ చేస్తామన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి
డీసీహెచ్ఎస్ పరిమళ


రోగులతో మాట్లాడుతున్న పరిమళ

వెంకటాచలం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ పరిమళ సూచించారు. వెంకటాచలంలోని సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని (సీహెచ్‌సీ) బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆసుపత్రిలోని వార్డులు, ఓపీ విభాగం, ఫార్మసీ తదితర వాటిని పరిశీలించారు. అలాగే వైద్య సేవల కోసం వచ్చిన రోగులకు అందిస్తున్న వైద్య సేవలు గురించి నేరుగా రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తమ దృష్టికి ఫిర్యాదులు వస్తే సహించేదే లేదని హెచ్చరించారు. రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

డప్పు కళాకారులకు ప్రోత్సాహం


డప్పులు అందజేస్తున్న టీఎన్ నాయుడు

రాపూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాపూరు మండలంలోని శానాయ పాలెంలో డప్పు కళాకారులకు తిరుపతి పార్లమెంటు వాణిజ్య ప్రధాన కార్యదర్శి టీఎన్ ప్రసాద్ నాయుడు ప్రోత్సాహం అందజేశారు. సుమారు రూ. 50 వేల వితరణ చేసి 25 మందికి డప్పులు అందజేశారు. కళలను ప్రోత్సహించడంలో భాగంగానే డప్పులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి నువ్వుల శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పేద, బడుగు వర్గాలకు అండగా జనసేన


చీరలు అందజేస్తున్న సురేష్

ముత్తుకూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పేద, బడుగు బలహీన వర్గాలకు అండగా జనసేన పార్టీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని సర్వేపల్లి నియోజకవర్గం సమన్వయ కర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు తెలిపారు. మండల సీనియన్ నాయకులు రహీం అధ్యక్షతన ముత్తుకూరు గిరిజన కాలనీలో బుధవారం ఏఎంసీ డైరెక్టర్ గుమినేని వాణిభవానీ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. గిరిజనుల మధ్య కేక్ కట్ చేసి, చీరలు పంపిణీ చేశారు. పవన్‌కళ్యాణ్ ఇచ్చిన సూచనలు, సలహాలను పాటిస్తూ సేవాభావంతో ముందుకు వెళ్తున్నామన్నారు. సందూరి శ్రీహరి, బోలా అశోక్, కావలి మస్తాన్, పల్లాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

వినాయక నిమజ్జనంలో విషాదం
● సముద్రంలో కొట్టుకుపోయిన యువకుడు


నన్నం జశ్వంత్‌కుమార్

మనుబోలు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏడు రోజులపాటు కాలనీలో గణేశుడిని ఏర్పాటు చేసుని, భక్తితో పూజలు చేశారు. గ్రామోత్సవం చేసి గణపయ్యకు మొక్కులు తీర్చుకున్నారు. చెరువులో కాకుండా ఈ దఫా సముద్రంలో గణేశ్ నిమజ్జనం చేయాలని నిర్ణయించుకున్నారు. మండపం నిర్వాహకులు, కాలనీ యువకులు, పిల్లలు ఆడుతూ, పాడుతూ సముద్రం వరకు వెళ్లారు. నిమజ్జనం చేసే క్రమంలో ఓ కుర్రాడు సముద్రంలో మునిగిపోయాడు. దీంతో ఒక్కసారిగా అందరూ కన్నీటిపర్యంతమయ్యారు. ఈ సంఘటన తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం శ్రీనివాసనత్రం బీచ్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని పిడూరు మిక్సిడ్ కాలనీ వద్ద రామమందిరం సమీపంలో గణేశ్ మండపం ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి వినాయకుడి గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం పిడూరు నుంచి సముద్రంలో నిమజ్జనం చేసేందుకు తీసుకెళ్లారు. కాలనీకి చెందిన నన్నం రామయ్య కుమారుడు జశ్వంత్‌కుమార్ (17) కమిటీ సభ్యులతో కలిసి వెళ్ళాడు. కాసేపట్లో నిమజ్జనం చేయబోతుండగా ముందు గానే జశ్వంత్‌తో పాటు అతని స్నేహితుడు సముద్రంలోకి వెళ్ళగా అలకు కొంతదూరం జశ్వంత్ స్నేహితుడు వెళ్ళిపోగా, స్నేహితుడిని కాపాడేందుకు జశ్వంత్ వెళ్ళి బయటకు లాగే క్రమంలో మరో అల జశ్వంత్‌ను లాగేసుకుంది. తరువాత జశ్వంత్ కానరాలేదు. దీంతో అక్కడున్న వారంతా ఆందోళన చెందారు. కొద్దిసేపటికి అలతో పాటు జశ్వంత్ తీరానికి కొట్టుకువచ్చాడు. వెంటనే జశ్వంత్‌కు చికిత్స అందించేందుకు గూడూరుకు తరలించే క్రమంలో మార్గ మధ్యంలోనే ప్రాణాలు వదిలాడు. మృతుడు మనుబోలు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు చదివాడు. ప్రస్తుతం ఆటో నడిపేవాడు. చేతికి అందివచ్చిన కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. దీంతో పిడూరు మిక్సిడ్ కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి. ఎస్‌ఐ శివరాకేష్ మృతుడి నివాసానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిమజ్జనంలో గొడవ : ఒకరిపై దాడి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహ నిమజ్జన సమయంలో తలెత్తిన గొడవతో ఒకరిపై దాడి చేసినట్లు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని మూలాపేట రావిచెట్టు సెంటర్‌కు చెందిన కృష్ణ శివగిరి కాలనీలో చిల్లర అంగడి నిర్వహిస్తున్నాడు. ఈ నెల 1వ తేదీన వినాయక నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతుండగా 'మా బొమ్మ దగ్గర నీకేం పనిరా..' అంటూ స్థానికుడు పెంచలయ్య తన అనుచరులతో కలిసి అడ్డుకున్నాడు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. దీనిని మనసుల్లో పెట్టుకున్న పెంచలయ్య మంగళవారం రాత్రి తన అనుచరులతో కృష్ణ ఇంటికి వెళ్లి అతనిపై దాడి చేశాడు. అడ్డుకోబోయిన కృష్ణ భార్య, తల్లిని తోసేశారు. బాధితుడు బుధవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాల్కనీ నుంచి పడి పదో తరగతి విద్యార్థి మృతి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బాల్కనీ నుంచి ఓ బాలుడు కిందపడి మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని విజయలక్ష్మీనగర్ గాయత్రి నిలయం రెండో అంతస్థులో ఎం రాజు, సుమతి దంపతులు నివసిస్తున్నారు. వారికి వంశీకృష్ణ(15), మహేంద్ర సంతానం. వంశీకృష్ణ సమీపంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. బుధవారం అతను స్కూల్‌కు వెళ్లేందుకు ఇంటి బాల్కనీలో బ్యాగ్ సర్దుకుంటుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు. గమనించిన వాచ్‌మన్ విషయాన్ని రాజుకు తెలియజేయడంతో ఆయన హుటాహుటిన కిందకు వచ్చి అపస్మారక స్థితిలో ఉన్న కుమారుడిని కిమ్స్ వైద్యశాలకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతిచెందినట్లు నిర్ధారించారు. తండ్రి వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

మద్యం కోసం డబ్బివ్వలేదని బ్లేడ్‌తో దాడి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం తాగేందుకు డబ్బులడిగితే ఇవ్వలేదని ఓ వ్యక్తి బ్లేడ్‌తో ఇద్దరిపై దాడి చేశాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని వెంకటేశ్వరపురానికి చెందిన వలి, నవాబుపేటకు చెందిన హరిప్రసాద్ అనే చిరు వ్యాపారులు ఇద్దరు స్నేహితులు. మూడురోజుల కిందట వారు నగరంలోని పూలే విగ్రహం వద్ద మాట్లాడుకుంటుండగా గుర్తుతెలియని వ్యక్తి వారి వద్దకు వచ్చాడు. తాగేందుకు డబ్బులు ఇవ్వాలని, లేకపోతే అంతు చూస్తానని బెదిరించాడు. వారు డబ్బులు లేవని చెప్పడంతో తన వద్దనున్న బ్లేడ్‌తో వలి, హరి ప్రసాద్‌పై దాడి చేసి పరారయ్యాడు. బాధితులు బుధవారం బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడు ఆలయాల్లో చోరీ
● నగదు, బంగారం అపహరణ


దుండగులు పగలకొట్టిన హుండీ

కలిగిరి, సెప్టెంబరు 3(ఆంధ్ర జ్యోతి): మండలంలోని మూడు ఆలయాల్లో మంగళవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. హుండీలను పగలగొట్టి అందులోని నగదు, స్వామి, అమ్మవార్ల బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లారు. బుధవారం ఉదయం గుర్తించిన స్థానికులు, పూజారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు.. మండలంలోని నాగసముద్రం పంచాయతీ అంబటివారిపాలెంలో ఉన్న రామాలయం, వినాయక స్వామి ఆలయాల్లో, నాగిరెడ్డిపాలెంలోని రామాలయంలో తలుపులు పగలగొట్టి చోరీకి పాల్పడిన దుండగులు హుండీలు పగలగొట్టి నగదు, సుమారు లక్ష రూపాలయ విలువైన నాలుగు తాళిబొట్లను అపహరించుకెళ్లారు. ఒక్కో హుండీలో సుమా రు రూ.10వేలకు పైగా నగదు ఉండవచ్చని స్థానికులు పేర్కొన్నారు. అంబటివారిపాలెం శివార్లలో ఉన్న పొలిమేర గంగిరెడ్డి ఇంటి తలు పులు పగులకొట్టి చోరీకి యత్నించగా ప్రస్తుతం ఆ ఇంట్లో ఎవరూ కాపురం లేకపోవడతో అక్కడ వారికి ఏమీ లభ్యం కాలేదు. సమా చారం అందుకున్న పోలీసులు, క్లూస్‌టీం సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని వేలిముద్రలు, వివరాలు సేకరించారు. కేసు నమోదుచేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ ఉమాశంకర్ తెలిపారు.

గిరిజన మహిళలపై వైసీపీ మూకల దాడి

ఇందుకూరుపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు పంచాయతీ రాపూరు డొంకలో బుధవారం గిరిజనులు వినాయకుడి గ్రామోత్సవం నిర్వహిస్తుండగా వైసీపీ అల్లరి మూకలు ఓ గిరిజన మహిళపై దాడి చేశారు. మద్యం సేవించిన వైసీపీ కార్యకర్తలు వాసు, సాయి, రాజశేఖర్, వంశీ, సృజన్‌కుమార్, గిరీష్ ఊరేగింపునకు అడ్డంగా బైకును పెట్టి గిరిజన యువకులపై దాడి చేశారు. అడ్డొచ్చిన గిరిజన మహిళపై అసభ్యంగా ప్రవర్తించారు. ఆమెపై దాడి చేసి జాకెట్ చించివేశారు. ఈ సంఘటనపై జిల్లా ఉన్నతాధికారులు, పోలీసులు స్పందించి, అల్లరి మూకలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాపూరుడొంక గిరిజనులు కోరారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	110
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	226

కోడిగుడ్ల ధర (100): 570

రేపు పెన్షన్ భవన్‌లో గురుపూజోత్సవం

● జిల్లా వార్షిక సర్వసభ్య సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని భక్తవత్సలనగర్ పెన్షన్ భవన్‌లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురుపూజోత్సవం, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ వార్షిక సర్వసభ్య సమావేశం జరుగుతాయని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, జిల్లా ప్రధాన కార్యదర్శి మూర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9గంటలకు సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారని తెలిపారు. సంఘం గౌరవాధ్యక్షుడు విరవు బాలసుబ్రహ్మణ్యం, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి ప్రభుదాస్ హాజరవుతారని, జిల్లాలోని ప్రభుత్వ పెన్షనర్స్ అందరూ పాల్గొనాలని కోరారు.

న్యూస్ బాక్స్

'ఇన్‌స్పైర్'కు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో శాస్త్రీయత, సృజనాత్మకతను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో నిర్వహించే ఇన్‌స్పైర్ అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్నీ మేనేజ్‌మెంట్లకు చెందిన పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదివే బాలబాలికలు ఇందులో పాలుపంచుకుంటారని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న లక్షమందిని ఎంపిక చేసి వారి అకౌంట్లలో నేరుగా రూ.10వేలు చొప్పున జమ చేస్తారన్నారు. ఎంపికైన చిన్నారులు ఈ నగదును ఉపయోగించుకుని వారి ఆలోచనలకు అనుగుణంగా సైన్స్ పరికరాలు తయారు చేసి జిల్లాస్థాయి ప్రదర్శనలో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన ఉత్తమ ప్రదర్శనలు రాష్ట్ర స్థాయిలో అక్కడి నుంచి జాతీయ స్థాయిలో ప్రదర్శిస్తారని వివరించారు. జాతీయస్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన 60 ప్రాజెక్టులను ఎంపిక చేసి జపాన్ దేశంలో పోటీలకు పంపిస్తారన్నారు. ఆ 60 మంది చిన్నారులు, వారి గైడ్ టీచర్లు ఫిబ్రవరి 28న రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతిని కలిసే అవకాశం కల్పిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈనెల 15వతేదీలోపు www.inspireawards-dst.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

6 నుంచి వేళాంగిణి ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కొత్తకోడూరు వేళాంగిణి మాత జన్మదిన మహోత్సవాలు శుక్రవారం నుంచి ఈ నెల 8వతేదీ వరకు జరుగుతాయని నెల్లూరు బిషప్ డాక్టర్ ఎండీ ప్రకాశం తెలిపారు. బుధవారం బిషప్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేళాంగిణి ఉత్సవాలకు మన రాష్ట్రమే కాక పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నారని తెలిపారు. వారికి మౌలిక వసతులు, భోజన సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఈనెల 8వ తేదీ సాయంత్రం 6గంటలకు తాను, డాక్టర్ పిల్లి అంథోనిదాస్ సమిష్టి దివ్య బలిపూజ, ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటామని తెలిపారు. జిల్లాలోని భక్తులు అందరూ తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేళాంగిణి మాత ఆలయం డైరెక్టర్ పీ లూకాస్ రాజ్, జీ ఎటర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు(జడ్పీ), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలో లైన్లకు మరమ్మతులు చేస్తున్నందున గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గాంధీగిరిజన కాలనీ, వెంకటేశ్వరాపురం ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలియజేశారు.

కాలువలపై ర్యాంపు, మెట్లు ఉండకూడదు

● కమిషనర్ నందన్



కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కాలువల్లో పూడిక తీయడానికి ఇబ్బందిగామారే ర్యాంపులు, మెట్లను నిర్మించకుండా సిటీ ప్లానింగ్ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని నగర కమిషనర్ నందన్ సూచించారు. బుధవారం ఆదిత్య నగర్, స్వామిదాస్‌స్కూల్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. కాలువలపై నిర్మాణాలుంటే సదరు ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. రోడ్డు మార్జిన్ దాటి అమ్మకాలు చేయకూడదని చిల్డ్రన్స్ పార్కు వద్ద రోడ్డు మార్జిన్ వ్యాపారులను హెచ్చరించారు. ఇసుక రవాణ చేసే ట్రాక్టర్లు, టిప్పర్లపైన పట్టవేసుకుని నగరంలోకి రావాలన్నారు. ఎస్వీజీఎస్ కాలేజీ వద్ద కాలువల్లో పూడికతీత యంత్రం పనితీరును పరిశీలించారు. మలేరియా విభాగం పర్యవేక్షణ అధికారి జిజియా ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు.

నాలుగు గేదెల మృతి

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమల రేగడ ఎస్సీ కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై మహీంద్ర క్యాంపర్ వాహనం ఢీకొని నాలుగు గేదెలు మృతి చెందాయి. రెండు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి.



నిరుపయోగంగా మారిన కొమ్మరపూడి షెల్టరు



జొన్నవాడ కూడలి వద్ద షెల్టరులో మద్యం సీసాలు, వాటర్‌ప్యాకెట్లు



మందుబాబులకు అడ్డాగా మారిన సౌత్‌మోపూరు షెల్టరు


షెల్టరా.. సారీ!

● పల్లెల్లో నిరుపయోగంగా బస్ షెల్టర్లు
● కొన్ని చోట్ల మందుబాబులకు అడ్డా
● మరికొన్ని శిథిలం
● కన్నెత్తి చూడని పంచాయతీ అధికారులు
● రోడ్లపైనే ప్రయాణికుల అవస్థలు

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 3,(ఆంధ్రజ్యోతి) : బస్సుల కోసం ప్రయాణికులు రహదారులపై ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఇబ్బందులుపడకుండా ప్రభుత్వం ప్రధాన కూడళ్ల వద్ద షెల్టర్లు నిర్మించింది. అయితే వాటిలో కొన్ని మందు బాబులకు అడ్డాగా మారాయి. మరికొన్ని శిథిలావస్థకు చేరాయి. వెరసి ప్రయాణికులకు షెల్టర్లు కరువయ్యాయి. దీంతో వారు రోడ్లపైనే వాహనాల కోసం ఎదురు చూస్తున్నారు. ఇటు పంచా యతీ అధికారులు, అటు మండల స్థాయి అధికారులుగానీ ఈ షెల్టర్లను పట్టించుకోవడం మానేశారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులైనా పట్టించుకోవాలని పల్లెజనం కోరుతున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు

రూరల్‌లోని పలు ప్రాంతాల్లో బస్ షెల్టర్లు నిరుపయోగంగా ఉన్నప్పటికీ పంచాయతీ అధికారులు వాటి వైపు కన్నెత్తి చూడటం లేదు. స్వల్ప నిధులతో కొన్ని షెల్టర్లకు మరమ్మతులు చేయించే అవకాశం ఉన్నా ఆ దిశగా పంచాయతీ కార్యదర్శులెవరూ చొరవ చూపడం లేదన్న విమర్శలున్నాయి. మండల స్థాయి అధికారులు కూడా ప్రయాణికుల కష్టాలు పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని షెల్టర్లు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామీణులు కోరుతున్నారు.



గొల్లకందుకూరు వద్ద మర్రి చెట్టులో కలిసిపోయిన బస్‌షెల్టర్

ప్రతీ ఊళ్లో అదే పరిస్థితి...

- కొమ్మరపూడి గ్రామస్తులు నెల్లూరుకు వెళ్లాలంటే ఊరికి 4 కి.మీ దూరాన ఉన్న నెల్లూరు-తాటిపర్తి రహదారి వద్దకు చేరాలి. అక్కడ బస్‌షెల్టరు ఉన్నా ఉపయోగంలో లేదు. కొన్నేళ్ల క్రితం నిర్మించిన ఆ షెల్టరు శిథిలావస్థకు చేరింది. దాంట్లో ప్రయాణికులెవరూ ఉండలేని దుస్థితి ఏర్పడింది. బస్సుల కోసం వచ్చేవారు రోడ్డుపైనే ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉంటున్నారు.
- జొన్నవాడ కూడలి వద్ద షెల్టరు బాగానే ఉన్నా దానిని మందుబాబులు ఆక్రమించేసుకున్నారు. పగలు, రాత్రి తేడాలేకుండా మద్యం సేవిస్తుండటంతో ప్రయాణికులు అందులోకి వెళ్లలేక రోడ్డుపైనే ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది.
- నెల్లూరు - తాటిపర్తి రహదారి సౌత్‌మోపూరు మలుపు వద్ద ఉన్న షెల్టరును మద్యం బారుగా మార్చేశారు. ఇందులోకి సామాన్యులెవరూ వెళ్లలేని స్థితి ఏర్పడింది. గ్రామంలో హైస్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులు, పీహెచ్‌సీకి వచ్చే బాధితులు, బ్యాంకుకు వచ్చే ఖాతాదారులు రోడ్డుపైనే తమ ప్రాంతాల బస్సుల కోసం ఎదురుచూస్తూ ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది.
- తాటిపర్తి నుంచి గొల్లకందుకూరు గ్రామానికి వెళ్లే మార్గంలో షెల్టరు ఉంది. ఇది ఉపయోగంలోనే ఉన్నా కింద గచ్చుపగుళ్లు ఇవ్వడంతో అందులో పాములు నివాసముంటున్నాయని ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు.
- జొన్నవాడ రహదారిపై కొండ్లపూడి మలుపు వద్ద షెల్టరును తొలగించిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్కడ ఆంజనేయస్వామి విగ్రహం పెట్టి దుకాణాలు ఏర్పాటు చేశారు. దీంతో అక్కడా ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు.
- జొన్నవాడ వైపు వేళ్లే మార్గంలో మూలాపేట మలుపువద్ద షెల్టరు ఉంది. ఆటోడ్రైవర్లు అక్కడే స్టాండ్ ఏర్పాటు చేసుకుని ఆటోలను అడ్డంగా పెట్టడంతో అందులోకి వెళ్లలేని దుస్థితి ఏర్పడింది.

'అపోలో'లో రాయితీతో భుజం నొప్పికి స్క్రీనింగ్



రాయితీ వివరాల కరపత్రాలు విడుదల చేస్తున్న వైద్య నిపుణులు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అపోలో ఆసుపత్రిలో భుజం నొప్పికి రాయితీతో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నా మని ఆసుపత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ వెల్లడించారు. బుధవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.999కే ఈ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఆఫర్ అక్టోబరు 31వ తేదీ వరకు ఉంటుందని తెలియచేశారు. ఈ ప్యాకేజీలోనే వైద్యుల కన్సల్టేషన్‌తోపాటు ఆర్‌బీఎస్, సిబిసి, యూరిక్ యాసిడ్, ఎక్స్‌రే, స్పైన్ ఎక్స్‌రే వంటి పరీక్షలు చేస్తామని చెప్పారు. దీర్ఘకాలికంగా భుజం నొప్పితో బాధపడే వారికి విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అత్యాధునిక రోబోటిక్ విధానంలో తమ వైద్య బృందం భుజం నొప్పిని పూర్తిగా తగ్గిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోబోటిక్ ఆర్థోప్లాస్టీ వైద్యుడు డాక్టర్ వివేకానందరెడ్డి, రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ వైద్య నిపుణులు డాక్టర్ శశిధర్‌రెడ్డి, డాక్టర్ విక్రమ్‌రెడ్డి, యూనిట్ హెడ్ బాలరాజు పాల్గొన్నారు.

రిలయన్స్ స్మార్ట్‌లో కాలం చెల్లిన పదార్థాలు

● ఆహార భద్రత అధికారుల తనిఖీల్లో బహిర్గతం



కాలం చెల్లిన కందిపొడి ప్యాకెట్

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వేదాయపాళెం వద్దనున్న రిలయన్స్ స్మార్ట్ సూపర్ మార్కెట్‌లో ఆహార భద్రత అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు రకాల ఆహార పదార్థాలు కాలం చెల్లినవిగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ మార్కెట్‌పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆహార భద్రత విభాగం జిల్లా సహాయ కంట్రోలర్ జీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఓ వినియోగదారుడు అందించిన సమాచారంతో తనిఖీలు నిర్వహించామన్నారు. మిల్క్‌షేక్, లస్సీ, కందిపొడి వంటివి కాలం చెల్లించినవి విక్రయానికి ఉంచినట్లు గుర్తించామని తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకుని పరీక్షల నిమిత్తం లేబొరేటరీకి పంపుతున్నామని, మార్కెట్‌పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు తయారీ, కాలపరిమితి తేదీలను పరిశీలించాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఫుడ్‌సేఫ్టీ అధికారి ఎం ప్రణుతి ఫ్లోరా పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

● మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు



హమాలీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీకి ఎంపికైన వారు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి వారికి రక్షణ కల్పించాలని నగర మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, సీఐటీయూ రూరల్ కార్యదర్శి పెంచల నర్సయ్య డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్‌లోని హమాలీ కార్మికుల విశ్రాంతి భవనంలో సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ హమాలీ కార్మికులు ఐక్యంగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 7వ తేదీన జరిగే సీఐటీయూ రూరల్ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం 9 మందితో నూతన కమిటీని ఎంపిక చేశారు. ఏసీ కూరగాయల మార్కెట్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శు లుగా రత్తయ్య, అంజిరెడ్డి, కోశాధికారిగా తిరుపతిరెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, తిరుపాల్‌రావు, గోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌తో వైద్యుల భేటీ



సూపరింటెండెంట్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైద్యులు, సిబ్బంది

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 3 (ఆంధ్ర జ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి రెగ్యులర్ సూప రింటెండెంట్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కొండేటి మాధవిని బుధ వారం పలువురు వైద్యులు, సిబ్బంది కలిసి శుభాకాంక్ష లు తెలిపారు. యునైటెడ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మాట్లాడు తూ అందరినీ సమన్వయం చేసుకుని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కా ర్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు నరమాల సతీష్‌కుమార్, కార్యదర్శి సందానీ బాషా, రమణయ్య, మోహన్, సామెల్, ధనశేఖర్, సురేష్, లవకుమార్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

షాన్విక్ రాజ్‌కు అంతర్జాతీయ చెస్ రేటింగ్

● ఎమ్మెల్యే సోమిరెడ్డి అభినందన



చిన్నారి షాన్విక్ రాజ్‌తో ఎమ్మెల్యే సోమిరెడ్డి తదితరులు

నెల్లూరు(విద్య), సెప్టంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆర్ఎల్ చెస్ అకాడమీకి చెందిన షాన్విక్ రాజ్ అతి చిన్న వయసులోనే ప్రపంచ చెస్ రేటింగ్ సాధించడం అభినందనీయమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో ఆ క్రీడాకారుడిని అభినందించారు. నాలుగేళ్ల వయసులోనే అంతర్జాతీయ చెస్ సమాఖ్యకు చెందిన బ్లిట్జ్ రేటింగ్ సాధించి ప్రపంచ రికార్డ్ సృష్టించాడ న్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా క్రీడాభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందని, స్పోర్ట్స్ కోటాను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచిందని తెలిపారు. అనంతరం షాన్విక్ రాజ్, అతని తల్లితండ్రులు అనూష, ప్రదీప్‌రాజ్, కోచ్ రామ్‌లక్ష్మణ్‌ను ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి వై సుమన్, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

మేయర్‌కి పదవీ గండం ?

(5వ పేజీ తరువాయి)

ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ అవిశ్వాస తీర్మానం కోసం సమావేశం ఏర్పాటు చేయాలి. నోటీసు అందిన 15 రోజుల్లో అవిశ్వాస తీర్మాన సమావేశానికి కలెక్టర్ తేదీ ప్రకటిస్తారు. ఆ తేదీన జరిగే సమావేశానికి కోరం ఉంటే అవిశ్వాస తీర్మానం కోసం ఓటింగ్ నిర్వహిస్తారు. కార్పొరేటర్ల మెజారిటీ ఓటింగ్ ప్రకారం అవిశ్వాస తీర్మానం నెగ్గిందా లేదా అనే విషయం తెలుతుంది. ప్రస్తుతం ఉన్న సంఖ్యాబలం ఆధారంగా గమనిస్తే మేయర్ పొట్లూరి స్రవంతికి పదవీ గండం తప్పదనే అనిపిస్తోంది.

దువ్వూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా హరికిషోర్‌రెడ్డి

సంగం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా అన్నారెడ్డిపాళెం టీడీపీ నాయ కుడు బండా హరికిషోర్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డైరెక్టర్లుగా మారెళ్ల కృష్ణయ్య, జడపల్లి దయాకర్‌గౌడ్‌ను నియమించారు. దీంతో వారు మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

వలేటివారిపాలెం : చుండి ఎంపీపీ స్కూల్‌కు పూర్వ విద్యార్థి, హైదరాబాద్‌లో గైల్ కంపెనీలో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్న షేక్ మస్తాన్‌వలి కుర్చీలను బహూకరించారు.

శ్మశానాల్లో ఆధునిక వసతులు : గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : శ్మశానాల్లో ఆధునిక వసతులు కల్పించనున్నట్లు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని సౌత్ మోపూరులో ఉన్న రెండు శ్మశానాలను ఆయన పరిశీలించారు. సుమారు రూ.30 లక్షలతో శ్మశానాల్లో వసతుల కల్పనకు ప్రణాళిక తయారు చేస్తున్నామని చెప్పారు. అనంతరం 28వ డివిజన్ జడ్పీ హైస్కూల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు పరికరాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జి వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పముజుల ప్రదీప్, రాపూరు చంద్రశేఖర్, రాజా నాయుడు, సాయి సునీల్ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం చేయండి

ప్రాజెక్టు మేనేజర్ రాజ్‌కుమార్



ఉపన్యసిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ రాజ్‌కుమార్

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రైతులంతా సేంద్రియ వ్యవసాయంవైపు అడుగులు వేయాలని సేంద్రియ వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని కందమూరు గ్రామంలో బుధవారం రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంతో పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. పైగా నాణ్యమైన పంట చేతికందుతుందని తెలిపారు. రైతులందరు పూర్తి అవగాహనతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం ఏడీఏ శ్రీదేవి నానో యూరియాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమోహన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



రాజరాజేశ్వరి నవరాత్రులకు గుంజ ప్రతిష్ఠ

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం దేవీనవరాత్రి ఉత్సవాలకు గుంజ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 22 నుంచి అక్టోబరు 2వతేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఖడ్గమాల, అష్టోత్తర సహస్ర నామపూజలు, మహాభిషేకం టిక్కెట్లు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజితమ్మ, కార్పొరేటర్ చక్కా అహల్య, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పలు కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

● జిల్లాలో పలువురికి స్థానం

నెల్లూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వివిధ రాష్ట్ర కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాకు చెందిన పలు నియోజకవర్గాలకు చెందిన టీడీపీ నాయకులకు ఈ జాబితాలో స్థానం దక్కింది. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కనపర్తి గంగాధర్(నెల్లూరు రూరల్) నియమితులయ్యారు. ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అబ్బూరి రమేష్ నాయుడు (ఆత్మకూరు), ఏపీ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కటారి రమణయ్య (ఆత్మకూరు), ఏపీ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సల్మా షరీన్ షేక్ (ఆత్మకూరు), ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కపిర శ్రీనివాసులు (నెల్లూరు సిటీ) నియమితులయ్యారు.

9న 5కే మారథాన్

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, వైద్య ఆరోగ్యశాఖ, స్పోర్ట్స్ అథారిటీ, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన 5కే మారథాన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం ఈ నెల 7వ తేదీలోగా 17 నుంచి 25 సంవత్సరాల వయసున్న విద్యార్థులు 8639432458 నెంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మగవారు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు వేర్వేరుగా బహుమతులు అందజేస్తామని తెలిపారు. మొదటి బహుమతి కింద రూ.10వేలు, రెండో బహుమతిగా రూ.7వేలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 9వ తేదీ ఉదయం 6 గంటలకు ఏసీ స్టేడియం నుంచి ఈ మారథాన్ మొదలవుతుందని వెల్లడించారు.

'సంకల్ప్ హబ్'తో ప్రచారం

● ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సంకల్ప్ హబ్ (మహిళా సాధికరత హబ్) ద్వారా సంక్షేమం, ఆరోగ్యం, సాధికారత అంశాలపై ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ప్రారంభమైన ఈ కార్యక్రమాలు ఈనెల 12వ తేదీ వరకు కొనసాగిస్తామని తెలిపారు.

కారును ఢీకొన్న లారీ

● త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

కావలి రూరల్: లారీని కారు అధిగమించే క్రమంలో కారును లారీ ఢీకొన్న సంఘటన బుధవారం కావలి మండలం గౌరవరం జాతీయ రహదారిపై జరిగింది. బాధితుల వివరాల మేరకు... పల్నాడు జిల్లా గురజాల మండలం గంగవరంకు చెందిన వారణాసి జగన్నాథంకు పెరాలసిస్ రావడంతో మారుతి ఎర్టిగా కారులో తిరుపతికి వెళ్లి ఆయుర్వేద వైద్య శాలలో చూపించుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలోని గౌరవరం సమీపంలో తమిళనాడు నుండి రాజమండ్రికి గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న లారీ కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగంతో పాటు ఒక పక్క దెబ్బతినగా కారు లో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. కారులో డ్రైవర్ అంజితో పాటు 5మంది ఉండగా త్రుటిలో ప్రాణాలతో బయట పడ్డారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మత సామరస్యానికి ప్రతీక..

ఏఎస్ పేట దర్గా

ఈ నెల 18న గంధమహోత్సవం





దర్గాలోని స్వామిఅమ్మవార్ల సమాధులు

ఏఎస్‌పేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కేంద్రానికి 50 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఏఎస్‌పేట దర్గా మతసామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతోంది. కులమతాలకు అతీతంగా ప్రజలు మహిమాన్వితమైన ఈ దర్గాను ప్రతి ఏటా సందర్శిస్తారు. శ్రీశ్రీశ్రీ హజరత్ సయ్యద్ ఖాజా రహంతుల్లా నాయబ్ రసూల్ దర్గాను 17వ శతాబ్దంలో నిర్మించారు. అప్పటి నుండి అన్ని వర్గాల భక్తుల ఆదరణను చూరగొంటోంది.

● మహిమాన్వితం.. నాయబ్ రసూల్ దర్గా!

కర్ణాటక రాష్ట్రంలో జన్మించిన ఖాజా రహంతుల్లా చిన్నతనంలోనే ఇల్లు విడిచి ఆధ్యాత్మికం వైపు వెళ్లారు. మక్కాను దర్శించుకొని భక్తిశ్రద్ధలతో తపస్సు చేసి నాయబ్ రసూల్ అనే బిరుదు పొందారు. అనంతరం కర్నూలు నవాబ్ సైన్యంలో సిపాయిగా చేరారు. తన మహిమలతో తోటి సిపాయిలు, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపేవారు. తన మహిమల గురించి తెలుసుకున్న కర్నూల్ నవాబ్ కుమార్తె హబీబా ఖాతూన్ పట్టుబట్టి ఆయనను వివాహం చేసుకున్నారు. అనంతరం నాయబ్ రసూల్‌తో కలిసి ఏఎస్ పేటకు విచ్చేశారు. ఆ చుట్టు పక్కల 10 గ్రామాలను పాలిస్తూ తన మహిమలతో ప్రజా సమస్యలను పరిష్కరించేవారు. తాగునీటి సమస్య తీర్చడానికి ఏఎస్ పేటలో కోనేరును నిర్మించారు. ప్రార్థన చేసుకునేందుకు మసీదును నిర్మించారు. తన మహిమలతో ప్రజల బాధలను తీరుస్తూ పలువురు శిష్యులను ఏర్పరచుకున్నారు. 17వ శతాబ్దంలో ఆయన సిద్ధి సమాధి పొందారు. దీంతో ఆమె సతీమణి హబీబా ఖాతూన్ దర్గాను నిర్మించారు. కొంత కాలానికి ఆమె కూడా నాయబ్‌రసూల్ పక్కనే సమాధి అయ్యారు. అలా ఏర్పడ్డ ఏఎస్ పేట దర్గా అప్పటి నుండి నేటి వరకు మహిమ గల దర్గాగా ఖ్యాతికెక్కింది.

● దర్గాను దర్శిస్తే మానసిక ప్రశాంతత

నాయబ్ రసూల్ దర్గాను దర్శించుకుంటే మానసిక ప్రశాంతత కలుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో ఈ దర్గాను దర్శించుకునేందుకు దేశం నలుమూలల నుండి వేలాదిమంది భక్తులు విచ్చేస్తుంటారు. దర్గా సన్నిధిలో రెండు రాత్రులు నిద్రిస్తే మానసిక, శారీరక సమస్యలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. నాయబ్ రసూల్ దర్గాను దర్శించిన తరువాత మానసిక ప్రశాంతత లభించిందని ప్రముఖులు చెబుతున్నారు. అందుకే పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు ఏడాదికి ఒక్కసారైనా దర్గాను దర్శించుకుంటారు.

● పవిత్ర జలంతో ఆరోగ్యం

దర్గాలో రోజూ ఉదయం పంపిణీ చేసే పవిత్ర జలం సేవిస్తే మానసిక, శారీరక ఆరోగ్యం సిద్ధిస్తుందని భక్తులు నమ్ముతారు. దీంతో రోజూ వందల మంది భక్తులు ఇక్కడి పవిత్ర జలాన్ని సేవిస్తుంటారు. మంచి నీటి క్యాన్లు, బిందెలలో పవిత్ర జలాన్ని నింపి రాత్రిళ్లు దర్గాలోని సమాధుల వద్ద ఉంచుతారు. అలా రాత్రి మొత్తం దర్గాలో ఉండడంతో ఆ నీటిని పవిత్ర జలంగా భావిస్తారు. దీని కోసం భక్తులు వివిధ రాష్ట్రాల నుండి ఇక్కడికి విచ్చేస్తారు.

● రవాణా సౌకర్యం

ఏఎస్‌పేటకు నెల్లూరు నుండి ఉదయం 5గంటల నుండి రాత్రి 8గంటల వరకు ప్రతి గంటకూ ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. రోజూ ఏఎస్ పేట నుండి హైదారాబాదుకు సాయంత్రం 6నుండి 8 గంటలలోగా సుమారు 7 ప్రైవేటు బస్సులు నడుస్తున్నాయి. అదేవిధంగా హైదారాబాదు నుండి ఏఎస్ పేటకు పలు ప్రైవేటు బస్సులు ఉన్నాయి.

మూడు రోజులపాటు ఉత్సవాలు

ప్రతీ ఏటా దర్గాలో గంధ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈ మహోత్సవానికి పలు రాష్ట్రాల నుండే కాక, ఇతర దేశాల నుండి భక్తులు విచ్చేస్తుంటారు. ఈనెల 18వ తేదీన అర్థ రాత్రి గంధ మహోత్సవం, 19న చిరాగా, 20న తహలీల్ ఫాతెహా కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తారు. వీటిని వీక్షించడానికి లక్షలాదిమంది భక్తులు విచ్చేస్తారు.

కొత్త కోడూరులో పర్యాటక ప్రాజెక్టు

● భూ సేకరణ కోసం ప్రయత్నిస్తున్నాం
● జిల్లాలో పర్యాటకాభివృద్ధికి చర్యలు
● జిల్లా పర్యాటక శాఖాధికారి ఉషశ్రీ

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : 'టీపీగూడూరు మండలం కొత్త కోడూరులో పర్యాటక ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నాము. ఇందుకు అవసరమైన భూ సేకరణకు ప్రయత్నిస్తున్నాం.' అని జిల్లా పర్యాటక శాఖ జి.ఉషశ్రీ తెలిపారు. జిల్లాలో పర్యాటకాభివృద్ధికి అన్ని వనరులు ఉన్నాయని, ప్రభుత్వ ఆలోచనల మేరకు చర్యలు తీసు కుంటున్నట్లు చెప్పారు.



? జిల్లాలో పర్యాటక కేంద్రాలు ఎన్ని ఉన్నాయి

! జిల్లాలో మొత్తం 40 పర్యాటక కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 11 బీచ్‌లు, 14 ఆధ్యాత్మిక, 2 జలపాతాలు, మరో రెండు రిజర్వాయర్లు, 3 పునరావాస్తు, ఇతరులు మరో ఎనిమిది ఉన్నాయి

? మరి వీటికి ప్రచారం ఎలా

! ఈ అంశంపైనే దశలవారీగా చర్యలు తీసుకుంటున్నాము. స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవా సంస్థలు, యూట్యూబర్లతో దశలవారీగా సమావేశాలు నిర్వహించాము. పర్యాటక కేంద్రాలను దర్శించి, వాటి అందాలను, విశిష్టతను ప్రజలకు తెలియజేయాలని కోరాం. మా ఆలోచనలన్నిటికీ సంపూర్ణంగా సహకరిస్తామని చెప్పారు. తమ ఐడీ కార్డులు, డ్రోన్లకు పర్మిషన్లు ఇప్పించాలని కోరారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటున్నాం.

? హోటళ్ల ద్వారా ప్రమోషన్స్ ఎలా

! జిల్లాలోని హోటళ్ల యజమానుల సంఘాలతోనూ సమావేశం నిర్వహించాము. హోటళ్లలో పర్యాటక సమాచారాన్ని ప్రదర్శించాలని కోరాం. ఇందుకు వారు కొన్ని విషయాలు మా దృష్టికి తెచ్చారు. వాటిని కూడా కలెక్టర్‌కు నివేదించాము.

? సందర్శకులకు ఇచ్చే సౌకర్యాలు ఏమిటి

! దేశ, విదేశీ యాత్రికులను ఆకర్షించే పర్యాటక ప్రదేశాలు జిల్లాలో ఎన్నో ఉన్నాయి కానీ కొన్నింటికి రవాణా సౌకర్యం లేదు. అలాంటి ప్రాంతాలను గుర్తించి, ప్రభుత్వానికి నివేదిక పంపుతాము. కొత్త కోడూరులో పర్యాటక ప్రాజెక్టు ఏర్పాటుకు ఇప్పుడిప్పుడే అడుగులు పడుతున్నాయి. తొలుత అక్కడ భూ సేకరణకు పరిశీలించామని ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు దస్త్రాలు సిద్ధం చేసి, ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తున్నాము.

మహిళా స్నేహపూర్వక పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దండి : జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీలకు సంబంధించి శిక్షణ కార్యక్రమాన్ని జడ్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ జిల్లాలో మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీలుగా 9 పంచాయతీలు ఎంపికయ్యాయని, వాటిలో 17 అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వాలు నిర్దేశించాయని చెప్పారు. వీటిపై అధికారులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో మోహన్‌రావు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇద్దరికి కారుణ్య నియామకం

జిల్లా పరిషత్‌లో విధులు నిర్వహిస్తూ మరణించిన వారి కుటుంబాల్లో ఇద్దరికి కారుణ్య నియామకాలు చేపట్టారు. గువ్వల చెంచురత్నమ్మను ఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయంలో, షేక్ మహ్మమద్ సైఫ్‌ను జిల్లా పరిషత్ కార్యాలయంలో సబార్డినేట్లుగా నియమించారు. వారికి జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో మోహన్‌రావు బుధవారం జడ్పీ కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు.

కమీషన్ ఇవ్వలేదనే మాలేపాటి నిందలు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి

దగదర్తి(బిట్రగుంట), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కమీషన్లు ఇవ్వలేదనే దురుద్దేశంతోనే రాష్ట్ర ఆగ్రో డెవలప్‌మెంట్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు అభివృద్ధి పనులను అడ్డుకుంటూ నిందలు వేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి పేర్కొన్నారు. దగదర్తి మండలంలోని డీఆర్ చానల్ పనులు నాసిరకంగా ఉన్నాయని ఇటీవల మాలేపాటి విమర్శించడంపై స్పందించిన పమిడి బుధవారం స్థానిక రైతులు, నేతలతో కలిసి ఆప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దగదర్తి-బుచ్చి రోడ్డులో నిర్మించిన బ్రిడ్జికి డీఆర్ చానల్‌కి ఏమి సంబంధం ఉందో కూడా తెలియకుండా మాలేపాటి విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. బ్రిడ్జికి స్లాబ్ వేసేందుకు సెంట్రిగ్ సపోర్టుల కింద పెట్టిన సిమెంట్ పెచ్చులను చూపించి నాసిరకం పనులనడం హాస్యాస్పదం అన్నారు. కాంట్రాక్టర్‌ను కోటి యాభై లక్షల రూపాలయలు కమీషన్ అడిగింది నిజం కాదా అని ప్రశ్నించారు. డీఆర్ చానల్‌ను కాపాడమని కోరే మాలేపాటి కాలువ శివాయి భూమిని ఆక్రమించిన విషయాన్ని ప్రశ్నించారు. కావలి ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డికి చెడ్డ పేరు తీసుకొచ్చేందుకు మాలేపాటి సుబ్బానాయుడు వైసీపీ నేతలతో చీకటి కాపురం చేయడం మానుకోవాలని తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ అల్లం హనుమంతరావు, నెల్లూరు పార్లమెంటరీ రైతు ప్రధాన కార్యదర్శి జలదంకి శ్రీహరిలు మాలేపాటి తీరును తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో తలమంచి కెనాల్ నీటి సంఘం అధ్యక్షుడు శీనయ్య, నాయకులు గున్నం హరికిశోర్‌రెడ్డి, వడ్డే వెంకటేశ్వర్లు నాయుడు, పాపన మల్లికార్జునరెడ్డి, బత్తుల హజరత్తయ్య, దమ్ము రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



రైతులతో కలిసి డీఆర్ చానల్‌ను పరిశీలిస్తున్న పమిడి రవికుమార్‌చౌదరి

భార్య కాపురానికి రాలేదని భర్త బలవన్మరణం

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భార్య పిల్లల్ని తీసుకుని కాపురానికి రావడం లేదని మనస్తాపానికి చెందిన ఓ భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని కల్లూరుపల్లి ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న కొమలపల్లి నరసింహం (35)కు పెళ్లై నలుగురు పిల్లలున్నారు. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా పుట్టింట్లోనే ఉంటోంది. కాపురానికి రావలని కోరినా ఆమె వినకపోవడంతో నరసింహం మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పక్కనే ఉంటున్న బంధువులు చూసి కేకలు వేయడంతో స్థానికులు హుటాహుటిన స్పందించినా అప్పటికే నరసింహం మరణించాడని, అతని చెల్లి అంజలి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని నెల్లూరు రూరల్ సీఐ వేణు తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలను అరికట్టండి

● అధికారులు సోలార్ ఏర్పాటు చేసుకోవాలి
● ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య



నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడంతో పాటు, విద్యుత్ ప్రమాదాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని స్కాడా కార్యాలయంలో బుధవారం రూరల్ డివిజనల్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు, సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. డివిజన్‌లోని అధికారులంతా వారి ఇళ్లకు ఈనెల 30లోపు సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ విజయన్, సీనియర్ గణాంక అధికారి మురళి, డీఈఈలు ప్రభాకర్, రాము, సుబ్రహ్మణ్యం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'రేషన్' అక్రమ రవాణాకు రంగం సిద్ధం

● 200 బియ్యం బస్తాల స్వాధీనం
● ముందే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి'

అనంతసాగరం సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సినీ ఫక్కీలో అధికారులే అవాక్కయ్యేలా కొందరు అక్రమార్కులు రేషన్ అక్రమ రవాణాకు సర్వం సిద్ధం చేశారు. రహస్యంగా నిల్వ ఉంచిన సుమారు 200 రేషన్ బియ్యం బస్తాలను సాగరం అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఇనగలూరు వద్ద పంటపొలాల్లోని ఓ ఇంట్లోను, ట్రాక్టర్ ట్రక్కులో, మరో చోట అక్రమంగా బియ్యం నిల్వ చేసినట్లు గుర్తించారు. వివిధ చౌక దుకాణాల నుంచి బియ్యాన్ని సేకరించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. దీంతో ఈ విషయం చర్చనీయాశంగా మారింది. స్థానికుల సమాచారంతో తహసీల్దారు జయవర్ధన్ సిబ్బందితో అక్కడికి చేరుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. మూడు చోట్ల నిల్వ చేసిన బస్తాలను ఎస్‌ఐ సూర్యప్రకాష్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ అధికారుల ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకొన్నారు. వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అయితే ఆ ప్రాంతంలో ఎవరూ కనిపించకపోవడంతో రేషన్ సూత్రధారులు ఎవరనే అంశంపై విచారిస్తున్నామని.. చట్టపరంగా చర్యలు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు.

ముందే చెప్పిన ఆంధ్రజ్యోతి

సాగరం కేంద్రంగా గత కొంత కాలంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు 'ఆంధ్రజ్యోతి' ముందే వెల్లడించింది. వెంగంపల్లికి చెందిన కొందరు, పలువురు డీలర్లు మాఫియాగా ఏర్పాడి అక్రమార్జనకు పాల్పడుతున్న వైనంపై 'రెచ్చిపోతున్న రేషన్ మాఫియా' శీర్షికన గత నెల 11న ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. భారీస్థాయిలో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. అధికారులు రాజకీయ ప్రలోభాలు, అవినీతికి పాల్పడకుండా సూత్రధారులపై చట్టపరంగా చర్యలు తీసుకుని, రేషన్ మాఫియాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అధికారులు పట్టుకొన్న రేషన్ బియ్యం బస్తాలు



రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

అక్రమ రవాణాపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఏపీ ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలలోపు ఉన్న విద్యార్థులందరూ ఈ పరీక్ష రాసేందుకు అర్హులని తెలిపారు. దరఖాస్తుకు ఎలాంటి ధ్రువపత్రాలు అవసరం లేకున్నా పరీక్ష రాసే సమయానికి మాత్రం అన్నీ ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50 చొప్పున ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇవ్వబడిన ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా మాత్రమే ఫీజు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు www.bse. ap. gov.in వెబ్‌సైట్‌నుగానీ విద్యాశాఖ కార్యాలయంలోని పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్‌ను సంప్రదించాలని కోరారు.

క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయండి

● ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి



మాట్లాడుతున్న అదనపు జిల్లా వైద్యాధికారి ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా అనుమానితులకు క్షయ నిర్ధారణ పరీక్షలు చేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి ఆదేశించారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్ల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడిన వారు, ఐదేళ్ల క్రితం క్షయ వచ్చిన వారు, వారితో కలిసి ఉన్న వారికి పరీక్షలు చేయాలని సూచించారు. అలాగే, మధుమేహం, ధూమపానం, పోషకాహార లోపం, హెచ్‌ఐవీతో బాధపడేవారికి తప్పనిసరిగా క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ రక్త నమూనాలు సేకరించి సరైన ఫలితాలను సకాలంలో అందచేయాలన్నారు. సబ్ యూనిట్ అధికారి జయరామ్ మాట్లాడుతూ వారాంతపు, మాసాంతపు రికార్డులను సకాలంలో అందచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా విభాగం సిబ్బంది కూడా పాల్గొన్నారు.

బోధనలో వినూత్న మార్పులు

● హ్యాండ్‌బుక్‌తో సత్ఫలితాలు
● విద్యాలక్ష్యాల సాధనకు ఎంతో ఉపయుక్తం

ప్రభుత్వం పాఠశాల విద్యపై దృష్టిపెట్టింది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సులభంగా విద్యా లక్ష్యాలు సాధించేలా, విద్యార్థుల్లో అవగాహన కలిగించేందుకు నూతనంగా ప్రవేశపెట్టిన టీచర్స్ హ్యాండ్‌బుక్ ఎంతో చక్కగా ఉపయోగపడుతోంది. ఎస్‌సీఈఆర్‌టీ సహకారంతో సమగ్రశిక్ష అభియాన్ ఉపాధ్యాయులకు వనరులను అందించేందుకు వీలుగా హ్యాండ్‌బుక్‌ను తీర్చిదిద్దినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. సబ్జెక్టుల వారీగా హ్యాండ్‌బుక్కుల్లో శిక్షణను పొందుపరిచారు. 1 నుంచి 10వతరగతి వరకు అన్నీ సబ్జెక్టులకూ హ్యాండ్‌బుక్కులను ప్రభుత్వం తయారుచేసి పాఠశాలలకు పంపిణీ చేసింది. - కోవూరు, (ఆంధ్రజ్యోతి)



పాఠ్యాంశాలను బోధిస్తున్న ఉపాధ్యాయిని

విద్యాసంవత్సరం ఆధారంగా సమగ్రశిక్ష అభియాన్ ఒకటి నుంచి పదోతరగతి వరకూ విద్యా క్యాలెండర్‌ను తయారు చేసింది. ఎప్పుడు ఏపాఠం బోధించాలో అందులో వివరించారు. రాష్ట్రంలోని అన్నీ పాఠశాలల్లో ఒకే పాఠాన్ని బోధించేలా క్యాలెండర్‌ను తయారుచేశారు. ఉపాధ్యాయులు తాము బోధించే పాఠ్యాంశాన్ని ముందుగా ఇతర ఉపాధ్యాయులతో చర్చించే అవకాశం ఉన్నట్లు పలువురు టీచర్లు తెలిపారు.

● విద్యావ్యవస్థను గాడిలో పెట్టేలా..

జిల్లాలో సుమారు 2.5లక్షల మంది విద్యార్థులు 1 నుంచి 10వతరగతి వరకూ చదువుతున్నారు. వారికి పాఠ్యాంశాలను బోధించేందుకు సుమారు 10వేల మంది ఉపాధ్యాయులకు ప్రభుత్వం జీతాలు చెల్లిస్తోంది. వైసీపీ ప్రభుత్వ పాలనలో దెబ్బతిన్న విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ తనదైన శైలిలో మార్పులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా తల్లికివందనం, మోడల్ ప్రైమరీ పాఠశాలలు, ఉపాధ్యాయులకు బోధనా కరదీపికలు (హ్యాండ్‌బుక్)లను అందించారు.

జిల్లాలో పాఠశాలల వివరాలు

జడ్పీ ఉన్నత పాఠశాలలు	: 428
ప్రాథమికోన్నత పాఠశాలలు	: 329
ప్రాథమిక పాఠశాలలు	: 2,419

హ్యాండ్‌బుక్ చక్కగా ఉపయోగపడుతోంది..



ఉపాధ్యాయులకు హ్యాండ్‌బుక్ చక్కగా ఉపయోగపడుతోంది. బోధనను సులువుగా, లక్ష్యాలను సాధించేందుకు ఇందులో పొందుపరిచి ఉన్నారు. దీని వల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతోంది. హ్యాండ్‌బుక్ ఆధారంగా ఉపాధ్యాయులు చక్కగా బోధిస్తున్నారు.
- విమలకుమారి,హెచ్‌ఎం. గుమ్మళ్లదిబ్బ మోడల్ ప్రాథమిక పాఠశాల

ఆంధ్రజ్యోతి
6
గురువారం,
4 సెప్టెంబరు 2025
www.andhrajyothy.com

ఆత్మకూరు
ఉదయగిరి

వరిలో తెగుళ్లపై అవగాహన

అనంతసాగరం సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవూరు, మినగల్లు గ్రామాల్లో సాగు చేస్తున్న వరిపంటను ఏవో శైలజా కుమారి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీజన్‌లో వచ్చే తెగుళ్లు, నివారణా చర్యలతో పాటు, ఆకు నల్లి వ్యాధి, లక్షణాలు, వాడాల్సిన మందులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో కృష్ణవేణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10104
వెండి కిలో ధర	రూ. 126400
వెండి ఒక గ్రాము	రూ. 129.40

న్యూస్ బాక్స్

దువ్వూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా బండా హరికిషోర్‌రెడ్డి



సంగం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా అన్నారెడ్డిపాళెం టీడీపీ నాయకుడు బండా హరికిషోర్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డైరెక్టర్లుగా మారెళ్ల కృష్ణయ్య, జడపల్లి దయాకర్‌గౌడ్‌ను నియమించారు. దీంతో వారు మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అధిక ఎరువుల వాడకంతో ఫలితం ఉండదు

ఉదయగిరి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు ఇష్టానుసారంగా పంటలకు ఎరువులు వాడితే అనర్థదాయకం తప్ప ఫలితం ఉండదని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బండగానిపల్లి, జీ.చెరువుపల్లి రైతుసేవా కేంద్రాల పరిధిలోని బిజ్జంపల్లి, దేకూరుపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగు చేసిన రైతులందరూ తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నగదు జమ కాని రైతులు రైతుసేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీపీఏ ఎం.వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

నేడు అదనపు తరగతి గదుల ప్రారంభం

ఉదయగిరి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి భవనాలను గురువారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రారంభించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొనాలని పేర్కొన్నారు.

పండ్లతోటల సాగు విస్తీర్ణాన్ని పెంచండి

ఉదయగిరి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పండ్లతోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించి విస్తీర్ణాన్ని పెంచేలా ఉపాధి హామీ సిబ్బంది చర్యలు చేపట్టాలని ఉదయగిరి క్లస్టర్ ఏపీడీ మృదుల పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉదయగిరి క్లస్టర్‌కు 790 హెక్టార్ల లక్ష్యం కాగా ఇప్పటి వరకు 560 హెక్టార్లలో రైతులను గుర్తించామన్నారు. ఉపాధి హామీ పథకం కింద మొక్కల కొనుగోలు, దుక్కి, నాటడం, నీరు పట్టడం, ఎరువులు తదితర వాటికి మూడేళ్లకు మామిడి సాగుకు రూ.లక్ష, బత్తాయి, నిమ్మకు రూ.1.50 లక్షలు చెల్లిస్తామన్నారు. ప్రభుత్వ నర్సరీల్లో మంచి మొక్కలున్నాయని, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో సంభవించే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ అసిస్టెంట్ యనమల శ్రీనివాసులు అన్నారు. బుధవారం రామాపురంలో నిర్వహించిన లార్వా సర్వేలో ఆయన మాట్లాడుతూ దోమలు ఉత్పత్తి చెందకుండా నివాసాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎలాంటి వ్యాధి లక్షణాలు కన్పించినా వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అలాగే వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నివాసాలతో పాటు పరిసరాలు, వీధుల్లో నిల్వ నీటిని తొలగించి పరిశుభ్రం చేశారు. అనంతరం దోమలు వ్యాప్తి చెందకుండా మిలాథిన్ ద్రావణాన్ని పిచికారి చేశారు.

క్యాంపర్ వాహనం ఢీకొని నాలుగు గేదెల మృతి

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమలరేగడ ఎస్సీ కాలనీ సమీపంలో 167-బీజీ జాతీయ రహదారిపై మహీంద్ర క్యాంపర్ వాహనం ఢీకొని నాలుగు గేదెలు మృతి చెందగా, రెండు గేదెలు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. వివరాల మేరకు... దుత్తలూరు వైపు నుంచి ఉదయగిరికి వస్తున్న క్యాంపర్ వాహనం సోమలరేగడ గ్రామ ఎస్సీ కాలనీ వద్దకు రాగానే అడవిలో నుంచి ఒక్కసారిగా గేదెల మంద రోడ్డుపైకి రావడంతో డ్రైవర్ అదుపు తప్పి వాటిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నాలుగు గేదెలు మృతి చెందగా, మరో రెండు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

ఆ భవనాలకు మోక్షమెప్పుడో..?

• పూర్తయినా ప్రారంభానికి నోచుకోని వైనం • వృథా అవుతున్న ప్రభుత్వ నిధులు



వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజల వద్దకే పాలన తీసుకొస్తున్నామని గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పినప్పటికీ ఆచరణలో మాత్రం అలాంటి పరిస్థితులు కనిపించ లేదు. అప్పట్లో ఎంతో ఆర్భాటంగా సచివాలయ, రైతుసేవా కేంద్రాలకు సంబంధించిన భవనాలను మంజూరు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అదే అదునుగా భావించిన కొంతమంది ఆ పార్టీ నాయకులు కాంట్రాక్టర్ల అవతారమెత్తి హడావిడిగా పనులు చేపట్టి జేబులు నింపుకున్నారే తప్ప పనులు చేపట్టడంలో విఫలమయ్యారనే చెప్పుకోవచ్చు. దీంతో ఎటువైపు చూసినా నిరుపయోగంగా దర్శనమిస్తున్న ఆ భవనాల పుణ్యమాని రూ. కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వరికుంటపాడు మండలంలో మొత్తం 12 సచివాలయాలు, 12 రైతు సేవా కేంద్రాలు మంజూరయ్యాయి. ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు, రైతుసేవా కేంద్రానికి రూ.21.80 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసినప్పటికీ ఆ ప్రభుత్వ పాలన పూర్తయ్యే నాటికి కూడా వినియోగంలోకి తీసుకురాలేక పోయారంటే వాటి నిర్మాణాల్లో ఎంతమేర శ్రద్ధ వహించారో తేటతెల్లమవుతోంది. దీంతో అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా అరకొరగా సాగిన పనులతో చేసేదేమిలేక నేటికీ అద్దె, ప్రభుత్వ భవనాల్లోనే వాటిని కొనసాగిస్తూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. అసౌకర్యాల నడుమ ప్రతినిత్యం విధులు నిర్వర్తించడంతో తలకు మించిన భారంగా మారుతుందని సిబ్బంది సైతం వాపోతున్నారు.

• బిల్లుల భయం

ఇదంతా ఒకవంతైతే నిలిచిన పనులను తిరిగి చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. గత ప్రభుత్వంలో చేపట్టిన పనులకు ప్రస్తుతం బకాయిలు ఎంతమేర వస్తాయో అనే అనుమానాలతోనే వెనకడుగు వేస్తున్నట్లు తెలిసింది. ఇంతవరకు చేసిన పనులకు సైతం పూర్తి స్థాయిలో బిల్లులు మంజూరు కాకపోవడంతో ఇలాంటి పరిస్థితి దాపురించింది. వరికుంటపాడు, తోటలచెరువుపల్లి, తూర్పురొంపిదొడ్ల, వేంపాడు, పెద్దిరెడ్డిపల్లి, విరువూరు గ్రామాల్లో 70 నుంచి 90 శాతం వరకు పనులు పూర్తయినప్పటికీ మిగిలినవి చేపట్టడం లో బిల్లులు శాపంగా మారాయి. కాగా తిమ్మారెడ్డిపల్లిలో కేవలం బేస్మట్టంతోనే పనులు నిలిచిపోయాయి. పలు గ్రామాల్లో బిల్లులు అందలేదని కాంట్రాక్టర్లు చెబుతున్నప్పటికీ, మరికొన్ని గ్రామాల్లో మాత్రం అప్పటి అధికారులను గుప్పెట్లో పెట్టుకొన్న కొంతమంది చేపట్టిన పనుల కంటే అధికంగానే నగదు, సిమెంటును బిల్లుల రూపంలో దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం పనుల కోసం వారి మీద ఒత్తిడి తీసుకువస్తే గుట్టురట్టవుతుందనే భయంతోనే కాలం వెల్లబుస్తునట్లు తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి నిధులు దుర్వినియోగం కాకుండా ప్రభుత్వ భవనాలను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

• పూర్తయినా వినియోగంలోకి రాక..

పలు పంచాయతీల్లో నిర్మాణాలు పూర్తయినప్పటికీ ఏళ్ల తరబడి వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారు. అలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఆ భవనాలు అలంకారప్రాయంగానే దర్శనమిస్తున్నాయి. కాంచెరువులో సచివాలయం, రైతుసేవా కేంద్రాలను పూర్తి స్థాయిలో నిర్మాణాలు చేపట్టారు. అయినప్పటికీ బిల్లుల బకాయిలు ఉండడంతో కాంట్రాక్టర్లు వాటిని అధికారులకు అప్పగించకుండా తమ ఆధీనంలోనే ఉంచుకోవడం విశేషం. అధికారులు సైతం ఎలాంటి చర్యలు చేపట్టకుండా మనకెందుకులే అంటూ మౌనం వహిస్తుండడంతో ఆ గ్రామంలో వాటి నిర్వహణ దారుణంగా ఉంది. జీ.కొండారెడ్డిపల్లి, తూర్పుబోయమడగల, పెద్దిరెడ్డిపల్లిలోనూ రైతు సేవా కేంద్రాల నిర్మాణం పూర్తయినప్పటికీ వినియోగంలోకి తీసుకురావడంలో అలసత్వం వహిస్తున్నారు. కొంతమంది అధికార పార్టీ నాయకులు అలాంటి భవనాలను తమ సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం చూస్తుంటే వారి పనితీరు ఏవిధంగా ఉందో అర్థమవుతోంది. దీంతో అత్త సొమ్ము అల్లుడి దానం అన్న చందంగా పరిస్థితులు కన్పిస్తున్నాయనే ఆరోపణలు సైతం గుప్పుమంటున్నాయి.

పనులు చేపడితేనే బిల్లులు



ప్రస్తుతం పనులు చేపడితే బిల్లులు వస్తాయో, లేదో అనే అనుమానాలతో ముందుకు రాకపోవడం వాస్తవం. అలాంటి వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టిన వెంటనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తమ పరిధిలో బిల్లులు మంజూరవుతాయి.

- మనోహర్, పీఆర్ ఏఈ

యూరియా అందుబాటులోకి తీసుకురావాలి



ఏడీఏకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఉదయగిరి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా అందుబాటులోకి తీసుకురావాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని పలువురు రైతులు ఉదయగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మీమాధవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు పసుపు, సజ్జ, వరి తదితర పంటలు సాగు చేసి ఉన్నారన్నారు. ఆయా పంటలు నడి వయసులో ఉండడంతో యూరియా వేయాల్సిన అవసరం ఉందన్నారు. అయితే యూరియా తీవ్ర కొరత కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. అధిక ధరలు వెచ్చించినా ఎక్కడా దొరకడంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూరియా అందుబాటులోకి తీసుకురావాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్పందించిన ఏడీఏ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాల పట్ల అవగాహన

ఆత్మకూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని కెనరా బ్యాంకు మేనేజర్ సురేష్ బాబు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కాలేజీలో కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు ఆర్థిక ప్రణాళికను రూపొందించుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం ఏపీ గ్రామీణ బ్యాంకు మేనేజర్ మోహన్‌రావు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ రజత్ మహేన్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్క్ షాప్ సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ అశోక్ కుమార్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయభాస్కర్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చు



విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న ఖాజామొహిద్దీన్

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చని జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజామొహిద్దీన్ సూచించారు. బుధవారం మండలంలోని వెంకటంపేట, నందిపాడు, దుత్తలూరు ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించి సంబంధిత రిజిస్టర్లు తనిఖీ చేసి ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోధన విషయంలో ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు సరికొత్త విధానాలను అమలు చేయాలన్నారు. సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలన్నారు. విద్యార్థులను ఎఫ్ఏ-2 పరీక్షలను సిద్ధం చేయాలన్నారు. విద్యార్థుల డ్రాపవుట్స్ లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చినుకు రాలింది.. నాణ్యత తేలింది!

గుంతలమయమైన రహదారి



రెడ్లదిన్నె వద్ద కంకర లేచి ఛిద్రమైన రహదారి

ఉదయగిరి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రహదారుల మరమ్మతు పనులు మూణ్నాళ్ల ముచ్చటగానే మారాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పనుల్లో నాణ్యత డొల్లతనం వెలుగు చూసింది. దుత్తలూరు మండలంలోని రెడ్లదిన్నె, నందిపాడు, పాపంపల్లి వద్ద చేపట్టిన రహదారుల మరమ్మతు పనులు నెలలు గడవకముందే గుంతలు పడి కంకర తేలి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. నాణ్యతగా పనులు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా కిందిస్థాయి అధికారులు వాటిని పెడచెవిన పెట్టి పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేసి అందినకాడికి నిధులు స్వాహా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులను పరిశీలించి కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడంతోపాటు మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

గాయపడ్డ చిన్నారులకు పరామర్శ



చిన్నారులను పరామర్శిస్తున్న చెంచలబాబు

ఉదయగిరి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పసముద్రంలో వినాయక విగ్రహ నిమజ్జనోత్సవంలో బాణాసంచా పేలి తీవ్ర గాయాలై ఆత్మకూరు జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్న చిన్నారులను బుధవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులను అడిగి చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం వైద్యశాల సూపరిండెంటెంట్‌ను కలిసి చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుత్తలూరు మాజీ ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబు, వింజమూరు మండల టీడీపీ కన్వీనర్ గూడా నరసారెడ్డి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు మిలాద్-ఉన్-నబీ వేడుకలు



వేడుకలకు ముస్తాబైన దర్గా

ఉదయగిరి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో వెలసి ఉన్న సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్‌సాహెబ్ ఔలియా వారి దర్గాలో శుక్రవారం ప్రవక్త మహమ్మద్ జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ పురవీధుల్లో ఊరేగింపు, ప్రవక్త మహమ్మద్ పవిత్ర పాద చిహ్నాము దర్గాలో ప్రదర్శించడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం పెద్ద మసీదు ఆవరణలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఖాదరీయా ఆస్థానాలో గురువారం ప్రత్యేక ప్రార్థనలు, ప్రవక్త మహమ్మద్ ఉపన్యాసాలు, రాత్రికి అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. శుక్రవారం ఖురాన్ పఠనం, భక్తి గీతాలాపనలు, ప్రవక్త పవిత్ర చిహ్నాములు ప్రదర్శిస్తారని తెలిపారు. ఉదయం మగవారు, మధ్యాహ్నం మహిళలు ఈ చిహ్నాములను సందర్శించవచ్చని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టడం జరుగుతుందని, భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

సంగం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి ఎం పులయ్య డిమాండ్ చేశారు. బుధవారం వారు మండలంలోని దువ్వూరు వద్ద ధాన్యం విక్రయిస్తున్న రైతుతో మాట్లాడారు. సీజన్‌లో రైతులకు ఎరువులు అందుబాటులో లేక బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి రావడంతో ఖర్చులు భారీగా పెరిగాయన్నారు. ఎకరాకు సుమారు రూ. 40 వేల వరకు ఖర్చయిందన్నారు. ప్రస్తుతం దళారులు పుట్టి ధాన్యం రూ. 15వేలు, రూ. 15,500కు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులకు గిట్టుబాటు కావడం లేదన్నారు.

రహదారిని కమ్మేసిన కంపచెట్లు



ఉదయగిరి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని కావలి మార్గంలో చర్చి నుంచి ఎస్టీ కాలనీ వరకు రహదారిని కంపచెట్లు పూర్తిగా కమ్మేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో ప్రమాదకరంగా మలుపు ఉండడం, మార్జిన్‌లలో పూర్తిగా కంపచెట్లు మొలచి రోడ్డుపైకి వచ్చేశాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగి పలువురు క్షతగాత్రులయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

వినాయక నిమజ్జనంలో విషాదం

• సముద్రంలో కొట్టుకుపోయిన యువకుడు



నన్నం జశ్వంత్‌కుమార్

మనుబోలు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏడు రోజులపాటు కాలనీలో గణేశుడిని ఏర్పాటు చేసుని, భక్తితో పూజలు చేశారు. గ్రామోత్సవం చేసి గణపయ్యకు మొక్కులు తీర్చుకున్నారు. చెరువులో కాకుండా ఈ దఫా సముద్రంలో గణేశ్ నిమజ్జనం చేయాలని నిర్ణయించుకున్నారు. మండపం నిర్వాహకులు, కాలనీ యువకులు, పిల్లలు ఆడుతూ, పాడుతూ సముద్రం వరకు వెళ్లారు. నిమజ్జనం చేసే క్రమంలో ఓ కుర్రాడు సముద్రంలో మునిగిపోయాడు. దీంతో ఒక్కసారిగా అందరూ కన్నీటిపర్యంతమయ్యారు. ఈ సంఘటన తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం శ్రీనివాసనత్రం బీచ్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని పిడూరు మిక్సిడ్ కాలనీ వద్ద రామమందిరం సమీపంలో గణేశ్ మండపం ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి వినాయకుడి గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం పిడూరు నుంచి సముద్రంలో నిమజ్జనం చేసేందుకు తీసుకెళ్లారు. కాలనీకి చెందిన నన్నం రామయ్య కుమారుడు జశ్వంత్‌కుమార్ (17) కమిటీ సభ్యులతో కలిసి వెళ్లాడు. కాసేపట్లో నిమజ్జనం చేయబోతుండగా ముందు గానే జశ్వంత్‌తో పాటు అతని స్నేహితుడు సముద్రంలోకి వెళ్లగా అలకు కొంతదూరం జశ్వంత్ స్నేహితుడు వెళ్లిపోగా, స్నేహితుడిని కాపాడేందుకు జశ్వంత్ వెళ్లి బయటకు లాగే క్రమంలో మరో అల జశ్వంత్‌ను లాగేసుకుంది. తరువాత జశ్వంత్ కానరాలేదు. దీంతో అక్కడున్న వారంతా ఆందోళన చెందారు. కొద్దిసేపటికి అలతో పాటు జశ్వంత్ తీరానికి కొట్టుకువచ్చాడు. వెంటనే జశ్వంత్‌కు చికిత్స అందించేందుకు గూడూరుకు తరలించే క్రమంలో మార్గమధ్యంలోనే ప్రాణాలు వదిలాడు. మృతుడు మనుబోలు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు చదివాడు. ప్రస్తుతం ఆటో నడిపేవాడు. చేతికి అందివచ్చిన కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. దీంతో పిడూరు మిక్సిడ్ కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి. ఎస్ఐ శివరాకేష్ మృతుడి నివాసానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిమజ్జనంలో గొడవ : ఒకరిపై దాడి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహ నిమజ్జన సమయంలో తలెత్తిన గొడవతో ఒకరిపై దాడి చేసినట్లు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని మూలాపేట రావిచెట్టు సెంటర్‌కు చెందిన కృష్ణ శివగిరి కాలనీలో చిల్లర అంగడి నిర్వహిస్తున్నాడు. ఈ నెల 1వ తేదీన వినాయక నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతుండగా 'మా బొమ్మ దగ్గర నీకేం పనిరా..' అంటూ స్థానికుడు పెంచలయ్య తన అనుచరులతో కలిసి అడ్డుకున్నాడు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. దీనిని మనసుల్లో పెట్టుకున్న పెంచలయ్య మంగళవారం రాత్రి తన అనుచరులతో కృష్ణ ఇంటికి వెళ్లి అతనిపై దాడి చేశాడు. అడ్డుకోబోయిన కృష్ణ భార్య, తల్లిని తోసేశారు. బాధితుడు బుధవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాల్కనీ నుంచి పడి పదో తరగతి విద్యార్థి మృతి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బాల్కనీ నుంచి ఓ బాలుడు కిందపడి మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని విజయలక్ష్మీనగర్ గాయత్రి నిలయం రెండో అంతస్థులో ఎం రాజు, సుమతి దంపతులు నివసిస్తున్నారు. వారికి వంశీకృష్ణ(15), మహేంద్ర సంతానం. వంశీకృష్ణ సమీపంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. బుధవారం అతను స్కూల్‌కు వెళ్లేందుకు ఇంటి బాల్కనీలో బ్యాగ్ సర్దుకుంటుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు. గమనించిన వాచ్‌మన్ విషయాన్ని రాజుకు తెలియజేయడంతో ఆయన హుటాహుటిన కిందకు వచ్చి అపస్మారక స్థితిలో ఉన్న కుమారుడిని కిమ్స్ వైద్యశాలకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతిచెందినట్లు నిర్ధారించారు. తండ్రి వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

మద్యం కోసం డబ్బివ్వలేదని బ్లేడ్‌తో దాడి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం తాగేందుకు డబ్బులడిగితే ఇవ్వలేదని ఓ వ్యక్తి బ్లేడ్‌తో ఇద్దరిపై దాడి చేశాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని వెంకటేశ్వరపురానికి చెందిన వలి, నవాబుపేటకు చెందిన హరిప్రసాద్ అనే చిరు వ్యాపారులు ఇద్దరు స్నేహితులు. మూడురోజుల కిందట వారు నగరంలోని పూలే విగ్రహం వద్ద మాట్లాడుకుంటుండగా గుర్తుతెలియని వ్యక్తి వారి వద్దకు వచ్చాడు. తాగేందుకు డబ్బులు ఇవ్వాలని, లేకపోతే అంతు చూస్తానని బెదిరించాడు. వారు డబ్బులు లేవని చెప్పడంతో తన వద్దనున్న బ్లేడ్‌తో వలి, హరి ప్రసాద్‌పై దాడి చేసి పరారయ్యాడు. బాధితులు బుధవారం బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడు ఆలయాల్లో చోరీ

• నగదు, బంగారం అపహరణ



దుండగులు పగలకొట్టిన హుండీ

కలిగిరి, సెప్టెంబరు 3(ఆంధ్ర జ్యోతి): మండలంలోని మూడు ఆలయాల్లో మంగళవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. హుండీలను పగలగొట్టి అందులోని నగదు, స్వామి, అమ్మవార్ల బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లారు. బుధవారం ఉదయం గుర్తించిన స్థానికులు, పూజారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు.. మండలంలోని నాగసముద్రం పంచాయతీ అంబటివారి పాలెంలో ఉన్న రామాలయం, వినాయక స్వామి ఆలయాల్లో, నాగిరెడ్డిపాలెంలోని రామాలయంలో తలుపులు పగలగొట్టి చోరీకి పాల్పడిన దుండగులు హుండీలు పగలగొట్టి నగదు, సుమారు లక్ష రూపాలయ విలువైన నాలుగు తాళిబొట్లను అపహరించుకెళ్లారు. ఒక్కో హుండీలో సుమా రు రూ.10వేలకు పైగా నగదు ఉండవచ్చని స్థానికులు పేర్కొన్నారు. అంబటివారిపాలెం శివార్లలో ఉన్న పొలిమేర గంగిరెడ్డి ఇంటి తలు పులు పగుకొట్టి చోరీకి యత్నించగా ప్రస్తుతం ఆ ఇంట్లో ఎవరూ కాపురం లేకపోవడతో అక్కడ వారికి ఏమీ లభ్యం కాలేదు. సమా చారం అందుకున్న పోలీసులు, క్లూస్‌టీం సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని వేలిముద్రలు, వివరాలు సేకరించారు. కేసు నమోదుచేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ ఉమాశంకర్ తెలిపారు.

గిరిజన మహిళలపై వైసీపీ మూకల దాడి

ఇందుకూరుపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు పంచాయతీ రాపూరు డొంకలో బుధవారం గిరిజనులు వినాయకుడి గ్రామోత్సవం నిర్వహిస్తుండగా వైసీపీ అల్లరి మూకలు ఓ గిరిజన మహిళపై దాడి చేశారు. మద్యం సేవించిన వైసీపీ కార్యకర్తలు వాసు, సాయి, రాజశేఖర్, వంశీ, సృజన్‌కుమార్, గిరీష్ ఊరేగింపునకు అడ్డంగా బైకును పెట్టి గిరిజన యువకులపై దాడి చేశారు. అడ్డొచ్చిన గిరిజన మహిళపై అసభ్యంగా ప్రవర్తించారు. ఆమెపై దాడి చేసి జాకెట్ చించివేశారు. ఈ సంఘటనపై జిల్లా ఉన్నతాధికారులు, పోలీసులు స్పందించి, అల్లరి మూకలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాపూరుడొంక గిరిజనులు కోరారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	110
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	226

కోడిగుడ్ల ధర (100): 570

రైతులకు సహాయపడేదే సహకార సంస్థ

బిట్రగుంట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో ఉండి సహాయపడేదే సహకార సంస్థ అని టీడీపీ నేత మధుబాబు నాయుడు అన్నారు. బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలోని నాగుల వరం పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం అధ్యక్షుడు చిలకపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఫొటోల ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ కూటమి పాలనలో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శైలజ, డైరెక్టర్లు లక్కాకుల మాధవరావు, వాయిల సుధాకర్, నాయకులు యర్రం వెంకటేశ్వర్లురెడ్డి, బీజేపీ నేతలు ఎన్ఎస్‌యాదవ్, వీరాల శ్రీనివాసులుయాదవ్, జనసేన నేత టీ.వెంకటేశ్వర్లు, బీ.ప్రభాకర్, మాకాఅర్వత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో కూరగాయల సాగు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : తక్కువ ఖర్చుతో సేంద్రియ ఎరువులను వినియోగించి కూరగాయల సాగు చేపట్టి అధిక ఆదాయం పొందాలని ఎంపీడీవో నరేంద్రదేవ్ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం సేంద్రియ ఎరువుల వినియోగం, కూరగాయలు సాగు, వయోజన విద్యపై డ్వాక్రా మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆ కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్రదేవ్ మాట్లాడుతూ కూరగాయలు, విత్తనాలు పంపిణీ చేసిన మహిళలకు చెత్తసంపద కేంద్రంలో 2 కేజీల సేంద్రియ ఎరువు ప్యాకెట్ రూ.15లకే ఇవ్వనున్నట్లు తెలిపారు. నూరుశాతం అక్షరాస్యత సాధించేందుకు ప్రభుత్వం వయోజన విద్యా కేంద్రాలను ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నారాయణ, వెలుగు ఏపీఎం శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చవితి వేడుకలు



పూజల అనంతరం నిర్వాహకులతో వినాయకుడి విగ్రహం వద్ద డీఎస్పీ శ్రీధర్

కావలి(టౌన్), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకల పట్టణంలో బుధవారం కూడా కొనసాగాయి. బ్రిడ్జి కూడలిలో సిద్దు పర్యవేక్షణలో భగత్‌సింగ్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో అన్నదానం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీధర్, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు పాల్గొన్నారు. ముందుగా వినాయక విగ్రహం వద్ద పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. గణేష్ ఉత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని నిర్వాహకులను డీఎస్పీ అభినందించారు. రెండవ పట్టణ సీఐ గిరిబాబు పాల్గొని అన్నదానం ప్రారంభించారు. సిద్దు మాట్లాడుతూ ఉత్సవాలు జయప్రదం చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతూ గురువారం నిమజ్జన గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. కచ్చేరిమిట్టలో కలుగోళశాంభవి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు గురువారంతో ముగియనున్నాయి.

జాతీయ బాస్కెట్‌బాల్ జట్టుకు హేమంత్



హేమంత్

కందుకూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పంజాబ్‌లోని లూథియానాలో జరిగే జాతీయ స్థాయి బాలుర బాస్కెట్‌బాల్ పోటీలలో పాల్గొనేందుకు రాష్ట్రజట్టుకు కందుకూరుకు చెందిన శ్రీ గాయత్రీ కళాశాల విద్యార్థి చదలవాడ హేమంత్ ఎంపికయ్యారు. పిఠాపురంలో జరిగిన రాష్ట్రజట్టు శిక్షణ శిబిరంలో పాల్గొని ఈనెల 9 వరకు జరగనున్న జాతీయస్థాయి పోటీలకు బయలుదేరి వెళ్తున్న సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావు, డైరెక్టర్ భరద్వాజ్, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వలేటి రవీంద్ర, తొట్టెంపూడి సుబ్బారావు, అధ్యాపకులు హేమంత్‌ను అభినందించారు. జాతీయస్థాయి పోటీలలోను రాష్ట్రజట్టు విజేతగా నిలిచేలా హేమంత్ అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని వారు ఆకాంక్షించారు.

మూఢవిశ్వాసాలను రూపుమాపాలి

లింగసముద్రం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ మూఢ విశ్వాసాలను రూపుమాపేందుకు కృషి చేయాలని మాజీ సర్పంచు ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు చెప్పారు. లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో బుధవారం జరిగిన జేవీవీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రశ్నించే సమాజం నెలకొల్పేందుకు అందరూ సహకరించాలన్నారు. అలాగే చిన్ననాటి నుండే విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలన్నారు. చెకుముకి పత్రికలను తప్పనిసరిగా చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు టీవీవీ కృష్ణకుమార్, గారపాటి మహేంద్ర, కే.ప్రభాకర్, ఎం కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ మండల కార్యవర్గం ఎంపిక

మండల జనవిజ్ఞాన వేదికగా గారపాటి మహేంద్ర, గౌరవ అధ్యక్షుడుగా ఎం కొండయ్య, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ ప్రదీప్, కోశాధికారిగా కె ప్రభాకర్, మహిళా కార్యదర్శిగా సత్యవాణి, కార్యదర్శులుగా ఎం సుధాకర్‌రావు, టి శేషారావు, ఎ సాంబయ్య, ఆశా అరుణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పురుగు మందుల దుకాణాల తనిఖీ

దగదర్తి(బిట్రగుంట), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలంలో పలు ఎరువులు, పురుగు మందుల షాపులను అధికారులు బుధవారం తనిఖీ చేశారు. చెన్నూరు గ్రామంలోని వెంకటేశ్వర ట్రేడర్స్, అన్నపూర్ణ రైతు డిపోలో స్టాక్, రికార్డులు, పత్రాలను పరిశీలించారు. దగదర్తి గ్రామంలో శ్రీ వేంకటేశ్వర ఫర్టిలైజర్స్ షాపులో రికార్డులు, స్టాక్‌ను విజిలెన్ అధికారి శ్రీహరిరావు, ఇనెస్పెక్టర్ ఆఫ్ పోలీస్ వేణుగోపాలరావు, ఏవో శ్రీధర్‌రెడ్డి తనిఖీలు చేశారు.

కరేడులో పోలీసు నిర్బంధాలు ఆపకుంటే రాష్ట్రస్థాయి ఉద్యమం

● రైతు సంఘాలు, రైతుకూలీ సంఘాల నేతలు

కందుకూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉలవపాడు మండలం కరేడులో రాష్ట్ర ప్రభుత్వం బలవంతపు భూసేకరణను తక్షణం నిలిపివేయాలని, గ్రామంలో పోలీసు నిర్బంధాలను ఎత్తివేయకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని రైతుసంఘాలు, రైతుకూలీ సంఘాల నేతలు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయా సంఘాల నేతలు పాల్గొన్నారు. ముందుగా జేఏసీ చైర్మన్ మిరియం శ్రీనివాసులు మాట్లాడుతూ భూసేకరణపై అధికారులు అసత్య ప్రచారాలు చేసేందుకు సిద్ధపడటం వారి దిగజారుడుతనానికి అద్దం పడుతోందని విమర్శించారు. ఏపీ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ కరేడు ఉద్యమంలో ప్రజాసంఘాలు, గిరిజన మహిళలపై పెట్టిన అక్రమ కేసులు తక్షణం ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు గుజ్జుల ఈశ్వరయ్య, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, మిరియం శ్రీనివాసులు, కటారి అజయ్ కుమార్, సీహెచ్ సాగర్, ఎస్‌ఏ గౌస్, సురేష్‌బాబు, ఆర్. మోహన్, కనపర్తి శివరాం, పోకూరి కోటయ్య, కె. నాంచార్లు, జీవీబీ కుమార్, ఎల్.రాజశేఖర్, గంజి ప్రసాద్, మున్వర్‌సుల్తానా పాల్గొన్నారు.

● భారీ పోలీసు బందోబస్తు

రౌండ్ టేబుల్ సమావేశం సందర్భంగా కందుకూరులో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద, రౌండ్ టేబుల్ సమావేశం జరిగే ప్రాంతంలోనూ పట్టణంలోని ప్రధాన కూడళ్లలోను భారీగా పోలీసులు మోహరించారు.

మేయర్‌కి పదవీ గండం ?

(5వ పేజీ తరువాయి)

ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ అవిశ్వాస తీర్మానం కోసం సమావేశం ఏర్పాటు చేయాలి. నోటీసు అందిన 15 రోజుల్లో అవిశ్వాస తీర్మాన సమావేశానికి కలెక్టర్ తేదీ ప్రకటిస్తారు. ఆ తేదీన జరిగే సమావేశానికి కోరం ఉంటే అవిశ్వాస తీర్మానం కోసం ఓటింగ్ నిర్వహిస్తారు. కార్పొరేటర్ల మెజారిటీ ఓటింగ్ ప్రకారం అవిశ్వాస తీర్మానం నెగ్గిందా లేదా అనే విషయం తెలుతుంది. ప్రస్తుతం ఉన్న సంఖ్యాబలం ఆధారంగా గమనిస్తే మేయర్ పొట్లూరి స్రవంతికి పదవీ గండం తప్పదనే అనిపిస్తోంది.

రూ.లక్షలు వెచ్చిస్తున్నా....
కలుషిత నీరే దిక్కు..!

● పని చేయని మంచినీటి పథకాల ఫిల్టర్ బెడ్లు
● 'రాళ్లపాడు'లో నీరు అడుగంటి దుర్వాసన
● ఆందోళనలో పలు గ్రామాల ప్రజలు



మొగిలిచెర్ల సమీపంలోని మన్నేరు నదిలో ఉన్న చుండి-చెర్లోపాలెం మంచినీటి పథకం బావి

లింగసముద్రం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన భారీ మంచినీటి పథకాల నుంచి కలుషిత నీరు సరఫరా జరుగుతోంది. ప్రధానం రాళ్లపాడు ప్రాజెక్టు ఆధారంగా పనిచేసే మంచినీటి పథకాల నుంచి పచ్చగా మారిన కలుషిత నీరు సరఫరా అవుతోంది. దీంతో సుమారు 100కు పైగా గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గుడ్లూరు, రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకాలలోని ఫిల్టర్ బెడ్లు సక్రమంగా పని చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. పథకాల నిర్వహణ ఖర్చులకు ప్రతి నెల భారీ వెచ్చిస్తున్న నిధులు దుర్వినియోగం అవుతున్నాయి తప్ప పథకాలకు రాళ్లపాడు ప్రాజెక్టులో ఉన్న ఇన్‌టేక్ వెల్ నుంచి వచ్చే నీరు ఫిల్టర్ కావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రాజెక్టులో ప్రస్తుతం నీరు 7.5 అడుగులకు చేరింది. దీంతో నీరు రంగు మారి కలుషితమై దుర్వాసన వస్తున్నట్లు పలువురు తెలిపారు. వాస్తవానికి ప్రాజెక్టులో నీరు పచ్చగా ఉండి కలుషితమైనా మంచినీటి పథకాల ఫిల్టర్ బెడ్లు పని చేస్తే రక్షిత నీరే రావాల్సి ఉంది. కానీ ఫిల్టర్ బెడ్లు పని చేయనందువలన కలుషితమైన నీరు వస్తోందని ప్రజలు అంటున్నారు.

● గుడ్లూరు నీటి పథకంపై పర్యవేక్షణ కరువు

రాళ్లపాడు గ్రామ సమీపంలో ఉన్న గుడ్లూరు మంచినీటి పథకం నుంచి లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లోని 56 గ్రామాలకు నీటిని సరఫరా జరుగుతోంది. అయితే ఈ పథకంపై అధికారులు, నిర్వాహకుల పర్యవేక్షణ కరువైంది. చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్న అధికారులు ఉన్న నాలుగు ఫిల్టర్ బెడ్లు సరిగా పని చేస్తున్నాయా లేదా కూడా పర్యవేక్షించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ బెడ్లలో నాలుగేళ్ల క్రితం వేసిన ఇసుక అయిపోయింది. ఇసుక మార్చకపోవడంతో ఫిల్టర్ బెడ్లు పని చేయక మంచినీరు ఫిల్టర్ కాకుండా దుర్వాసన వస్తోంది.



రాళ్లపాడు గ్రామ సమీపంలో ఉన్న గుడ్లూరు మంచినీటి పథకం ఫిల్టర్ బెడ్

● 'రాళ్లపాడు-రోళ్లపాడు'లో పని చేయని ఫిల్టర్ బెడ్

రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకం నుంచి లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లోని 42 గ్రామాలకు మంచినీటిని సరఫరా చేస్తున్నారు. ఈ పథకంకు చెందిన పెంట్రాల వద్ద ఉన్న ట్రీట్‌మెంటు వాటర్ ప్లాంటులోని మూడు ఫిల్టర్ బెడ్లలో ఒక ఫిల్టర్ బెడ్ పని చేయడం లేదు. అలాగే ఈ ఫిల్టర్ బెడ్‌లోని పైపులు కూడా కొన్ని మరమ్మతులకు గురయ్యాయి. వీటిని బాగు చేసేందుకు సాంకేతిక నిపుణులను విజయవాడ లేదా చెన్నై నుంచి రప్పించాల్సి ఉంది. మిగిలిన రెండు ఫిల్టర్ బెడ్లలోని ఇసుకను మార్చాల్సి ఉంది. ఇందులోని ఇసుకను 2022లో మార్చారు. దీంతో మంచినీరు సరిగా ఫిల్టర్ కావడం లేదు. ఈ కారణంగా ఈ పథకం నుంచి కూడా మంచినీరు కలుషితమై వస్తోంది. దీంతో అధికారులు, నిర్వాహకులు ఇటీవల 10 రోజుల నుంచి రెండు రోజులకొకసారి బ్లీచింగ్ కలిపి మంచినీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే చుండి-చెర్లోపాలెం మంచినీటి పథకం నుంచి లింగసముద్రం మండలంలో 4 గ్రామాలకు, వలేటివారిపాలెం మండలంలో 7 గ్రామాలకు మంచినీటిని సరఫరా చేస్తున్నారు. ఈ పథకం బావి మొగిలిచెర్ల సమీపంలోని మన్నేరు నది నిర్మించారు. ఈ బావి నుంచి నీరు నేరుగా ట్యాంకులోకి పంపు చేసి అక్కడి నుంచి ఆయా గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. మంచినీటి ట్యాంకులో బ్లీచింగ్ వేసి నీటిని సరఫరా చేస్తున్నా ఇక్కడ సిబ్బంది కొరత వేధిస్తోంది. దీనితో గ్రామాల్లో వందల సంఖ్యలో పథకం మంచినీటి పైపులకు పైపులు, మోటార్లు వేసి వరల బావులను నింపుకుంటున్నారు. దీంతో నీటి సరఫరాలో ఇబ్బందులు కలగడంతో పాటు కొన్ని గ్రామాల ప్రజలకు నీరు అందడం లేదన్న ఆరోపణలున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మహిళల ఉచిత ప్రయాణంతో గ్రోత్ పెరిగింది

● డీ.ఆదినారాయణ, ఆర్టీసీ డీఎం,

కావలి(టౌన్), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళల ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ గ్రోత్ రేట్ పెరిగింది. గతంలో మహిళల ప్రయాణం గ్రోత్ రేట్ 30 శాతం ఉండగా ప్రస్తుతం 60 శాతానికి పెరిగింది. ఉచిత ప్రయాణంతో ఆర్టీసీకి ఎటువంటి నష్టంలేదని కావలి ఆర్టీసీ డీఎం డీ.ఆదినారాయణ తెలిపారు.

? ఇప్పటి వరకు ఎంత మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారు.

! ఆగస్టు 15 నుంచి 31వ తేదీ వరకు కావలి డిపో పరిధిలో 30,34,000 మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారు.

? మహిళా ప్రయాణికుల సంఖ్య ఏ మేరకు పెరిగింది, ఏఏ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయవచ్చు. ఏ బస్సుల్లో చేయకూడదు.

! మహిళా ప్రయాణికుల సంఖ్య 30 శాతం పెరిగింది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణాలు చేయవచ్చు. నాన్ స్టాప్, సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఏసీ బస్సుల్లో ప్రయాణానికి అనుమతి లేదు.

? ఉచిత ప్రయాణాలతో బస్సుల్లో రద్దీ పెరిగిందా. కొత్త బస్సులు ప్రవేశపెడతారా.

! బస్సుల్లో రద్దీ సమస్య లేదు. కొత్త బస్సులు ప్రవేశపెట్టాలనే ఆలోచన ప్రభుత్వం చేస్తుంది. ఎలక్ట్రిక్ బస్సులు కూడా రానున్నాయి.

పాఠశాలకు కుర్చీల వితరణ

వలేటివారిపాలెం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చుండి ఎంపీపీ స్కూల్‌కు అదే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి, హైదరాబాద్‌లో గైల్ కంపెనీలో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్న షేక్ మస్తాన్‌వళి ఎస్ ఆకారంలో ఉండే 3 కుర్చీలను బహూకరించారు. మస్తాన్‌వళికి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

టీడీపీతోనే మహిళల అభ్యున్నతి

● కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ● స్త్రీశక్తికి సంఘీభావంగా మహిళల భారీ ర్యాలీ



స్త్రీశక్తి పథకానికి సంఘీభావంగా పట్టణంలో మహిళలతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : మహిళల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలు ఆర్టీసీ బస్సులో ఎక్కడ నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం అమలుకు సంఘీభావంగా కావలిలో బుధవారం ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. కావలి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి పట్టణంలోని మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డులో ఉన్న ఐ లవ్ కావలి సెల్ఫీ పాయింట్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి ఎమ్మెల్యేతో కలిసి తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి ర్యాలీగా సూపర్‌సిక్స్ పథకాలతో కూడిన ప్లకార్డులు పట్టుకుని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సీఎం చంద్రబాబు చిత్రపటాలకు ఎమ్మెల్యేతోపాటు మహిళలు పాలభిషేకం చేశారు. అనంతరం అక్కడ నుంచి అంబేడ్కర్ విగ్రహం సెంటర్ మీదుగా శివాజీ సెంటర్‌కు ర్యాలీ చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలోనే ఎన్టీఆర్ హయాం నుంచి చంద్రబాబు వరకు మహిళల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించారన్నారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత తొలుత మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత ఎన్టీఆర్ దే నన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల మహిళలు, నాయకులు, పాల్గొన్నారు.

ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా కూటమి పాలన

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



మహదేవపురంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలకు అనుకూలంగా పాలన సాగిస్తోందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని మహదేవపురంలో 20 లక్షలతో నిర్మించబోయే సీసీ రోడ్లకు బుధవారం ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఇంతపెద్దమొత్తంలో నిధుల కేటాయింపుకు సహకరించిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. గతప్రభుత్వంలో పంచాయతీ రాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని, నేడు తిరిగి ఆ వ్యవస్థను గాడిలో పెట్టి గ్రామాలలో అభివృద్ధి అంటే ఏమిటో చంద్రబాబు చేసి చూపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, హరికృష్ణ, నార్నె రోశయ్య, గుళ్లా సుధాకర్, దామా అశోక్, గుల్లా సుబ్బయ్య, దామా చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు. కాగా గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు ఓరుగంటి రమణయ్య, గుళ్లా శ్రీనివాసులులు ఈ కార్యక్రమానికి దూరంగా ఉండటం, మరో సీనియర్ నేత గుళ్లా సుధాకర్ కూడా చివరి నిమిషం వరకు కార్యక్రమానికి వెళకుండా అలకవహించటం చర్చనీయాంశమైంది.

తలసేమియాపై అవగాహన



పిల్లలకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ వైద్యాధికారి, సిబ్బంది

కావలి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రక్తహీనత ఉన్న చిన్నారులకు ఉచితంగా హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి రక్తశాతం తక్కువగా ఉన్న వారికి అవసరమైన వైద్యసేవలకు రెడ్‌క్రాస్ అండగా ఉంటుందని కావలి రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్, తలసేమియా డేకేర్‌సెంటర్ కన్వీనర్ కే. హరినారపరెడ్డి తెలిపారు. స్థానిక తుఫాన్‌నగర్ జనరల్‌కాలనీ, అంగన్‌వాడీ కేంద్రాలలో బుధవారం తలసేమియాపై అవగాహన కల్పించారు. అనంతరం రెండు నుంచి 12 నెలలు ఉన్న చిన్నారులకు రెడ్‌క్రాస్ తల సేమియా డేకేర్‌సెంటర్ ఆధ్వర్యంలో ఉచితంగా 72 మందికి హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ రక్త కేంద్రం కన్వీనర్ డాక్టర్ రమ్య మాట్లాడుతూ పిల్లలలో సహజంగా పౌష్టికాహారం లోపం వలన రక్తహీనత ఉంటుందని కొంత మందిలో తలసేమియా సికిల్‌సెల్ లాంటి జన్యుపరమైన వ్యాధుల వలన కూడా రక్తహీనత ఉంటుందన్నారు. పౌష్టికాహారం లోపం వలన రక్తహీనత ఉన్న వారికి అదనపు ఆహారం మందుల వలన రక్తహీనత సమస్య తగ్గుతోందన్నారు. తలసేమియా సికిల్‌సెల్ వ్యాధి పీడితులకు ప్రత్యేక చికిత్స, తరచు రక్తం ఎక్కించటం చేయాలన్నారు. ఈ జన్యుపరమైన వ్యాధులు ఉన్న వారిని గుర్తించేందుకే స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంగళరావునగర్ అర్బన్‌ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ మహేష్, సూపర్‌వైజర్ ప్రసాద్,ఏఎన్ఎం రమాదేవి, రెడ్‌క్రాస్, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

దగదర్తి(బిట్రగుంట), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రసాయ ఎరువులు, విషపూరితమైన పురుగు మందుల వాడకాని మాని ప్రకృతి వ్యవసాయం చేయడం ఎంతో మంచిదని మండల వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. దగదర్తి మండలం పెద్దపుత్తేడు గ్రామ సచివాలయ పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచు నాగమణి, మోడల్ మండల టీం లీడర్ హరిచందన, సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఏడుకొండలు, సురేఖ, మౌనిక, యానాదయ్య, యమున, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సుష్మ, రైతులు తదితరు లు ఉన్నారు.

ఈ క్రాప్ నమోదును వేగవంతం చేయాలి

● జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి



మాట్లాడుతున్న డీఏవో సత్యవాణి

కందుకూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వీఏఏలు ఈ క్రాప్ నమోదును వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారిణి పీ.సత్యవాణి కోరారు. స్థానిక కృషి విజ్ఞానకేంద్రం సమావేశ మందిరంలో ఇంచార్జి ఏడీఏ కేవీ శేషారెడ్డి అధ్యక్షతన బుధవారం కందుకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల వీఏఏలు, వ్యవసాయ సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ క్రాఫ్ నమోదులో సిబ్బంది పూర్తిగా వెనుకబడి ఉన్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈనెలాఖరులోగా ఎట్టిపరిస్థితుల్లో ఈ క్రాఫ్ నమోదు ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు.

● వారంలోగా యూరియా నిల్వలు

కందుకూరు సబ్ డివిజన్‌లో తీవ్రంగా ఉన్న యూరియా కొరత, ఆర్ఎస్‌కేలలో ఎరువులు అందుబాటులో లేనందున ప్రైవేటు వ్యాపారుల వద్ద బ్లాక్‌లో కొనుగోలు చేసి రైతులు నష్టపోతున్న పరిస్థితులపై ఆంధ్రజ్యోతి ఆమెను ప్రశ్నించగా వారంలోగా సంవృద్ధిగా ఈ ప్రాంతానికి యూరియా నిల్వలు వచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మెట్టప్రాంతాల కోసం ప్రత్యేకంగా 500 టన్నుల యూరియా కేటాయించారని ఆ యూరియాలో అధికవాటా కందుకూరు సబ్ డివిజన్‌కే కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జామాయిల్ రైతులు కూడా యూరియా కోసం ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాలలో యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని రైతు సేవాకేంద్రాలలో ఎరువుల నిల్వలు పెట్టేలా తక్షణం చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు. ఆ మేరకు ఏర్పాట్లు చేసుకుని ఇండెంట్లు పంపించాలని వ్యవసాయ సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. ఏడీఏ శేషారెడ్డి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు జమకాని రైతులకు సాంకేతిక అడ్డంకులు తొలగేలా చర్యలు తీసుకోవాలని వీఏఏలకు సూచన చేశారు. ఈ సమావేశంలో ఏఓలు అబ్దుల్‌రహీం, రవికుమార్, విజయ్‌కుమార్, గీతాప్రకాష్, సీహెచ్ దుర్గ, జి. మధు తదితరులు పాల్గొన్నారు.

'క్యాన్సర్ స్క్రీనింగ్' పకడ్బందీగా నిర్వహించాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మజ



శిక్షణలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మజ

కందుకూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : కందుకూరు డివిజన్‌లో త్వరలో చేపట్టనున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఆరోగ్య సిబ్బంది సన్నద్ధం కావాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టరు పీ.పద్మజ కోరారు. బుధవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో డివిజన్‌లోని ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలను వేధిస్తున్న నోటి, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్‌లను ప్రాథమిక దశలో గుర్తించటం ద్వారా పూర్తిగా నివారించేందుకు అవకాశం ఉందన్నారు. ఈ మూడు క్యాన్సర్‌లు వచ్చే లక్షణాలు ఉన్నవారిని గుర్తించడమే లక్ష్యంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రత్యేక యాప్‌లో మహిళలను సంబంధిత ప్రశ్నలు అడిగి లక్షణాలను గుర్తించేలా వైద్యాధికారులు సమగ్రశిక్షణ నిచ్చారు. యాప్‌లో వ్యాధి లక్షణాలు ఉన్నట్లు తేలిన 30 ఏళ్ల పైబడిన మహిళలందరికీ సమీపంలోని ఏరియా వైద్యశాలలో నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు యశ్వంత్, శాంతి, శైలజ, బ్యూలాగ్రేస్, మహేష్‌రెడ్డి, సీహెచ్‌వో గుంటుపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయాలి

ఉలవపాడు, సెప్టెంబరు 3 : రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించి సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి పీ.సత్యవతి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని వీరేపల్లి రైతుసేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ రైతులు ప్రతి ఏటా భూసార పరీక్షలు చేయించుకుని పంటలకు అనుగుణంగా తగిన మోతాదులో ఎరువుల వినియోగం చేయాలన్నారు. భూమిలో కార్బన్ శాతం పెంచుకోవాలని, అందుకోసం పచ్చిరొట్ట ఎరువులు జనుము, జీలుగ విత్తనాలు వేసి పూతదశలో కలియదున్నాలని పేర్కొన్నారు. వీటికి సంబంధించిన విత్తనాలు సబ్సిడీలో పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నర్సోజీ, కందుకూరు ఏడీఏ కేవీ శేషారెడ్డి, ఉలవపాడు ఏవో విజయ్‌కుమార్, వీఏఏ, వీహెచ్ఏలు శైలజ, వెంకట్రావు, షారుక్, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతికి సిట్



చెవిరెడ్డి ఇంటి వద్ద వేచిఉన్న అధికారులు

- విజిలెన్సుతో కలిసి చెవిరెడ్డి కార్యాలయంలో తనిఖీ
- ఇల్లు, కార్యాలయం మూతతో కుటుంబీకుల కోసం నిరీక్షణ

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణాన్ని విచారిస్తున్న 'సిట్' అధికారులు బుధవారం తిరుపతికి వచ్చారు. ఈ కుంభకోణంలో ఇప్పటికే అరెస్టయిన చంద్రగిరి మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఇంట్లో తనిఖీల నిమిత్తం అదనపు ఎస్పీ నేతృత్వంలోని 15 మంది వచ్చారు. వీరికి సహాయంగా విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆధ్వర్యంలో సిబ్బందిని తీసుకొచ్చారు. ఈ విషయం తెలిసి వైసీపీ వర్గాల్లో కలకలం రేగింది. తనిఖీల్లో ఏ ఆధారాలు లభిస్తాయి.. వాటి పర్యవసానాలు ఎలా ఉంటాయోనన్న ఆందోళన నెలకొంది. సిట్ అధికారులు తొలుత తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని కేవీఎస్ రియల్ ఎస్టేట్ కార్యాలయానికి చేరుకుని దాదాపు గంట పాటు తనిఖీలు జరిపారు. అక్కడ చెవిరెడ్డికి సంబంధించిన కార్యాలయాన్ని ఖాళీ చేసినట్లు గుర్తించారు. మధ్యాహ్నం ఒంటి గంటప్రాంతంలో తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని 1-4 డోర్ నెంబరులోని చెవిరెడ్డి ఇంటి వద్దకు వెళ్లారు. అక్కడ ఇంటికి తాళాలు వేసి ఉంది. ఆ ఇంట్లోనే కార్యాలయమూ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. సమీపంలోనే ఉంటున్న చెవిరెడ్డి తల్లి, సోదరుడు రఘునాధ రెడ్డి తదితరులతో మాట్లాడారు. మంగళవారం మధ్యాహ్నమే చెవిరెడ్డి సతీమణి, కుమారులు హైదరాబాదు వెళ్ళినట్లు సమాచారం సేకరించారు. అధికారులు వారితోనే చెవిరెడ్డి కుమారులకు ఫోన్ చేయించి ఇంట్లో తనిఖీలు చేపట్టాల్సి వుందని సమాచారం అందజేశారు. సాయంత్రం 7 గంటల్లోగా ఇంటి తాళాలు తెరిపించకుంటే పంచనామా నిర్వహించి తాళాలు పగలగొట్టి తనిఖీలు చేపడతామని స్పష్టం చేసినట్లు సమాచారం. తాము రావడానికి రాత్రి 10 గంటలు అవుతుందని,అప్పటి దాకా గడువు ఇవ్వాలని వారు కోరినట్లు తెలిసింది.సాయంత్రం నాలుగున్నర తర్వాత ఆ ఇంటి నుంచి అధికారులు వెనుదిరిగారు.మరోవైపు చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి సంబంధించిన ఇన్‌ఫ్రా కంపెనీల్లోనూ సిట్ అధికారులు తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం. తిరుపతి, చిత్తూరుతో పాటు పలు చోట్ల తనిఖీలు జరుగుతున్నాయి. కాగా, రికార్డుల్లో ఉన్న కంపెనీ పేర్లకు.. క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న కంపెనీల పేర్లు వేర్వేరుగా ఉన్నట్లు అధికారుల తనిఖీల్లో వెలుగులోకి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రధానంగా చెవిరెడ్డి ఆర్థిక లావాదేవీలను సిట్ పరిశీలించనున్నట్లు తెలిసింది.

నేడూ కొనసాగనున్న తనిఖీలు

బుధవారం రాత్రి 9 గంటల వరకు చెవిరెడ్డి భాస్కర రెడ్డి ఇంటి వద్దకు అతని కుటుంబ సభ్యులు ఎవరూ రాలేదు. వీరు వచ్చాక గురువారం ఇంట్లో సోదాలు చేయనున్నారు. కాగా, చెవిరెడ్డి ఇంటివద్దకు సిట్, విజిలెన్సు బృందం చేరుకోగా.. వైసీపీకి చెందిన తిరుపతి రూరల్ ఎంపీపీ చంద్రమౌళిరెడ్డి, వైస్ ఎంపీపీ మాధవ రెడ్డి, సర్పంచులు కేశవులు, చిన్నియాదవ్, మైనారిటీ నాయకుడు కె.వలీ తదితరులు అక్కడకు చేరుకున్నారు.

చిత్తూరులో అలజడి

- విజయానందరెడ్డి, మోహిత్‌రెడ్డి కార్యాలయాల్లో సోదాలు



విజయానందరెడ్డి కార్యాలయం నుంచి రికార్డుల్ని తీసుకెళ్తున్న సిట్ అధికారులు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్ కేసులో 'సిట్' దర్యాప్తు చిత్తూరుకు చేరింది. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన వైసీపీ నేతలు మిథున్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర రెడ్డి జైల్లో వున్న విషయం తెలిసిందే. ఇటీవల మాజీ మంత్రి నారాయణస్వామిని కూడా పుత్తూరులోని ఆయన నివాసంలో రోజంతా విచారించారు. తాజాగా, చిత్తూరు వైసీపీ ఇన్‌ఛార్జి విజయానందరెడ్డి పేరు తెరపైకి వచ్చింది. ఆయనకు సిట్ నోటీసులు ఇవ్వగా, రెండు రోజుల కిందట విజయవాడకు వెళ్లి విచారణకు హాజరై వచ్చిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు చిత్తూరు నగరం బీవీరెడ్డి కాలనీలోని నలందా నగర్‌లో ఉన్న విజయానందరెడ్డి అపార్ట్‌మెంటుకు సిట్ అధికారుల బృందం చేరుకుంది. అపార్ట్‌మెంటులోని రెండవ అంతస్థులో ఉన్న 'వెల్‌టాస్క్ ఫుడ్ అండ్ బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్' కార్యాలయంలో సిట్ ఏఎస్పీ కులశేఖర్ ఆధ్వర్యంలో సుమారు 9 మంది అధికారులు తనిఖీ చేశారు. లిక్కర్ స్కామ్‌లో జరిగిన ఆర్థిక లావాదేవీలపై ప్రధానంగా తనిఖీలు నిర్వహించారు.గత ప్రభుత్వంలో వాహనాల ద్వారా లిక్కర్ సరఫరా చేసే టెండర్‌ను విజయానందరెడ్డి దక్కించుకున్నారనే సమాచారంతో సిట్ అధికారులు తనిఖీ చేశారు. ఆ కార్యాలయంలోనే ఉన్న మరో విభాగంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి చెందిన కార్యాలయం 'సీఎంఆర్' కూడా ఉంది. ఈ రెండు కార్యాలయాల్లోని పలు రికార్డులను సిట్ అధికారులు రాత్రి 8 గంటలకు వరకు తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాల్లోని రికార్డులను స్వాధీనం చేసుకుని వెంట తీసుకెళ్లారు. సిట్ అధికారులు తనిఖీ చేస్తున్నంతసేపు స్థానిక పోలీసులు లోపలికి ఎవరూ వెళ్లకుండా చూసుకున్నారు.సిట్ తనిఖీల విషయం హాట్ టాపిక్‌గా మారింది. ఇదిలా ఉండగా, విజయానందరెడ్డి ఆరోగ్యం బాలేదని చెన్నై అపోలో ఆసుపత్రిలో చేరినట్లు సమాచారం.

తూపిలిపాళెం తీరం... కల్లోలం

- వేట విరమించిన మత్స్యకారులు



వాకాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వాకాడు మండలంలోని తూపిలిపాళెంలోని సముద్రతీరం కల్లోలంగా మారింది. వాతావరణంలో మార్పుతో ఆరు మీటర్ల ఎత్తు వరకు అలలు ఎగిసిపడుతున్నాయి. కొన్ని నిమిషాల పాటు సముద్రం నిశబ్దంగా మారుతుంది. వాతావరణంలో వచ్చిన మార్పును బట్టి మత్స్యకారులు ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. బుధవారం తెల్లవారుజామునుంచే హోరుగాలితోపాటు ఇసుకరేణువులు గాలిలో తేలి తూపిలిపాళెం సముద్రతీరంలో వచ్చిన పర్యాటకులకు, నిమజ్జనానికి విచ్చేసిన భక్తులకు తీవ్ర ఆటంకంగా మారింది. అల్పపీడన ప్రభావంతో తీరప్రాంతాలకుచెందిన తూపిలిపాళెం, కొండూరుపాళెం, అంజలాపురం, శ్రీనివాసపురం, వైట్‌కుప్పం తదితర గ్రామాల మత్స్యకారులు వేట విరమించారు.

నేను చెప్పిన అభ్యర్థికే పోస్టు దక్కాలి!



స్విమ్స్ అధికారులు 2023 అక్టోబరు 22న రిక్రూట్ మెంట్ నోటిఫికేషన్ జారీ చేశారు. అందులో డెంటిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు 'డెంటిస్ట్రీ'గా పేర్కొన్నారు.

తాజాగా జారీ చేసిన నోటిఫికేషన్‌లోనూ ఈ పోస్టును చూపారు. డిపార్టుమెంట్ అన్న కాలమ్‌లో డెంటిస్ట్రీ బదులు 'ఓరల్,మ్యాక్సిల్లో ఫేషియల్ సర్జరీ' అని పేర్కొన్నారు.

తాను అనుకున్న వ్యక్తికి ఆ పదవి దక్కేలా తిరుపతిలోని వైసీపీ ముఖ్యనేత ఒకరు చెప్పడంతో తాజా నోటిఫికేషన్‌లో డెంటిస్ట్రీ బదులు.. ఎండీఎస్‌లో ఒక స్పెషాలిటీ పేరు పెట్టారని అంటున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి 14 నెలలైనా స్విమ్స్‌లో మాత్రం ఆయన ప్రభావం కనిపిస్తుండటం ఈ నోటిఫికేషనే నిదర్శనం.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- స్విమ్స్ డెంటల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు వైసీపీ నేత టార్గెట్
- 2023లో తీవ్ర పోటీతో పెండింగ్
- జాగ్రత్తగా ప్లాన్ చేసి తాజా నోటిఫికేషన్ జారీ
- నేటికీ స్విమ్స్‌ను వీడని వైసీపీ ప్రభావం

టీటీడీ నిర్వహణలోని స్విమ్స్‌లో 9 ప్రొఫెసర్, 20 అసోసియేట్ ప్రొఫెసర్లు, 67 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకానికి గత నెల 14న నోటిఫికేషన్ జారీ అయింది. ఇందులో డెంటల్ విభాగంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు ఉంది. ఆ విభాగాన్ని డెంటిస్ట్రీ అని పేర్కొనాలి. దీనికి ఎండీఎస్ (మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జరీ)లో ఎనిమిది స్పెషాలిటీల వైద్యులందరూ దరఖాస్తు చేయడానికి అర్హులవుతారు. ఆ ప్రకారమే 2023లో నోటిఫికేషన్ ఇచ్చారు. మరిప్పుడు ప్రత్యేకించి 'ఓరల్ మ్యాక్సిలో ఫేషియల్ సర్జరీ' అన్న స్పెషాలిటీని మాత్రమే నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇలా చేయడం వెనుక తిరుపతికి చెందిన వైసీపీ ముఖ్య నేత ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ నేత సిఫార్సు చేసిన వ్యక్తికి ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు దక్కేందుకే ఇలా చేశారని అంటున్నారు. 2023 అక్టోబరు 22న విడుదల చేసిన నోటిఫికేషన్‌లో డెంటిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టును చేర్చారు. ఆ పోస్టుకు వైసీపీ నేత తనకు కావాల్సిన అభ్యర్థిని సిఫారసు చేసినట్టు సమాచారం. అప్పట్లో వైసీపీనే అధికారంలో ఉండటంతో ఆ నేత సూచించిన అభ్యర్థికే ఆ పోస్టు దక్కుతుందని ధీమాతో ఉన్నారట. అందుకని రూ.25 లక్షలకు బేరం కుదుర్చుకుని ఆ నేత వ్యక్తిగత సహాయకుడి ద్వారా రూ.23 లక్షలు తీసుకున్నట్టు ఆరోపణలున్నాయి. అప్పట్లో ఈ పోస్టుకోసం రాష్ట్ర అత్యున్నత నేత.. సీఎంవోలో చక్రం తిప్పిన అధికారి తమ వాళ్లకూ సిఫారసు చేయడంతో టీటీడీ కీలక అధికారి తీవ్ర ఒత్తిడికిలోనై ఆ పోస్టును భర్తీ చేయలేదని సమాచారం. ఆ డబ్బు వెనక్కి ఇవ్వాలని ఆ వ్యక్తి వైసీపీ నేతను ఒత్తిడి చేస్తున్నారని సమాచారం. డబ్బు ఇవ్వని ఆయన.. వైసీపీ ప్రభుత్వంలో నియమితులై ఇప్పటికీ కొనసాగుతున్న స్విమ్స్ కీలక అధికారులపై ఒత్తిడి తెచ్చి తాజా నోటిఫికేషన్‌లో ఆ పోస్టును మళ్లీ చేర్పినట్టు ప్రచారం జరుగుతోంది. తాను సూచించిన అభ్యర్థికే పోస్టు దక్కేలా .. ఆ వ్యక్తి చేసిన స్పెషాలిటీని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారనే ప్రచారం నడుస్తోంది. ఇలాగైతే తక్కువ మంది దరఖాస్తు చేస్తారని తద్వారా తమ అభ్యర్థికి అవకాశం ఇప్పించుకోవచ్చని ఆ నేత భావించారట. ఈ విభాగంలోని రెగ్యులర్ ప్రొఫెసర్‌ది 'ఓరల్, మ్యాక్సిల్లో ఫేషియల్ సర్జరీ' స్పెషలైజనే. ఇప్పుడు అసిస్టెంట్ ప్రొఫెసర్‌కూ ఇదే స్పెషాలిటీ పేర్కొనడం ద్వారా స్విమ్స్ అధికారులు తీవ్ర విమర్శలను, ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఆ అసిస్టెంటు ప్రొఫెసర్ పోస్టును డెంటిస్ట్రీ డిపార్టుమెంటు కింద చూపకుంటే తామంతా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కోల్పోతామని స్విమ్స్‌లోనే డెంటల్ విభాగంలో అడహాక్ పోస్టుల్లో కొనసాగుతున్న కొందరు బతిమలాడినట్టు సమాచారం. వారికి ఆ వైసీపీ నేత వ్యక్తిగత సహాయకుడు.. స్విమ్స్‌లో కొందరు అధికారుల నుంచీ బెదిరింపులు ఎదురైనట్టు తెలిసింది. దీనిపై వివరాలు సేకరించిన టీటీడీ పాలకమండలి సభ్యులొకరు టీటీడీ ఈవోకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడుతున్నట్టు సమాచారం. కాగా, గత ప్రభుత్వంలో పెద్దల సిఫారసుతో బయటి నుంచి నియమితులైన కీలక అధికారులు ఇంకా కొనసాగుతుండటంతో వైసీపీ హవా నడుస్తున్నట్లు సమాచారం.

అక్టోబరు 25న బాలోత్సవం

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అక్టోబరు 25వ తేదీ నుంచి రెండు రోజులపాటు బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్, డ్రాయింగ్, మట్టితో బొమ్మలు తయారు చేయడం వంటి అంశాలతోపాటు జానపద నృత్యం, జానపద గీతాలు, భక్తిగీతాలు, కోలాటం, క్లాసికల్ డాన్స్, ఏకపాత్రాభినయం, ఫ్యాన్సీ డ్రెస్ తదితర పోటీలు ఉంటాయని వివరించారు. న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించడానికి స్వచ్ఛంద సేవకులు పేర్లను 9398000686 నంబరు వాట్సప్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు.

పద్మావతి వర్సిటీకి అంతర్జాతీయ ప్రాజెక్టు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీకి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ప్రాజెక్టు మంజూరైంది. శాస్త్రి ఇండో కెనడియన్ పేరుతో గల ప్రాజెక్టుకు ఎంపిక కావడం పట్ల పద్మావతి వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని,డీన్ విజయలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు.దేశంలోని 30యూనివర్సిటీలు దీనికి పోటీ చేయగా, నాలుగు యూనివర్సిటీలు ఎంపికయ్యాయి. ఇందులో పద్మావతి వర్సిటీ ఒకటి. ఈ ప్రాజెక్టులో భాగంగా కమ్యూనిటీ హెల్త్ అండ్ న్యూట్రియేషన్‌తో పాటు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌పై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించే అవకాశం ఏర్పడింది. కాల వ్యవధి రెండేళ్లు. విద్యార్థులు, అధ్యాపకులు కూడా కెనడాకు ఈ ప్రాజెక్టు వ్యవహారాల్లో భాగంగా వెళ్లి వచ్చే అవకాశం ఏర్పడింది.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

- శ్రీనివాససత్రం బీచ్‌లో యువకుడి మృతి

కోట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోట మండలం శ్రీనివాససత్రం బీచ్‌లో బుధవారం యశ్వంత్ (20) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.... నెల్లూరు జిల్లా మనుబోలు మండలం పిడూరు గ్రామానికి చెందిన యశ్వంత్ ఆటో డ్రైవర్. వినాయక చవితి సందర్భంగా గ్రామంలో ప్రతిష్ఠించిన విగ్రహాన్ని నిమజ్జనం చేయడానికి బుధవారం స్థానిక యువకులతో కలసి శ్రీనివాససత్రం సముద్ర తీరానికి వచ్చారు. యువకులంతా విగ్రహాన్ని సముద్రంలోకి తీసుకెళ్తుండగా అలల ఉధృతికి యశ్వంత్ సముద్రంలోకి కొట్టుకెళ్లారు. తోటి యువకులు రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితంలేకుండా పోయిది. గంట తర్వాత అలలపై తేలుతుండగా..యశ్వంత్‌ను బయటకు తీసుకొచ్చి చిల్లకూరు మండలంలోని చింతవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే యశ్వంత్ మృతి చెందినటుల వైద్యులు చెప్పారు. దీంతో శవాన్ని పిడూరుకు తీసుకువెళ్లారు.దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

వైభవం... రథోత్సవం




ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో బుధవారం మధ్యాహ్నం వరసిద్ధుడికి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.కాకర్లవారిపల్లెకు చెందిన కీర్తిశేషులు ఎత్తిరాజులునాయుడు,శివప్రసాద్ జ్ఞాపకార్థం మీనాకుమారి, కాణిపాకానికి చెందిన మాజీ వీఎం పూర్ణచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు, మాజీ వీఎం కీర్తి శేషులు చంద్రశేఖర రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు హరిప్రసాద రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం మూల విరాట్‌కు ఘనంగా అభిషేకం నిర్వహించాక అలంకార మండపంలో సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మరథంపై ఆశీనులను కావించి ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల మధ్య రథాన్ని భక్తులు, ఉభయదారులు కొంత దూరం లాగి భక్తుల దర్శనార్థం ఉంచారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులు బ్రహ్మరథంపై ఉప్పు, బొరుగులు, మిరియాలు, చిల్లర నాణ్రాలు చల్లి, కొబ్బరి కాయలు సమర్పించి, కర్పూర హారతులతో మొక్కులు తీర్చుకున్నారు.రథోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో పుష్పాలంకరణలు, వివిధ రకాల దేవతా మూర్తుల ప్రతిమలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. రథోత్సవ సమయంలో ఆలయ సిబ్బంది ధరించిన సైనికుల వేషధారణలు, కీలు గుర్రాలు ఆకర్షించాయి.అశేష భక్తజనం నడుమ మధ్యాహ్నం 3 గంటల సమయంలో రథాన్ని కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. కాగా, గురువారం ఉదయం భిక్షాండి కార్యక్రమాన్ని,రాత్రి అశ్వ వాహన సేవను నిర్వహించనున్నారు.

73373 36457

చెత్త ఉంటే వాట్సాప్ నెంబరుకు ఫిర్యాదు చేయండి

- ప్రజలకు డీపీవో సుశీలాదేవి పిలుపు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మీ పంచాయతీల్లో చెత్త సేకరణ సరిగా జరగలేదా? చెత్త పేరుకుపోయి ఉందా? పారిశుధ్యం అధ్వానంగా ఉంటే ఆ ఫొటోలను 73373 36457 వాట్సప్ నెంబరుకు అప్‌లోడ్ చేయండి. ఫోను చేసి ఫిర్యాదులూ చేయొచ్చు.. అంటూ ప్రజలకు డీపీవో సుశీలాదేవి పిలుపునిచ్చారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఆమె తన కార్యాలయం నుంచి జిల్లాలోని ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్సులో సమీక్షించారు. నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. కొన్ని పంచాయతీల్లో అధికారుల తీరుపై ఫిర్యాదులు అందుతున్నాయని, వీటిపై ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. పైపులైన్ లీకేజీ, వాటర్‌ట్యాంకులు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. నివాసిత ప్రాంతాల్లో పేడ దిబ్బలు తొలగించాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియను నిర్లక్ష్యంచేయొద్దని సూచించారు. అక్టోబరు 2 నుంచి మిగిలిన పంచాయతీల్లోనూ ఇంటింటిచెత్త సేకరణ ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పారిశుధ్యం విషయంలో సూళ్ళూరుపేట, గూడూరు తదితర ప్రాంతాల్లోని కొందరు పంచాయతీ కార్యదర్శులపై ఆమె ఆగ్రహించారు.



శ్రీవారి సేవలో ప్రముఖులు





మణీందర్‌జిత్ బిట్టా - భూపిందర్ సింగ్ హుడా

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఆలిండియా యాంటీ టెర్రరిస్ట్ ఫ్రంట్(ఏఐఏటీఎఫ్) చైర్మన్ మణిందర్‌జిత్ బిట్టా, హర్యానా మాజీ సీఎం భూపింద్ సింగ్ హుడా ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

గోవిందుడి ఆలయంలో పవిత్ర ప్రతిష్ఠ



స్వామి ఉత్సవ విగ్రహానికి విశేష అభిషేకాలు చేస్తున్న అర్చకులు

గోవిందరాజస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం పవిత్ర ప్రతిష్ఠ ఆగమోక్తంగా జరిగింది. ఉదయం యాగశాలలో ఆకల్మష ప్రాయశ్చిత్తం, పంచగవ్య ప్రాసన చేశారు. అనంతరం కల్యాణ మండపంలో గోవిందరాజస్వామి ఉత్సవమూర్తికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. కర్పూర హారతులు సమర్పించారు. తర్వాత శాత్తుమొర, ఆస్థానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు తిరువీధి ఉత్సవం నిర్వహించారు. రాత్రి యాగశాలలో పలు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద జీయర్, చిన్న జీయర్లు, టీటీడీ డిప్యూటీ ఈవో వీఆర్.శాంతి, ఏఈవో ఏబీనారాయణచౌదరి, సూపరింటెండెంట్, ఆలయ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 7 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.90 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,925

తలనీలాలు సమర్పించినవారు: 21,338

'పట్టు' సాధించిన మగువలు

● పట్టు చీరల నేతలో నైపుణ్యం



మగ్గంపై చీర నేస్తున్న కార్మికురాలు

భాకరాపేట, ఆంధ్రజ్యోతి

చేనేత ..దయనీయ స్థితిలో కొట్టుమిట్లాడుతున్న రంగాల్లో ఇదొకటి.. ఆధునిక మరమగ్గాల ప్రవేశంలో ఎంతోమంది కార్మికులు ఉపాధికి దూరమయ్యారు. కానీ చినగొట్టిగల్లు మండలంలో మూడు గ్రామాల్లో ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడి మహిళలకు అదే రంగం ఆసరాగా నిలుస్తోంది. వీరి నైపుణ్యప్రతిభకు పట్టం కడుతోంది. తొగటపల్లె, రంగన్నగారిగడ్డ, నల్లఓబులవారిపల్లె గ్రామాలలో తరుణీమణులే చేనేత మగ్గాలతో పట్టు వస్త్రాలను నేస్తూ సత్తా చాటుతున్నారు. మరమగ్గాలకు పోటీగా వీరంతా ధైర్యంగా నిలదొక్కుకున్నారు. కూటమి ప్రభుత్వమిచ్చిన ప్రోత్సాహకాలతో అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. పనిలో కొత్తదనానికి ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. పురుషులకు దీటుగా మెళకువలు నేర్చుకుని నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. కుటుంబానికి చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. సుమారు 200 కుటుంబాలు చేనేత పనిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సమీపంలోని వస్త్ర దుకాణాల వారు వీరి నుంచి పట్టు ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నారు. మరోపక్క చేనేత సహకార సంఘం కూడా మార్కెటింగ్ పాత్ర పోషిస్తోంది. వీరిలో కొందరిని పలుకరిస్తే...

20 ఏళ్లుగా ఇదే ఆధారం



20 ఏళ్లుగా మగ్గం నేస్తున్నాను. వేల రకాల చీరలు నేశాను, మరగ్గాలపై వచ్చే చీరలకు దీటుగామంచి డిజైన్లతో నాణ్యమైన చీరలను నేస్తున్నాను. నెలకు సుమారు రూ.10 వేల వరకు సంపాదిస్తున్నాను. కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నారు. నా భర్త కూడా ఇదే పని చేస్తున్నారు. మా ఇద్దరు అమ్మాయిలను చదివించుకుంటున్నాం.

- రోజా రమణి, నేత కార్మికురాలు, తొగటపల్లె

కుటుంబానికి ఆసరా



నేను నా భర్తతో కలిసి నేత పని చేస్తున్నాను. కుటుంబ అవసరాలకు తోడ్పడుతున్నాను. సంఘంలో రుణాలు తీసుకుని పిల్లలను చదివించుకుని పిల్లల పెళ్లిళ్ల చేశాము. ఇల్లు కట్టుకున్నాం. ఇప్పుడు నేత ఆదాయంతో రుణాలను తీర్చుకుంటున్నాం.

- కుమారి, నేత కార్మికులరా, తొగటపల్లె

మగ్గమే ఆధారం



17 ఏళ్లుగా నేత పని చేస్తున్నాను. భర్త లేరు. ఇద్దరు పిల్లలనూ నేత పనితోనే పోషించుకుంటున్నాను. వారిని చదివించుకుంటున్నాను. తీసుకున్న రుణాలు ఎప్పటికప్పుడు తీర్చుకుంటున్నాను. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాను.

- సత్య, నేత కార్మికురాలు, రంగన్నగారిగడ్డ



చేనేత మగ్గం

శ్రీవారి సేవలో నటుడు శ్రీకాంత్

తిరుమల, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు శ్రీకాంత్ బుధవారం సుప్రభాతసేవలో పాల్గొన్నారు. సతీమణి ఊహ, కుమారుడు, హీరో రోషన్‌తో కలిసి బుధవారం వేకువజాము ఆలయంలో జరిగిన సుప్రభాతసేవలో పాల్గొని గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. వీరికి ఆలయ సిబ్బంది లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం ముందు శ్రీకాంత్ కుటుంబానికి పలువురు భక్తులు ఆసక్తిగా చూశారు. కొందరు వారితో సెల్ఫీలు దిగారు.



అతిథిగృహంలో కుటుంబ సభ్యులతో శ్రీకాంత్

భక్తులు మెచ్చేలా పోలేరమ్మ జాతర: కురుగొండ్ల



జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ విష్ణువర్ధన్ రాజు తదితరులు

వెంకటగిరి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరను భక్తులు మెచ్చేలా నిర్వహిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని పింజల వీరయ్య కల్యాణ మండపంలో జాతర నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలన్నారు. జాతరకు వచ్చే ప్రతి ఒక్కరూ అమ్మవారిని సులభంగా దర్శించుకొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ సారి వీఐపీ పాసులు కేవలం ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలకు మాత్రమే అందజేస్తామని స్పష్టం చేశారు. సామాన్య భక్తులు ఇబ్బంది పడకుడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. జాతర నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.40 లక్షలు విడుదలైనట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని అమ్మవారి జాతరను విజయ వంతం చేయాలని కోరారు. జాతర నిర్వహణ ఏర్పాట్లపై గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని చెప్పారు. జాతర రోజే రూ.1.60 కోట్లతో పోలేరమ్మ ఆలయ కమర్షియల్ కాంప్లెక్స్, కల్యాణ మండపం నిర్మాణాలకు భూమిపూజ ఉంటుందన్నారు. జిల్లా ఎస్పీ విష్ణువర్ధన్ రాజు మాట్లాడుతూ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బృందాలను రప్పిస్తున్నట్లు తెలిపారు. చోరీల నియంత్రణ కోసం డ్రోన్ కెమెరాలతో పర్యవేణ ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించేందుకు మఫ్టీలో ప్రత్యేక సిబ్బందితో నిఘా ఉంచుతామన్నారు. అనంతరం జాతరకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గూడూరు డీఎస్పీ గీతా కుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పోలేరమ్మ దేవస్థానం చైర్మన్ గొల్లగుంట మురళి, ఎంపీపీ తనూజా రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిని వేధించిన యువకుడిపై కేసు

చిట్టమూరు, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థినిని వేధించడంతో పాటు దాడికి పాల్పడిన యువకుడిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక పదో తరగతి చదువుతోంది. అదే గ్రామానికి చెందిన రాజీవ్ అనే యువకుడు తనను ప్రేమించాలంటే ఏడాది నుంచి బాలికను వేధిస్తున్నాడు. బాలిక బంధువులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ రాజీవ్‌లో మార్పు రాలేదు. మంగళవారం సాయంత్రం తరగతులు పూర్తయ్యాక తోటి విద్యార్థునులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో ఉండగా రాజీవ్ మోటార్ బైక్‌పై వచ్చి తన ప్రేమను అంగీకరించాలని బాలికపై దాడికి పాల్పడ్డాడు. అనంతరం ఇంటికి వెళ్తుండగా తన అన్న ప్రేమను అంగీకరించాలంటూ రాజీవ్ సోదరి కూడా బాలికపై దాడి చేసింది. బుధవారం బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిన్న బలరామయ్య తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు సమష్టిగా పనిచేయండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, అసహాయుల సంక్షేమానికి సమష్టిగా పనిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గ్రీన్ క్లైమెట్ ఫండ్(జీసీఎఫ్) జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల అభయారణ్యం, పరిసర గ్రామాల్లో సాగు, జీవనోపాధి సంబంధిత కార్యకలాపాలపై సుదీర్ఘంగా సమీక్షించారు.వాటర్‌షెడ్ కార్యక్రమాలు స్థానిక ప్రజలకు లాభదాయకమవుతాయని తెలిపారు. ముఖ్యంగా సముద్ర శైవల సాగు, మత్స్య ఉత్పత్తులతో వలన మత్స్యకారుల ఆదాయం పెరిగే అవకాశముంటుందని, దానిపై అధికారులు దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, అధికారులు సెల్వం, జయంతి, హారిక, మహ్మద్ రఫీ, సాముయేలు, జశ్వంత్, శోభన్‌బాబు, శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

ఉడ్ ప్లాంటేషన్‌తో లాభాలు పొందవచ్చు



రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీపీఎఫ్ ప్రసంగిస్తున్న సెల్వం

మంగళం, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): టింబర్ వుడ్ ఆధారిత ప్లాంటేషన్ ద్వారా రైతులు లాభాలు పొందవచ్చని సీసీఎఫ్ సెల్వం తెలిపారు. తిరుపతిలోని బయోట్రిమ్ కార్యాలయంలో బుధవారం రైతులకు బెంగళూరుకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, అటవీశాఖ సంయుక్తంగా వెదురు, శ్రీగంధం, ఎర్రచందనం మొక్కల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. తిరుపతి పరిసర ప్రాంతాల నుంచి 70మంది రైతులు హాజరయ్యారు. టింబర్ వుడ్ ప్లాంటేషన్ ద్వారా కలిగే లాభాలు, మొక్కలను ఎలా పెంచాలి, వాటని ఎలా విక్రయించాలి అనే అంశాలపై శిక్షణ కల్పించారు. సీసీఎఫ్ సెల్వం మాట్లాడుతూ తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే రైతులు ఎర్రచందనం మొక్కలను పెంచుతున్నారన్నారు. అయితే అంతర్జాతీయ డిమాండ్‌కు తగ్గట్టుగా రేటు రాకపోవడమో, ఇతర కారణాల వల్లో రైతులు ఎర్రచందనం పెంచడం తగ్గిందన్నారు. బయోట్రిమ్ స్టేట్ సెల్వి కల్చరిస్టు నరేన్ ధిరన్ మాట్లాడుతూ ఎర్రచందనానికి ఇతర టింబర్ వుడ్‌ట్రీ కన్నా ఆదాయం ఎక్కువ వస్తుందన్నారు. రైతులు వుడ్ ప్లాంటేషన్ చేపడితే తిరుపతి జిల్లా నుంచి కూడా సరఫరా చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చరల్ అధికారి దశరథ రామిరెడ్డి, అధికారులు పవన్ కుమార్, నాగభూషణం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సైంటిస్టులు నరసింహమూర్తి, ఎంవీ దొరై పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో పవిత్రోత్సవాలు



భరద్వాజ మహర్షి, శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లకు అభిషేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): దక్షిణ కైలాసంగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం పవిత్రోత్సవాలు ఆగమోక్తంగా ప్రారంభమయ్యాయి. నిత్యపూజల్లో జరిగే దోషాలను నివారించి మూలవిరాట్లకు పునరుత్తేజం తెచ్చే విధంగా ఈ పూజలను నిర్వహిస్తుంటారు. ఐదురోజుల పాటు జరిగే పూజల్లో తొలిరోజు బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో దక్షిణామూర్తి వద్ద శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లు, భరద్వాజ మహర్షి ఉత్సవమూర్తిని కొలువు తీర్చి విశేష అభిషేకాలు చేపట్టారు. పూర్ణహారతులు సమర్పించారు. అనంతరం భరద్వాజ మహర్షి, శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లను పట్టణంలో ఊరేగించారు. భక్తులు దర్శించుకున్నారు.

పంచాయతీలకు ఆర్థిక సంఘ నిధుల విడుదల

● రేణిగుంటకు అత్యధికంగా రూ.43లక్షలు

● డీపీవో సుశీలాదేవి

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికలు జరిగిన 745 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. 2024-25 సంవత్సరానికి సంబంధించి రెండు విడతల్లో రూ.63.62కోట్ల మేర విడుదలయినట్లు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి సుశీలాదేవి తెలిపారు. తమ కార్యాలయంలో ఆమె బుధవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఈ నిధులను ప్రభుత్వం నేరుగా గ్రామ పంచాయతీ బ్యాంకు ఖాతాలకు జమ చేసిందని తెలిపారు. మొదట టైడ్ గ్రాంట్‌గా రూ.18.24కోట్లు, అన్‌టైడ్ కింద రూ.12.03కోట్లు వచ్చాయన్నారు.రెండవ విడత టైడ్ గ్రాంట్‌గా రూ.20కోట్లు, అన్‌టైడ్ కింద రూ.13.33 కోట్లు విడుదలయ్యాయని చెప్పారు. ఈమొత్తం నిధులను పంచాయతీల అభివృద్ధికి వినియోగించనున్నట్లు స్పష్టం చేశారు. జిల్లాలో అత్యధికంగా రేణిగుంట పంచాయతీకి రూ.43.03లక్షలు, అత్యల్పంగా పిచ్చాటూరు మండలం అప్పలరాజుకండ్రిగ గ్రామపంచాయతీకి రూ.53.582 జమ అయిందన్నారు. టైడ్ గ్రాంట్ కింద 50శాతం పారిశుధ్యం, మరో 50శాతం తాగునీరు, వర్షపునీటి నిల్వ,పంచాయతీల అభివృద్ధి కార్యక్రమానికి వినియోగిస్తున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేస్తే పంచాయతీకార్యదర్శులపై కఠిన చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు.

సీఐ శ్రీనివాసులుకు డీఎస్పీగా పదోన్నతి



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బీవీ శ్రీనివాసులుకు డీఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది మంది సీఐలకు ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఇందులో జిల్లా పరిధిలో 29 సంవత్సరాలుగా వివిధ హోదాల్లో పనిచేసిన శ్రీనివాసులుకు పదోన్నతి లభించింది. ఈయన 1995లో పోలీసు శాఖలో ఎస్ఐగా విధుల్లో చేరారు. మొదటిసారిగా ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని నింద్ర, వరదయ్యపాళెం, నాగలాపురం, మదనపల్లె, సత్యవేడు, ఎర్రావారిపాళెం, కలికిరి ప్రాంతాల్లో పనిచేశారు. 2011లో సీఐగా పదోన్నతి లభించింది. అక్కడి నుంచి పీటీసీలో మూడేళ్లు పనిచేశారు. అనంతరం అలిపిరి, మహిళా పోలీసుస్టేషన్, సత్యవేడు, చంద్రగిరి, తిరుపతి క్రైంలో పనిచేసి శ్రీసిటికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం డీఎస్పీగా పదోన్నతి లభించింది.

నిబద్ధత, అంకితభావంతో పనిచేయండి

● బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతిగృహాల్లోని పేద విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించడానికి బీసీ వెల్ఫేర్ అధికారులు నిబద్ధత, అంకితభావంతో పనిచేయాలని ఆ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సత్యనారాయణ కోరారు. తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో బుధవారం రాయలసీమలోని జిల్లాలకు సంబంధించిన వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారులు, సహాయ సంక్షేమ అధికారులకు సెన్స్‌టైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆ శాఖ ఎక్స్‌అఫిషియో కార్యదర్శి సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ బీసీ వెల్ఫేర్ అధికారులు వసతిగృహ విద్యార్థుల సంక్షేమం, వారి విద్యాభివృద్ధికి పాటుపడాలన్నారు. బీసీ సంక్షేమ డైరెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ వసతిగృహాల్లో ట్యూటర్లను నియమించి ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు. మెను తప్పకుండా అమలుచేయాలన్నారు. సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రాజు మాట్లాడుతూ వారం వారం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, మంచి ఫలితాలు సాధించాలని ఆదేశించారు.



సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న బాలసుబ్రమణ్యం

7న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నీ

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో ఈనెల7 రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి పి.బాలసుబ్రమణ్యం తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ బాల బాలికలకు అండర్-11, 13, 15 విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 280 మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. స్థానికంగా 25 మంది ఇప్పటికే ఈ టేబుల్ టెన్నిస్ ప్రాక్టీస్ చేస్తున్నారన్నారు. అటువంటి క్రీడాకారులను ఈ టోర్నమెంటు ద్వారా ప్రోత్సాహం అందించినట్లు అవుతుందని చెప్పారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు రవిచంద్ర, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

గరుడ వారధిపై డివైడరును ఢీకొన్న బైకు

● ఇద్దరికి బలమైన గాయాలు



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం లక్ష్మీపురం సర్కిల్ వద్ద గరుడ వారధిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. తిరుపతి కొర్లగుంటకు చెందిన రోహిణీకుమార్, అతడి స్నేహితుడు పి. రాజశేఖర్ తిరుచానూరు వైపు నుంచి గరుడ వారధిపై తిరుపతికి ద్విచక్ర వాహనంలో వస్తున్నారు. మద్యం మత్తులో వేగంగా వాహనం నడిపి లక్ష్మీపురం సర్కిల్ వద్దకు రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొన్నారు. వీరి తలకు బలమైన గాయాలు కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఈ ప్రమాదాన్ని గుర్తించిన కొందరు వాహనదారులు ఈస్ట్ పోలీసులకు సమాచారం అందించారు. రక్షక్ ఏఎస్ఐ అశోక్ ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. రోహిణీకుమార్‌కు వెంటిలేటర్‌పై.. పి.రాజశేఖర్‌కు ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. కాగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా వారి వివరాలు తెలుసుకోవడంలో ఈస్ట్ పోలీసులు సరిగా స్పందించలేదన్న ఆరోపణలున్నాయి. జరిగిన ఘటనపై రక్షక్ ఏఎస్ఐని సంప్రదించినా తమకేమి తెలియదని చెప్పడం గమనార్హం.

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10.11 లక్షల విరాళం



అదనపు ఈవోకు డీడీ అందజేస్తున్న దాత

తిరుమల, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10.11 లక్షలు విరాళంగా అందింది. గుంటూరుకు చెందిన ఆలపాటి సురేష్ ఈ విరాళాన్ని ఇచ్చారు. తిరుమలలో బుధవారం టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి దాత విరాళం డీడీని అందజేశారు.

మెడికల్ షాపులపై దాడులు

● బిల్లుల్లేని 18 రకాల మందుల గుర్తింపు



మందులను పరిశీలిస్తున్న అధికారులు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని తిరుచానూరు పద్మావతి ఇంటిగ్రేటెడ్ పాలి హాస్పిటల్లోని శ్రీపద్మావతి మందుల దుకాణంలో నిబంధనలకు విరుద్ధంగా మందులు వి క్రయిస్తున్నారనే సమాచారం రావడంతో డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో తిరుపతి, చిత్తూరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు బుధవారం రాత్రి దాడులు చేశారు. అబార్షన్‌కు ఉపయోగించే 10 రకాలు, నార్కోటిక్స్(ఎన్ఆర్ఎక్స్), బిల్లులు లేకుండా విక్రయిస్తున్న 18 రకాల మందులను గుర్తించారు. వీటిని తిరుపతిలోని పలు మందుల ఏజన్సీల నుంచి కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. అలాగే పలు ఏజన్సీలకు సంబంధించి 15 ఇన్వాయిస్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఆస్పత్రిలోని హోమియోపతి వైద్యురాలు డాక్టర్ ఎం.శైలజ రోగులకు అనధికారికంగా అబార్షన్ మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేసి, చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ దాడుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రీతు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



ధ్వజస్తంభం వద్ద కోడి ముద్దలను అందుకుంటున్న పాలక మండలి చైర్మన్ మునిశేఖర్‌రెడ్డి దంపతులు

చిట్టమూరు, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లాంలో జరుగుతున్న వళ్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ధ్వజారోహణం వైభవంగా నిర్వహించారు. ఉదయం నాదెండ్ల రామేశ్వర గురుకుల్, ఆలయ ప్రధానార్చకులు మూలంరాజు భాను ప్రకాష్‌శర్మ, బెంగళూరు కృష్ణయ్య శర్మ మంత్రోచ్చారణల నడుమ శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్దనున్న మయూరీశ్వరుడికి పూజలు చేసి ధ్వజారోహణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కోడి ముద్దలను స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ కామిరెడ్డి మునిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సోమిశెట్టి సుబ్బారావు, చెవుల రోశయ్య శెట్టి ఉభయదాతలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు చెన్నారెడ్డి చెంచురామవరెడ్డి అన్న ప్రసాద వితరణ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట, పాటలతో కూడిన విద్య అందించాలి



బాలసదనంలో రికార్డులు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ వసంతాభాయి

గూడూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట, పాటలతో కూడిన విద్యను అందించాలని ఐసీడీఎస్ పీడీ వసంతభాయి అన్నారు. బుధవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం, బాలసదనం, పలు అంగన్‌వాడీ కేంద్రాలను పీడీ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో మెహబూబి, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

చిల్లకూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేడిమాల, చింతవరం, బల్లవోలు, ఈదలవారిపాళెం అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ పీడీ వసంతభాయి తనిఖీ చేశారు. రికార్డులను, చిన్నారుల ఎత్తు, బరువును పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల హాజరు పట్టిలో ఉన్న చిన్నారులంతా పాఠశాలలకు వచ్చే చూడాలన్నారు. బాలింతలకు, గర్భిణులకు అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలన్నారు. ఆమె వెంట ప్రాజెక్టు నోడల్ అధికారిణి వాసంతి, సీడీపీవో మెహబూబి, సూపర్‌వైజర్లు రేణుకమ్మ, పద్మా తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేను వేగవంతం చేయండి

బాలాయపల్లి, సెప్టంబరు 3(ఆంధ్రజ్యోతి) స్వామిత్వ సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో వినీల్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కడగుంట గ్రామంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రామాకాంత్ పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, మెప్మా, బ్యాంక్ అధికారులు

నాయుడుపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఎన్టీఆర్ నగర్ పథకాల కింద 300 చదరపు అడుగుల ఇళ్ల కోసం సంబంధిత సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా బుధవారం తెలిపారు. నాయుడుపేట మండలం పుదూరులో నిర్మించిన టిడ్కో ఇళ్లను మెప్మా, ప్లానింగ్, టిడ్కో, బ్యాంక్ అధికారులతో కలిసి పరిశీలించారు. 365, 430 చదరపు అడుగులు ఇళ్లు మంజూరై బ్యాంక్ రుణం పొందనివారు మున్సిపాలిటీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అలాగే బ్యాంక్ నుంచి రుణం పొందని వారు ప్రభుత్వానికి నేరుగా నగదు చెల్లించవచ్చన్నారు.

ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయకండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయవద్దని ప్రముఖ స్విమ్స్ కార్డియాలజిస్టు డాక్టర్ వనజాక్షమ్మ పేర్కొన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, ఈసీజీ పరీక్షలు చేశారు. వనజాక్షమ్మ మాట్లాడుతూ ఆధునిక ఆహార అలవాట్లు, శారీరక వ్యాయామం, మానసిక ఉపశమనం లేకపోవడం వంటి సమస్యలు అనారోగ్యానికి కారణమవుతున్నాయని తెలిపారు. ధూమ, మద్యపానం వంటి దురలవాట్లు మానేయాలన్నారు. సుమారు 150 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ హరీష్, డాక్టర్ రమ్య, వర్సిటీ మెడికల్ కన్సల్టెంట్ కె.పద్మావతి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిశ్రీ పాల్గొన్నారు.

తైక్వాండోలో తిరుపతి క్రీడాకారుడికి బ్రాంజ్ మెడల్



తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం కటక్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో గత నెల 28నుంచి ఈనెల 2వరకు జరిగిన జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో తిరుపతికి చెందిన రాగిపాలెం విహాస్ బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. కైరోగి పుంసే సబ్ జూనియర్ అండర్ 38కిలోల బాలుర విభాగంలో ప్రత్యర్థిని ఓడించి అత్యధిక పాయింట్లతో గెలుపొందారు. విహాస్‌ను ఏపీ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు కృష్ణ, వెంకటేశ్వర్లు అభినందించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

నీటి సరఫరా పునరుద్ధరణ

వాకాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరు పాళెం వాటర్‌ట్యాంక్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. జలజీవన్ మిషన్ పథకం కింద నిర్మించిన వాటర్ ట్యాంక్‌కు నీటి సరఫరా నిలిచిపోవడంతో దుగరాజపట్నం పంచాయతీలోని అంజలాపురం, కొత్తూరు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమాంజలి ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టి వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరచి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

పంచాయతీలకు నిధుల విడుదల హర్షణీయం

పెళ్లకూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పంచాయతీలకు రూ.1121 కోట్ల ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయడం పట్ల సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక సంస్థల బలోపేతానికి నిధుల విడుదల చేయడం సంతోషకరమన్నారు. నిధులు విడుదల చేసిన సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

వాగ్వాదంపై కేసు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకల్లో జరిగిన వాగ్వాదంపై కేసు నమోదైంది. మార్కెట్ వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద బుధవారం సునీల్, రాజేష్ మధ్య చిన్నపాటి వాగ్వాదం జరిగింది. సునీల్ ఫిర్యాదు మేరకు రాజేష్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



కడగుంటలో అర్ధంతరంగా నిలిచిపోయిన అంగన్వాడీ భవనం పనులు - గోట్టికాడులోని అద్దె భవనం దుస్థితి - జయంపు ఎస్సీ కాలనీలో అంగన్వాడీ కేంద్రం నిర్వహిస్తున్న కమ్యునిటీ భవనం

దుస్థితిలో అంగన్వాడీ కేంద్రాలు

అద్దె భవనాల్లోనూ వసతులు అంతంత మాత్రమే ● భయాందోళనలో చిన్నారుల తల్లిదండ్రులు

బాలాయపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పలు గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల భవనాలు దుస్థితికి చేరుకున్నాయి. ఆయా కేంద్రాల్లో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుంటుందోనని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కడగుంట మెయిన్ అంగన్వాడీ కేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో కార్యకర్త ఇంట్లో నిర్వహించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తుండగా, అందులో శ్లాబు పెచ్చులూడి చిన్నపాటి వర్షం వచ్చినా ఉరుస్తోందని, దీంతో సరుకులు సర్దుకునేందుకు, చిన్నారుల సంరక్షణకు అవస్థలు పడుతున్నామని అంగన్వాడీ సిబ్బంది చెబుతున్నారు. ఈ రెండు కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు నాడు - నేడు కింద రూ.13 లక్షల చొప్పున మంజూరు చేశారు. అయితే బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా నిర్మాణాలు గోడలకే పరిమితమయ్యాయి. అదేవిధంగా గొట్టికాడు ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రం గత 15 ఏళ్లుగా దుస్థితిలో ఉన్న ఓ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేసి నిర్మాణం ప్రారంభించారు. శ్లాబు వరకు నిర్మించి నిలిపివేశారు. దీంతో ఇరుకు గదిలో అంగన్వాడీ కేంద్రాన్ని నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక జయంపు ఎస్సీ కాలనీలో అంగన్వాడీ కేంద్రానికి సొంత భవనం లేక పోవడంతో కమ్యునిటీ హాలులో నిర్వహిస్తున్నారు. ఆ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో చిన్నారులు, సిబ్బంది అసౌకర్యానికి గురవుతున్నారు. అలాగే ఎస్టీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో అక్కడి కమ్యునిటీ హాలు దిక్కయింది. నాడు - నేడు ద్వారా రూ.13 లక్షలు మంజూరు కాగా, నిర్మాణాలు చేపట్టాక బిల్లులు రాక గోడల వరకు పనులు చేసి ఆపేశారు. సుబ్రహ్మణ్యం గ్రామంలో ఏళ్ల నాటి భవనంలో అంగన్వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. భవనం గోడలకు పగుళ్ల రావడంతో పాటు చుట్టూ ముళ్ల చెట్లు పెరిగిపోయి విష సర్పాలకు నిలయంగా మారిందని చిన్నారుల తల్లదండ్రులు ఆదోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చొరవ తీసుకుని మండంలోని అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని చిన్నారుల తల్లదండ్రులు కోరుతున్నారు.

రౌడీయిజాన్ని అణచివేసేందుకు ప్రత్యేక నిఘా: ఎస్పీ



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

గూడూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రౌడీయిజాన్ని అణచివేసేందుకు రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. బుధవారం గూడూరు రూరల్, ఒకటో పట్టణ, రెండోపట్టణ పోలీస్ స్టేషన్‌లను ఆయన తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నేరాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రధానంగా అరుణ, శ్రీకాంత్ వ్యవహారంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, వీరి వ్యవహారంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధాలు ఉన్న కొంతమందిని అరెస్ట్ చేయడం, మరికొంతమందిని బైండోవర్ చేసుకోవడం జరిగిందన్నారు. సూళ్లూరుపేటలో జరిగిన ఓ కేసుకు సంబంధించి రీ ఇన్వెస్టిగేషన్ చేస్తున్నావని తెలిపారు. గూడూరు సబ్‌డివిజన్‌కు సంబంధించి ప్రత్యేకంగా డ్రోన్ కెమెరాలను అందజేశామని, వీటి సాయంతో అసాంఘిక కార్యకలపాలు జరుగుతున్న ప్రాంతాల్లో పహారా కాయడం జరుగుతుందన్నారు. గంజాయి స్థావరాలపై నిఘా పెట్టి కట్టడి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని, మోటారు సైకిళ్ల, ఇతర దొంగతనాలను అరికట్టేందుకు నిఘాను ముమ్మరం చేస్తున్నామని పేర్కొన్నారు. సిబ్బంది పనితీరును మెరుగుపరుచుకుని సమస్యలపై వచ్చే ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని, ప్రజలతో సఖ్యతగా మెలుగుతూ వారికి అండగా ఉంటున్నామని భరోసాను కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ గీతాకుమారి, సీఐలు కిషోర్‌బాబు, శేఖర్‌బాబు, శ్రీనివాస్, హుస్సేన్‌బాషా, ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటగిరి: పట్టణ పోలీసు స్టేషన్‌ను ఎస్పీ విష్ణువర్ధన్ రాజు తనిఖీ చేశారు. జాతర నిర్వహించే ప్రాంతాలను పరిశీలించి పోలీసులకు తగు సూచనలు చేశారు. ఆయన వెంట గూడూరు డీఎస్పీ గీతా కుమారి, వెంకటగిరి సీఐ రమణ, ఎస్ఐలు ఏడుకొండలు, శివశంకర్, గోపి తదితరులు ఉన్నారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ



ఆహార పొట్లాలను అందజేస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతిసేవా సంస్థ కార్యాలయంలో బుధవారం రమేష్ దాతృత్వంతో పేదలకు ఆహారపొట్లాలు, గొడుగులు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాము, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని పీర్లచావడి వద్ద వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం భక్తులకు అన్నదానం చేశారు. గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాండురంగ యాదవ్ ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. అదేవిధంగా టీడీపీ కార్యాలయం వద్దనున్న అభయ శంకరుడి ఆలయంలోనూ అన్నదానం చేశారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో మల్లికార్జునరావు

తడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయుల ఆటల పోటీలను బుధవారం ఎంఈవో మల్లికార్జునరావు ప్రారంభించారు. మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన వారికి శుక్రవారం జరిగే ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో బహుమతులను పంపిణీ చేయనున్నారు.

అనధికారిక హాకర్లను తొలగించాలి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుమలలో స్థానికేతరుల అనధికారిక వ్యాపారాలతో గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించడంతో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని పరిరక్షణ సేన సభ్యుడు కోలా లక్ష్మీపతి ఆందోళన వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ అనధికారిక హాకర్లను తొలగించాలని సూచించారు. ఇప్పటికైనా పాలకమండలి తీర్మానం మేరకు చర్యలు తీసుకోకపోతే టీటీడీ పరిపాలనా భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సభ్యులు కృష్ణ, వాసు పాల్గొన్నారు.

పోలీసుల వైఫల్యంతోనే రౌడీయిజం

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పోలీసుల వైఫల్యం వల్లే తిరుపతిలో రౌడీయిజం పెరుగుతోందని వామపక్ష నాయకులు అభిప్రాయపడ్డారు. బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.రామానాయుడు మాట్లాడుతూ తిరుపతిలో వీధి రౌడీలు రాజకీయ గుండాలుగా మారి భూకబ్జాలు చేస్తూ అడ్డొచ్చిన వారిపై దాడులకు దిగుతున్నారని తెలిపారు. రాజకీయ ఒత్తిడితో పోలీసులు పట్టించుకోవడం లేదని, కొన్ని సందర్భాల్లో వారికి రక్షణగా నిలుస్తున్నారని ఆరోపించారు. ఇందుకు గాంధీపురంలో స్థలం ఆక్రమించిన సంఘటన నిదర్శనంగా నిలుస్తోందన్నారు. విశ్రాంత జడ్జి గుర్రప్ప నాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాయపనేని హరికృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ ఎమ్మార్‌పల్లె సీఐ గాంధీపురంలోని ఒక స్థలం విషయంలో ఆక్రమణదారులకు అండగా నిలిచారని ఆరోపించారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

కోట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కోట మండలంలో నలుగురు ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు ఎంఈవోలు శిరీషా, మస్తానయ్య బుధవారం తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఎ.సుజాత(చెందోడు), ఎ.వినీత(జరుగుమల్లి), సీహెచ్ దైవకృప(ఎన్‌సీ కొత్తపాళెం), పి.గీత(గూడలి)లకు ఈనెల 5న జరిగే ఉపాధ్యాయ దినోత్సవంలో షీల్డ్‌లు, మెమెంటోలతో అభినందించడం జరుగుతుందని ఎంఈవోలు తెలిపారు.

ఉట్టి ఉత్సవాలు

చిల్లకూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఉట్టి ఉత్సవాలు, అన్నప్రసాద వితరణ జరిగాయి. తొమ్మిదవ రోజైన గురువారం వినాయక ప్రతిమలను నిమజ్జనానికి తరలిస్తుండడంతో బుధవారం ఉట్టి ఉత్సవాలు, అన్నప్రసాద వితరణ చేపట్టారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ నాగార్జునసాగర్

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని, రైతులు అధైర్యపడకుండా పంటలను సాగుచేసుకోచ్చని నాయుడుపేట ఏడీఏ నాగార్జునసాగర్ అన్నారు. బుధవారం నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలోని ఐసీడీఎస్ సమావేశ మందిరంలో ఆర్ఎస్‌కే ఇన్‌చార్జిలకు పీఎం-ఆర్‌కేవీవై పథకంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రబీ సీజన్‌కు అవసరమైన కొత్త రకాల గురించి, వరిలో కలుపు, ఎరువుల యాజమాన్యంపై పలు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం తిరుపతి డీఆర్‌సీ సిబ్బంది నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏవోలు శ్రీనివాస్, మహేష్, నాయుడుపేట వ్యవసాయశాఖ అధికారి గణేష్ పాల్గొన్నారు.

స్వర్ణముఖి నదిలో ఆక్రమణలపై చర్యలను స్వాగతిస్తున్నాం

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి నదీ పరివాహక ప్రాంతాల్లో ఆక్రమణలపై చర్యలకు తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నట్లు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.రామానాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నది ప్రాంతాన్ని ఆక్రమించి ప్లాట్లు వేసి విక్రయాలు చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోయిన వారికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

షెడ్యూల్ కులాల మహిళలకు భారీ మోటార్ డ్రైవింగ్ శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర షెడ్యూల్ కులాల సహకార ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా షెడ్యూల్ కులాల మహిళలకు ఉచితంగా భారీ మోటారు డ్రైవింగ్(హెవీ డ్రైవింగ్) శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. లైట్ మోటార్ వెహికల్ లైసెన్సు కలిగిన వారు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఏపీఎస్‌ఆర్టీసీ డిపో మేనేజరు ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తారని, మరిన్ని వివరాలకు 9959015657ను సంప్రదించాలని కోరారు.

యువత ఉపాధి కల్పనకు కృషి

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నూతన ఎంఎస్‌ఎంఈ పరిశ్రమల స్థాపనకు, యువతకు మెరుగైన ఉపాధి కల్పించేందుకు పరిశ్రమల శాఖ అధికారులు కృషి చేయాలని జేసీ శుభం బన్సల్ అన్నారు. కలెక్టరేట్‌లో పరిశ్రమల శాఖ అధికారులతో బుధవారం జేసీ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సింగిల్‌డెస్క్ విధానంలో 2025 మే నుంచి 2,231 పరిశ్రమలకు గాను 2,183కు అనుమతులు ఇచ్చామని, మరో 44 పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. 46 పరిశ్రమలకు ప్రోత్సాహకాలు రూ.4.43కోట్లు అందించడానికి ఆమోదం తెలిపారు.

దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేది గురువులే



ఉపాధ్యాయులకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, సెప్టెంబరు 3: దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేది గురువులేనని, వారు క్రీడల్లోనూ ప్రతిభ చూపడం ఆనందదాయకమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఏఆరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు విద్యాబోధనతో పాటు శారీరక ధృడత్వం, మానసిక ఉల్లాసం ఎంతో అవసరమన్నారు. ఉపాధ్యాయులు ఆరోగ్యంగా ఉంటేనే విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని నింపగలరన్నారు. ఉపాధ్యాయులకు ఆటవిడుపుగా 20 మండలాల జట్లతో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల్లో విజేతగా నిలిచిన మనుబోలు, రన్నర్‌గా నిలిచిన దొరవారిసత్రం మండలాల జట్లకు ట్రోఫీలను, ఉత్తమ ప్రతిభ చాటిన వారికి ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ పోటీల నిర్వహించేందుకు ముందుకు వచ్చిన ప్రగతి సేవాసంస్థ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, డాక్టర్ రమణయ్య, కరిముల్లా, రామరాజు, రామ్మోహన్‌రావు, ప్రజేంద్రరెడ్డి, శ్యామ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్‌లో హద్దురాళ్ల తొలగింపు



అక్రమ లేఅవుట్‌లో హద్దురాళ్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నాయుడుపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సప్తగిరి కాలనీ కట్ట దిగువ భాగాన వేసిన అక్రమ లేఅవుట్‌లో సరిహద్దు రాళ్లను మున్సిపల్ సిబ్బంది బుధవారం తొలగించారు. అక్రమ లేఅవుట్‌పై ఆంధ్రజ్యోతిలో మంగళవారం కథనం ప్రచురించడంతో మున్సిపల్ కమిషనర్ స్పందించారు. అక్రమ లేఅవుట్‌లోని సరిహద్దు రాళ్లను తొలగించారు. అక్రమ లేఅవుట్ దారులకు నోటీసులు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

ఇసుక, గ్రావెల్ మాఫియాదే రాజ్యం: చింతామోహన్




ఆర్డీవో కార్యాలయ సమీపంలో చింతామోహన్, కాంగ్రెస్ నేతల నిరసన

సూళ్లూరుపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్ మాఫియా రాజ్యమేలుతోందని, అవినీతిని అరికట్టడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయ సమీపంలో ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చింతా మోహన్ మాట్లాడుతూ ప్రకృతి సంపదను కొల్లగొట్టి సరిహద్దులు దాటిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అధికార పార్టీకి చెందిన వారే ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్నారన్నారని ఆరోపించారు. రాష్ట్రంలో వాట్సాప్ పరిపాలన కన్నా వాటాల పాలన సాగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చందనమూడి శివ, గాడి వెంకటయ్య, కృష్ణయ్య, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

మతసామరస్యంతోనే సమాజాభివృద్ధి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మత సామరస్య భావన పెంపొందించుకోవడంతోనే సమాజం నిజమైన అభివృద్ధిని సాధించినట్టు అవుతుందని ఎస్వీయూ ఉమెన్ స్టడీస్ డైరెక్టర్ సాయి సుజాత పేర్కొన్నారు. ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ స్కూల్లో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చిన్ననాటి నుంచి విద్యార్థులకు మత సామరస్యం పట్ల అవగాహన కలిగించాలన్నారు. భిన్నత్వంలో ఏకత్వం భారతీయుల ఔన్నత్యమని గుర్తు చేశారు. పద్మావతి వర్సిటీ ఉమెన్ స్టడీస్ ప్రాజెక్టు అసోసియేట్ డాక్టర్ చైతన్య మాట్లాడుతూ కుల, మత, లింగ, వర్ణ విభేదాలను అధిగమించి ప్రతి ఒక్కరూ శాంతి, ప్రేమతత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం మత సామరస్య అవగాహన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షకీనమ్మ, ఎస్వీయూ ఉమెన్ స్టడీస్ అకడమిక్ కన్సల్టెంట్లు రాజరాజేశ్వరి, రమణ, జగదీశ్వరి, సునీత పాల్గొన్నారు.



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సాయి సుజాత తదితరులు